DTCP & RERA
APPROVED
PLOTS
@SHADNAGAR
905 905 4448

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

DREAM
PROPERTY..!
@SHADNAGAR
905 905 4448

శనివారం | 14-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 59 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: తదియ మ.3.47 తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.12.22 తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.7.41-9.21, తె.4.28-6.06, దుర్ముహూర్తం: ఉ.5.44-7.28, అమృతఘడియలు: సా.5.41-7.21, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.46 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

RERA NO: P01400006286
TL.P NO 36/2022/H

DREAM
PROPERTY..!

సిరులసీమ 2 లో

రిసార్ట్ ని ఆనుకుని అద్భుతంగా అభివృద్ధి చేసిన
ప్రీమియం రెసిడెన్షియల్ ప్లాట్స్ అందుబాటులో ఉన్నాయి


DTCP & RERA APPROVED

ప్లాట్ పరిమాణాలు...
165,200,267,400 చ.గ.ల నుండి 1000 చ.గ.ల వరకు

తిరుమలాపూర్ (బాలానగర్) షాద్‌నగర్

TERMS & CONDITIONS APPLY





SWARGASEEMA
SANDALWOOD FARMS PVT. LTD.
adds big results...

చంద్ర చంద్రశేఖర్, మేనేజింగ్ డైరెక్టర్

90590 54445, 90590 54446, 90300 66559, 90300 88559

CREDAI HYDERABAD
TS RERA
www.swargaseema.com

స్వదేశానికి గంభీర్



బెకెన్‌హామ్: భారత క్రికెట్ జట్టు కోచ్ గౌతం గంభీర్ శుక్రవారం స్వదేశానికి తిరుగు పయనమయ్యాడు. ఇటీవల గంభీర్ తల్లికి గుండెపోటు రావడంతో ఆమెను స్థానిక గంగారాం ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో తల్లిని పరామర్శించేందుకు గంభీర్ అత్యవసరంగా భారత్‌కు రావాల్సి వచ్చింది. ఈనెల 20 నుంచి ఇంగ్లండ్‌తో తొలి టెస్టు మొదలవనుంది. అయితే గంభీర్ తిరిగి జట్టుతో ఎప్పుడు చేరతాడనే విషయంలో స్పష్టత లేదు. అలాగే ప్రస్తుతం భారత జట్టు ఇండియా 'ఎ'తో నాలుగు రోజుల ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడుతోంది. దీంతో గంభీర్ గైర్హాజరీలో జట్టు కోచింగ్ బాధ్యతలు అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే పర్యవేక్షిస్తున్నాడు.

చివరి సన్నాహకం ప్రారంభం

భారత్ 'ఎ'తో సీనియర్ల ప్రాక్టీస్ మ్యాచ్

బెకెన్‌హామ్ (కెంట్): ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు భారత జట్టు చివరి సన్నాహకం ప్రారంభించింది. ఇందులో భాగంగా అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్సీలోని భారత్ 'ఎ'తో సీనియర్ జట్టు ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌ను శుక్రవారం ప్రారంభించింది. నాలుగు రోజుల ఈ మ్యాచ్‌లో..తొలి రోజు పలువురు సీనియర్లు బ్యాటింగ్‌కు దిగారు. కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్ అర్ధ శతకాలు సాధించారు. టెస్ట్ మ్యాచ్ సమయంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితుల ఆధారంగా బ్యాటర్లు, బౌలర్లతో ప్రాక్టీస్ చేయించాలని జట్టు యాజమాన్యం నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే ఈ మ్యాచ్‌లో ఒక్కో బౌలర్ రోజూ కనీసం 15 ఓవర్లు వేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. కాగా, అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు సంతాపంగా భారత ఆటగాళ్లు చేతులకు నల్ల బ్యాండ్ ధరించి మ్యాచ్‌లో పాల్గొన్నారు.

టాప్‌లో ఎంజీడీ1 జట్టు

వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టీమ్ చెస్

లండన్: భారత్‌కు చెందిన అథర్వ టయాడే రాణించిన వేళ ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో.. ఎంజీడీ1 జట్టు అగ్రస్థానంలో నిలిచింది. టోర్నీలో ఆడిన 8 మ్యాచ్‌ల్లోనూ అథర్వ గెలవడం విశేషం. 6 విజయాలు, ఒక డ్రా, ఒక ఓటమితో రెండోరోజు తర్వాత 13 మ్యాచ్ పాయింట్లతో అర్జున్ ఇరిగేసి ఆధ్వర్యంలోని ఎంజీడీ1 జట్టు హెక్సామైండ్ టీమ్‌తో కలిసి సంయుక్తంగా టాప్‌లో కొనసాగుతోంది. విశ్వనాథన్ ఆనంద్ సారథ్యంలోని ఫ్రీడమ్ జట్టు (12 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచింది.

చరిత్రకు చేరువలో..

విజయానికి 69 పరుగుల దూరంలో సఫారీలు

డబ్ల్యూటీసీ ఫైనల్

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 213/2

- మార్‌క్రమ్ అజేయ శతకం
- ఆసీస్ రెండో ఇన్నింగ్స్ 207 ఆలౌట్
- రబాడకు నాలుగు వికెట్లు



మార్‌క్రమ్ (102 బ్యాటింగ్)

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో దక్షిణాఫ్రికా అద్భుతంగా కోలుకుంది. రెండు రోజులపాటు బౌలర్లు ఆధిపత్యం చూపిన చోట.. ఆ జట్టు బ్యాటర్లు చరిత్రను సృష్టించేందుకు సిద్ధమయ్యారు. 282 పరుగుల కష్టసాధ్యమైన ఛేదన కోసం బరిలోకి దిగిన సఫారీలకు ఓపెనర్ మార్‌క్రమ్ (159 బంతుల్లో 11 ఫోర్లతో 102 బ్యాటింగ్) అజేయ శతకం, కెప్టెన్ బవుమా (121 బంతుల్లో 5 ఫోర్లతో 65 బ్యాటింగ్) నిలకడైన ఆటతీరుతో అండగా నిలిచారు. దీంతో ఇన్నాళ్లూ తమకందకుండా ఊరిస్తున్న ఐసీసీ టైటిల్‌కు ఆ జట్టు కేవలం 69 పరుగుల దూరంలో నిలిచింది. శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 213/2 స్కోరుతో ఉంది. క్రీజులో ఉన్న మార్‌క్రమ్, బవుమా మూడో వికెట్‌కు అజేయంగా 143 పరుగులు జత చేయగా.. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప శనివారం వీరి చరిత్రాత్మక విజయం ఖాయంలా కనిపిస్తోంది. స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకు ఆలౌటైంది. స్టార్క్ (58 నాటౌట్) హాఫ్ సెంచరీ సాధించాడు. రబాడకు నాలుగు, ఎన్‌గిడికి మూడు వికెట్లు దక్కాయి. మరోవైపు ఎయిరిండియా విమాన ప్రమాద మృతులకు నివాళిగా ఇరు జట్ల ఆటగాళ్లు నల్ల బ్యాండ్లు ధరించి ఆడారు.



బవుమా (65 బ్యాటింగ్)

స్టార్క్ అండగా పోరాటం: ఓవర్‌నైట్ స్కోరు 144/8తో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్ మరో 63 పరుగులు జోడించింది. లియోన్ (2)ను ఆరంభంలోనే రబాడ ఎల్బీ చేయగా.. ఆఖరి వికెట్‌కు హాజెల్‌వుడ్‌తో కలిసి స్టార్క్ అద్భుతంగా పోరాడాడు. ఇద్దరూ ఓపిగ్గా ఆడి సఫారీ బౌలర్లను విసిగించారు. ఈ జోడీ 22.2 ఓవర్లు ఆడగా.. ఈ క్రమంలో స్టార్క్ హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. ఎట్టకేలకు 65వ ఓవర్‌లో హాజెల్‌వుడ్‌ను మార్‌క్రమ్ అవుట్ చేయడంతో పదో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

శతక భాగస్వామ్యంతో..: రెండో సెషన్‌లో 282 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు పరిస్థితులు కూడా చక్కగా అనుకూలించాయి. తొలి రెండు రోజుల మాదిరి కాకుండా ఎండ కాయడంతో పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది. కొత్తబంతి చక్కగా స్వింగ్ అవుతున్నప్పటికీ బ్యాటర్లు దీటుగా ఎదుర్కొన్నారు. ఓపెనర్ రికెల్టన్ (6) మూడో ఓవర్‌లో వెనుదిరిగినా మార్‌క్రమ్ జట్టుకు అండగా నిలిచాడు. ముల్డర్ (27)తో కలిసి రెండో వికెట్‌కు 61 రన్స్ జోడించాడు. అనంతరం అతడికి బవుమా జత కలవడంతో ఆసీస్ బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. రిస్కీషాట్లకు వెళ్లకుండా జాగ్రత్తగా ఆడేస్తూ మార్‌క్రమ్ సెంచరీతో, బవుమా హాఫ్ సెంచరీలతో ఆఖరి సెషన్‌ను వికెట్ కోల్పోకుండా ముగించారు.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్.
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్.
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59).
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 213/2 (మార్‌క్రమ్ 102 బ్యాటింగ్, బవుమా 65 బ్యాటింగ్; స్టార్క్ 2/53).

1 టెస్టుల్లో 9, అంతకంటే దిగువ బ్యాటర్‌గా వచ్చి ఎక్కువ హాఫ్ సెంచరీ (9)లు సాధించిన బ్యాటర్‌గా స్టార్క్

2 టెస్టు చరిత్రలో ఆఖరి వికెట్‌కు మూడుసార్లు 50+ పరుగుల భాగస్వామ్యం అందించిన రెండో జోడీగా స్టార్క్-హాజెల్‌వుడ్. గతంలో వాట్లింగ్-బౌల్ట్ (కివీస్) ఉన్నారు.

పసిడి పట్టేసింది

షూటింగ్ వరల్డ్‌కప్‌లో సురుచి సంచలనం



మ్యూనిచ్ (జర్మనీ): భారత యువ షూటర్ సురుచి సింగ్ మరోసారి సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. 19 ఏళ్ల ఈ హరియాణా స్టార్ ఈ ఏడాది వరుసగా మూడోసారి ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో వ్యక్తిగత స్వర్ణం కొల్లగొట్టింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో సురుచి 241.9 పాయింట్లు స్కోరు చేసి చాంపియన్‌గా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ రన్నరప్, ఫ్రాన్స్ షూటర్ కామిల్లె (241.7) రజతానికి, చైనాకు చెందిన యావో కియాన్‌గ్జువాన్ (221.7) కాంస్యానికి పరిమితమయ్యారు. ప్రస్తుత వరల్డ్ కప్‌లో భారత్‌కిదే తొలి పసిడి పతకం. ఇప్పటికే అంజుమ్, సిఫ్ట్ కౌర్ కాంస్యాలు నెగ్గారు. ఇక.. ఈ ఏడాది ఆరంభంలో బ్యూనస్ ఎయిర్స్, లిమా వేదికల్లో జరిగిన వరల్డ్ కప్‌లలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సురుచి రెండు స్వర్ణాలు నెగ్గిన సంగతి తెలిసిందే.

ఫిన్ అలెన్ రికార్డు శతకం

ఓక్లాండ్: ఐపీఎల్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిన న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ టీ20ల్లో రికార్డు సృష్టించాడు. శుక్రవారం యూఎస్‌లో ఆరంభమైన మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ)లో శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ జట్టు తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగిన అలెన్.. 5 ఫోర్లు, 19 సిక్సర్లతో 51 బంతుల్లోనే 151 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో పొట్టి ఫార్మాట్‌లో పలు రికార్డులు బద్దలుకొట్టాడు. టీ20ల్లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా క్రిస్ గేల్, సాహిల్ చౌహన్ (18)లను అధిగమించాడు. అలాగే ఈ ఫార్మాట్‌లో వేగంగా (49 బంతుల్లో) 150 పరుగులు సాధించిన ఆటగాడయ్యాడు. ఇక 34 బంతుల్లో మెరుపు శతకంతో ఎంఎల్‌సీలో అలెన్ రికార్డు నెలకొల్పాడు. ఈ మ్యాచ్‌లో శాన్‌ఫ్రాన్సిస్కో 269/5 స్కోరు చేయగా, ప్రత్యర్థి వాషింగ్టన్ ఫ్రీడమ్ 146 పరుగులకే కుప్పకూలింది.



ఆ ఇద్దరిలా నన్ను ఆదరించలేదు..

- జొకోవిచ్ ఆవేదన



న్యూఢిల్లీ: అధునాతన టెన్నిస్‌లో రోజర్ ఫెడరర్, రఫెల్ నడాల్, నొవాక్ జొకోవిచ్ దిగ్గజ త్రయం. అయితే అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ప్లేయర్‌గా ఫెడరర్, నడాల్‌ను అధిగమించి ముందువరుసలో ఉంటాడు జొకోవిచ్. ఫెడెక్స్, రఫా ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించినా..జొకో మాత్రం ఇంకా ఆటలో కొనసాగుతున్నాడు. కానీ, టెన్నిస్ అభిమానులు ఫెడరర్, నడాల్‌ను ప్రేమించినంతగా తనను ప్రేమించలేదని జొకో వాపోయాడు. 'ఫెడరర్, నడాల్‌పై చూపిన ప్రేమను టెన్నిస్ ఫ్యాన్స్ నాపై చూపలేదు. బహుశా నేను ఆ ఇద్దరి స్థాయి ఆటగాడిని కాదేమోనని భావించారేమో' అని జొకో అభిప్రాయపడ్డాడు. 'వారిద్దరితో సమానంగా అభిమానులు ఆదరించకపోవడం నన్ను బాధించింది. ఫెడెక్స్, రఫా స్థాయిలో అభిమానుల మద్దతు పొందేందుకు ఆట పరంగా నా ప్రత్యేకతను నిరూపించుకొనేందు ఎంతో ప్రయత్నించా' అని ఓ ఇంటర్వ్యూలో జొకో తన మనసులోని ఆవేదనను వెలిబుచ్చాడు.

సోఫీ వచ్చేసింది

భారత్‌తో టీ20లకు ఇంగ్లండ్ మహిళల జట్టు



లండన్: ఈనెల 28 నుంచి భారత్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 14 మంది సభ్యులతో కూడిన ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టును ప్రకటించారు. కొన్నిరోజుల క్రితం క్రికెట్ నుంచి తాత్కాలిక విరామం తీసుకున్న స్టార్ స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ తిరిగి జట్టులోకి వచ్చింది. నాట్ షివర్ బ్రంట్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఇంగ్లండ్‌లో పర్యటించనున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత్ తొలుత టీ20లు, తర్వాత 3 వన్డేల సిరీస్‌లో తలపడనుంది.

హాకీ అమ్మాయిల హ్యాట్రిక్

ఆంట్వెర్ప్ (బెల్జియం): ఐరోపా టూర్‌లో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ సత్తా చాటింది. శుక్రవారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 3-2తో బెల్జియంను చిత్తుచేసి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది.

ప్రపంచకప్ గ్రూప్-సిలో భారత్: ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి చిలీలోని శాంటియాగో వేదికగా జరిగే హాకీ మహిళల జూనియర్ ప్రపంచకప్‌లో పటిష్ఠ జర్మనీ, ఐర్లాండ్, నమీబియాలతో కలిసి భారత్ గ్రూప్-సిలో చోటు దక్కించుకుంది.

బంగారం మళ్లీ లక్ష

రికార్డు స్థాయికి వెండి



న్యూఢిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతలతో శుక్రవారం బులియన్ మార్కెట్ రేసుగుర్రంలా పరిగెత్తింది. ఢిల్లీలో 10 గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.2,200 లాభంతో రూ.1,01,540ని తాకింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న నమోదైన రికార్డు ధర రూ.1,01,600తో పోలిస్తే ఇది రూ.60 మాత్రమే తక్కువ. కిలో వెండి ధర రూ.1,100 లాభంతో రూ.1,08,200కు చేరి సరికొత్త రికార్డును నెలకొల్పింది. తెలుగు రాష్ట్రాల్లోనూ 10 గ్రాముల మేలిమి పసిడి ధర శుక్రవారం రూ.1.02 లక్షలపైన ట్రేడైంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,000 లాభంతో రూ.1.2 లక్షలకు చేరింది. మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజ్‌లోనూ ఆగస్టులో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి పసిడి ధర శుక్రవారం ట్రేడింగ్ ప్రారంభంలోనే రూ.2,011 లాభంతో రూ.1,00,403 రికార్డు స్థాయికి చేరింది.

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పరుగు: అంతర్జాతీయ మార్కెట్లలోనూ పసిడి ధర సెగలు కక్కుతోంది. గురువారం 3,386 డాలర్ల వద్ద వద్ద ముగిసిన ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర శుక్రవారం ఒక దశలో 57.19 డాలర్ల లాభంతో 3,343 డాలర్ల (సుమారు రూ.2,87,732) స్థాయికి చేరింది. ఏప్రిల్‌లో నమోదైన రికార్డు ధర 3,509 డాలర్ల కంటే ఇది 166 డాలర్లు తక్కువ. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ఔన్స్ పసిడి ధర అంతర్జాతీయ మార్కెట్‌లో త్వరలోనే 3,550 డాలర్లకు చేరే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ సంస్థ (కమొడిటీస్ రీసెర్చి) విభాగం ఏవీపీ కయనత్ చైన్‌వాలా తెలిపారు. ఔన్స్ ధర 3,400 డాలర్ల పైన ట్రేడైనంత వరకు పసిడికి ఢోకా ఉండకపోవచ్చన్నారు. ఒకవేళ పడినా 3,240 డాలర్ల వద్ద గట్టి మద్దతు లభిస్తుందన్నారు.

ర్యాలీకి కారణాలు

- ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ప్రారంభమైన పోరు.
- పెట్టుబడుల రక్షణ కోసం పసిడి కొనుగోళ్లు పెరగడం.
- అమెరికా వాణిజ్య సుంకాలపై కొనసాగుతున్న అనిశ్చితి.
- అమెరికాలో వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయనే అంచనాలు.
- పడిపోతున్న డాలర్ మారకం రేటు.
- అమెరికా ద్రవ్య లోటు రికార్డు స్థాయిలో ఏడు శాతానికి చేరడం.
- అమెరికా అప్పుల కుప్పగా మారడం.

వడ్డీ రేట్లు తగ్గించిన ఎస్‌బీఐ

ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ గృహ రుణాలపై వడ్డీరేటు అర శాతం తగ్గించింది. దీంతో గృహ రుణాలపై ఎస్‌బీఐ వసూలు చేసే కనీస వడ్డీ ప్రస్తుత 8.65% నుంచి 8.15 శాతానికి తగ్గనుంది. ప్రత్యేక డిపాజిట్ పథకాలపై చెల్లించే వడ్డీ రేటు కూడా పావు శాతం కుదించింది. ఆదివారం నుంచే ఈ తగ్గింపులు అమల్లోకి వస్తాయని తెలిపింది.

ఏఎండీ నుంచి ఎం1350 సీరీస్ జీపీయూ

శాన్‌జోస్: చిప్‌ల తయారీలోని అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్ (ఏఎండీ) ఎం1350 సీరీస్ గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్‌ను (జీపీయూ) మార్కెట్లోకి తెచ్చింది. జీపీయూ మార్కెట్లో అగ్రగామి కంపెనీల్లో ఒకటైన ఎన్‌విడియాకు ఇది పోటీ ఇస్తుంది. పాతతరం జీపీయూలతో పోల్చితే నాలుగు రెట్లు అధిక సామర్థ్యం కలిగిన ఈ జీపీయూ ప్రస్తుతం ఉత్పత్తి దశలో ఉందని, మూడో త్రైమాసికం నుంచి కస్టమర్లకు అందుబాటులో ఉంటుందని కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ లిసా సూ చెప్పారు. ఏ టెక్నాలజీ అయినా డెవలపర్ కమ్యూనిటీకి అందుబాటులో ఉన్నప్పుడే ఇన్నోవేషన్‌కు ఆస్కారం ఉంటుందని, ఈ విశ్వాసంతోనే తాము దీనికి సంబంధించిన డెవలపర్ క్లౌడ్ యాక్సెస్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నామని ఆమె అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,400 ▲	92,950 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,200 ▲	94,000 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,02,530 ▲	92,950 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,400 ▲	92,950 ▲	1,09,000 ▼
ప్రొద్దుటూరు	98,200 ▲	90,340 ▲	1,00,050 ▼
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

క్రూడ్ భగ్గు



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో భారీగా పెరిగిన ముడిచమురు ధర

- ఒకదశలో 78.50 డాలర్లకు చేరిన రేటు
- త్వరలో 80 డాలర్లు దాటే అవకాశం

అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ముడిచమురు ధరలు ఒక్క రోజులో భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ఒక దశలో 78.50 డాలర్లకు ఎగబాకినప్పటికీ.. మళ్లీ కాస్త తగ్గి 74.80 డాలర్ల వద్ద స్థిరపడింది. ముడిచమురు ఎగుమతి దేశాల్లో ఒకటైన ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడం ఇందుకు ప్రధాన కారణం. అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా మన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లోనూ జూన్ డెలివరీ క్రూడ్ కాంట్రాక్టు ధర ప్రారంభ ట్రేడింగ్‌లో ఏకంగా 10.08 శాతం (రూ.578) పెరిగి సరికొత్త గరిష్ఠ స్థాయి రూ.6,311కి ఎగబాకింది. ఆ తర్వాత కాస్త తగ్గి 7.38 శాతం పెరుగుదలతో రూ.6,156 స్థాయిలో ట్రేడైంది. ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే బ్రెంట్ క్రూడాయిల్ రేటు 80 డాలర్లు దాటేయవచ్చని కమోడిటీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడి చేసిన ఇజ్రాయెల్.. ఆ దేశ చమురు కేంద్రాలను మాత్రం తాకలేదు. ప్రస్తుతం ఇరాన్ 21 లక్షల బ్యారెళ్ల ముడిచమురును ఎగుమతి చేస్తోంది. భవిష్యత్‌లో ఇజ్రాయెల్ ఇరాన్ చమురు సరఫరాకు భంగం కలిగించినా, ఇరాన్ స్ట్రెయిట్ ఆఫ్ హార్మజ్ నుంచి ఆయిల్ సరఫరాను అడ్డుకున్నా ధరలు మళ్లీ 100 డాలర్ల దిశగా దూసుకెళ్లవచ్చన్న ఆందోళనలూ వ్యక్తమవుతున్నాయి. ప్రపంచ క్రూడ్ సరఫరాలో 20 శాతం ఈ సముద్ర మార్గం ద్వారానే జరుగుతుండడమే ఇందుకు కారణం

ఇంధనం, ఎయిర్‌లైన్స్, పెయింట్స్ షేర్లు డౌన్

ముడిచమురు ధరల పెరుగుదలతో ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి దేశీయ ఇంధన విక్రయ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుంది. క్రూడ్ ధర ఒక డాలర్ పెరిగితే, మన ఇంధన కంపెనీల లాభానికి రూ.200-300 కోట్ల వరకు గండి పడుతుందని అంచనా. పెయింట్ల కంపెనీల తయారీ వ్యయాల్లో సగం వాటా ముడిచమురుదే. ఈ నేపథ్యంలో ఇంధన, ఎయిర్‌లైన్స్, పెయింట్స్, టైర్ల తయారీ సంస్థల షేర్లు గణనీయంగా నష్టపోయాయి. ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ కంపెనీలైన ఐఓసీ షేరు బీఎస్ఈలో 1.78 శాతం క్షీణించగా.. బీపీసీఎల్ 1.90 శాతం, హెచ్‌పీసీఎల్ 1.41 శాతం తగ్గాయి. ఒకదశలోనైతే బీపీసీఎల్ 6.11 శాతం, హెచ్‌పీసీఎల్ 5.34 శాతం, ఐఓసీ 3.91 శాతం వరకు పతనమైనప్పటికీ మళ్లీ కాస్త కోలుకున్నాయి.

విమానయాన రంగంలో ఇండిగో స్టాక్ 3.71 శాతం, స్పైస్‌జెట్ 1.95 శాతం తగ్గాయి. పెయింట్ల తయారీదారుల్లో ఇండిగో పెయింట్స్ 2.63 శాతం, బెర్జర్ పెయింట్స్ 0.59 శాతం, ఏషియన్ పెయింట్స్ 0.14 శాతం నష్టపోయాయి. టైర్ల తయారీదారుల్లో సియట్, అపోలో టైర్స్ ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

సామాన్యుడిపై ప్రభావమెంత..?

ముడిచమురు ధర 80 డాలర్లు దాటి మరింత ఎగబాకితే దేశీయంగా ఇంధన కంపెనీలు పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచాల్సి రావచ్చు. దాంతో వాహనదారులపై భారం పెరగడంతో పాటు సరుకు రవాణా వ్యయం పెరుగుతుంది. ఫలితంగా మార్కెట్లో నిత్యావసరాల ధరలు కూడా ఎగబాకే ప్రమాదం ఉంది. ద్రవ్యోల్బణం పెరిగితే ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు ప్రక్రియకూ అడ్డుకట్ట పడుతుంది. అంతేకాదు, ప్రభుత్వానికీ ఇది భారమే. ఎందుకంటే, దేశీయ ఇంధన అవసరాల్లో 85 శాతం దిగుమతుల ద్వారానే సమకూరుతోంది. ముడిచమురు ధరల పెరుగుదల కారణంగా దిగుమతుల వ్యయం పెరిగితే కరెంట్ ఖాతా లోటును నిర్దేశిత లక్ష్యం మేరకు కట్టడి చేయడం సాధ్యపడదు.

స్టాక్ మార్కెట్లో 'అణు' కంపం

- సెన్సెక్స్ 574 పాయింట్లు డౌన్
- 24,750 దిగువ స్థాయికి జారిన నిఫ్టీ
- 2 రోజుల్లో రూ.8.35 లక్షల కోట్లు ఫట్



ముంబై: ఇరాన్ అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ దాడుల ప్రకంపనలు ప్రపంచ మార్కెట్లతో పాటు దలాల్‌స్ట్రీట్‌నూ తాకాయి. దాంతో ఈ వారాంతం ట్రేడింగ్ మన సూచీలకు బ్లాక్ ఫ్రైడేగా పరిణమించింది. ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 1,337.39 పాయింట్లు పతనమై 80,354.59 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత క్రమంగా కోలుకున్న సూచీ చివరికి 573.38 పాయింట్ల నష్టంతో 81,118.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 169.60 పాయింట్లు కోల్పోయి 24,718.60 వద్ద ముగిసింది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. ఫలితంగా రెండు రోజుల్లో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.8.35 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.447.21 లక్షల కోట్లకు (5.19 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 26 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 2.71 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 0.32 శాతం వరకు నష్టపోయాయి.

- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌ఐఐ) మన మార్కెట్ నుంచి గురువారం నికరంగా రూ.3,831.42 కోట్ల పెట్టుబడులను ఉపసంహించుకున్నారు. వారాంతం ట్రేడింగ్‌లో మరో రూ.1,263.52 కోట్ల నికర విక్రయాలు జరిపారు.

రూపాయి.. 59 పైసలు నష్టం

ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 55 పైసలు నష్టపోయి రూ.86.11 వద్ద ముగిసింది. క్రూడాయిల్ రేట్లు భారీగా పెరగడంతోపాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ మన కరెన్సీపై ఒత్తిడి పెంచాయని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి.

ఫారెక్స్ నిల్వల్లో భారీ వృద్ధి: ఈనెల 6తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 517 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 69,665 కోట్ల డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ షేర్లకు ఎయిరిండియా సెగ : ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం ప్రమాదం నేపథ్యంలో ఎయిరిండియాలో 25.1 శాతం వాటా కలిగిన సింగపూర్ ఎయిర్‌లైన్స్ షేరు ఒక దశలో 2 శాతానికి పైగా క్షీణించినప్పటికీ, చివరికి 1.7 శాతం నష్టంతో ముగిసింది. కాగా, అమెరికా స్టాక్ మార్కెట్లో బోయింగ్ కంపెనీ షేరు వరుసగా రెండో రోజూ నష్టాల్లో కొనసాగింది. శుక్రవారం ఒకదశలో 4 శాతం వరకు పతనమైంది. బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానాల ఇంజన్లను తయారుచేసిన జీఈ ఏరోస్పేస్ షేరు సైతం ఒకదశలో 2.50 శాతం నష్టపోయింది.

ఆరిస్ఇన్‌ఫ్రా ఐపీఓ ధరల శ్రేణి రూ.210-222: ఆరిస్ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్ రూ.500 కోట్ల ఐపీఓ ఈనెల 18న ప్రారంభం కానుంది. షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.210-222గా నిర్ణయించింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 14-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 59

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం తిథి: తదియ మ.3.47 తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాషాఢ రా.12.22 తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.7.41-9.21, తె.4.28-6.06, దుర్ముహూర్తం: ఉ.5.44-7.28, అమృతఘడియలు: సా.5.41-7.21, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 5.44, సూర్యాస్తమయం: 6.46

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

డీఏ వచ్చేసింది

ఉద్యోగులు, పెన్షనర్లకు తీపికబురు

3.64 శాతం డీఏను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

జూలైలో అందుకునే వేతనంతోపాటు చెల్లింపు

9

ఉత్తమ చిత్రానికి రూ. 10 లక్షలు

ద్వితీయ, తృతీయ చిత్రాలకు రూ.7, 5 లక్షలు

ప్రత్యేక అవార్డులకు రూ.10 లక్షల చొప్పున..

ఉత్తమ నటుడు, నటికి చెరో రూ.5 లక్షలు

హైటెక్స్‌లో నేడు గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డుల ప్రదానోత్సవం

8



ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన టెహ్రాన్‌లోని ఓ భవన సముదాయం



దాడిపై టెహ్రాన్‌లో ఇరానీయుల నిరసన

ఇరాన్‌పై ఇజ్రాయెల్

భీకర దాడులు

100 సైనిక, అణు, క్షిపణి స్థావరాలే లక్ష్యం

200 యుద్ధవిమానాలతో తెల్లవారుజామున దాడి

330 బాంబులు, క్షిపణులు కురిపించిన ఇజ్రాయెల్

ఆర్మీ చీఫ్, ఐఆర్‌జీసీ చీఫ్ సహా నలుగురు సైనిక జనరళ్లు, ఆరుగురు అణు శాస్త్రవేత్తల మృతి

నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రం ధ్వంసం

కలిసికట్టుగా ఇజ్రాయెల్ సైన్యం, మొసాద్ ఆపరేషన్

ఇరాన్‌లోకి డ్రోన్లు, ఆయుధాలు అక్రమంగా చేరవేత

'ట్రూ ప్రామిస్ 3' పేరుతో ఇరాన్ ఎదురుదాడి

ఇజ్రాయెల్‌పైకి వందలాది క్షిపణులు, రాకెట్లు

టెల్ అవీవ్, టెహ్రాన్, జూన్ 13: ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలు, క్షిపణి కేంద్రాలే లక్ష్యంగా... శుక్రవారం ఆ దేశంపై ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో (టెహ్రాన్ స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో).. ఇజ్రాయెల్ వాయుసేనకు చెందిన 200కు పైగా యుద్ధవిమానాలు భీకర దాడులకు దిగాయి. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో దశలవారీగా జరిపిన ఈ దాడుల్లో భాగంగా.. ఇరాన్ అణు శుద్ధి కర్మాగారాల్లో అత్యంత ప్రధానమైన నతాంజ్ న్యూక్లియర్ ఎన్‌రిచ్‌మెంట్ ఫెసిలిటీ, డజన్ల కొద్దీ రేడార్ కేంద్రాలు, సర్ఫేస్-టు-ఎయిర్ మిసైల్ లాంచర్లు సహా వివిధ నగరాల్లోని 100 లక్ష్యాలపై 330కు పైగా బాంబులు, క్షిపణులను ప్రయోగించాయి. ఈ దాడుల్లో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ చీఫ్ హొస్సేన్ సలామీ, ఆర్మీ చీఫ్ మొహమ్మద్ బాఘేరీ సహా నలుగురు సైనిక జనరళ్లు, కనీసం ఆరుగురు

మిగతా 8వ పేజీలో...

తదుపరి దాడులు మరింత క్రూరం

ఇకనైనా మాతో అణు ఒప్పందం కుదుర్చుకోండి

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



8

వీడని మిస్టరీ!

విమాన ప్రమాదంపై అంతుచిక్కని కారణాలు



అహ్మదాబాద్‌లో విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

రంగంలోకి ఎన్ఐఏ, ఏఏఐబీ.. వైమానిక రంగ నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

ఎయిర్ ఇండియా నిర్వహణ లోపాలపై దృష్టి

ఇంజన్ల వైఫల్యం, ఇంధనం కల్తీ.. జరిగి ఉండవచ్చని పలువురు పైలెట్ల సందేహాలు

హాస్టల్ శిథిలాల కింద బ్లాక్‌బాక్స్‌ను గుర్తించిన ఏటీఎస్ అధికారులు

వెయ్యి డిగ్రీల వేడిని తట్టుకుని చెక్కు చెదరని వైనం.. దాంతోనే కారణాలు వెలుగులోకి!

ఎయిరిండియాలో బోయింగ్‌ల కుదింపు?

తొలుత సాంకేతిక తనిఖీలకు కేంద్రం ఆదేశం

విమానాలు బయల్దేరడానికి ముందే ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టీకరణ

దేశంలోని అన్ని విమానయాన సంస్థల్లో 209 బోయింగ్‌లు.. ఎయిరిండియా వద్దే 135

న్యూఢిల్లీ, జూన్ 13: ఎంతో ఆనందంగా లండన్‌కు బయలుదేరిన 241 మంది జీవితాలను కాల్చి బుగ్గి చేసిన ఘోర విమాన ప్రమాదంపై మిస్టరీ ముడి వీడలేదు. ప్రమాద ఘటన జరిగి రెండు రోజులు అవుతున్నా.. దీనికి గల కారణాలు అంతుచిక్కలేదు. సాంకేతిక లోపమా? పక్షులు ఢీకొనడంతోనే ఇంత పెద్ద ప్రమాదం సంభవించిందా? అసలు ఏం జరిగింది? అనే విషయాలపై పౌర విమానయాన శాఖకు స్పష్టత రాలేదు. ఈ క్రమంలో ప్రమాద కారణాలను అన్వేషించేందుకు జాతీయ దర్యాప్తు బృందం(ఎన్ఐఏ) అధికారులు రంగంలోకి దిగారు. అదేవిధంగా పౌర విమానయాన సంస్థకే చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్

మిగతా 10వ పేజీలో...

బాధిత కుటుంబాలకు అండగా..

విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలించిన మోదీ

చికిత్స పొందుతున్న వారికి పరామర్శ

మిడ్ డే యాడ్‌లాగే.. ఆ ప్రమాదం!

10

భవనం నుంచి విమానం బయటకొస్తున్నట్లు పత్రికలో మొదటి పేజీ యాడ్.. అదే రోజు ప్రమాదం



విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో కేకే, ఉన్నతాధికారులు

ఇష్టారీతిన ఫీజుల పెంపా?

ఇంజనీరింగ్ కాలేజీల్లో ఇప్పటికే ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నాయ్

ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారు

విద్యార్థులపై భారం పడకుండా చూడండి.. అధికారులతో సీఎం

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారీతిన ఫీజులు పెంచుకుంటూ పోతారా? అని ప్రశ్నించారు. అనేక ఇంజనీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నాయన్న ఆయన.. పేద విద్యార్థులు ప్రతిభ ఆధారంగా కన్వీనర్ కోటాలో ప్రముఖ కాలేజీల్లో సీటు సాధించినా, వార్షిక ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారని గుర్తుచేశారు. విద్యార్థులపై భారం పడకుండా

మిగతా 9వ పేజీలో...

కొత్తగా 571 ప్రభుత్వ స్కూళ్లు!

గ్రామాలు, పట్టణాల్లోని బడుల్లో 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న చోట్ల ఏర్పాటు

నాణ్యమైన విద్యకు ఎంత ఖర్చయినా ఓకే

హైస్కూల్ నుంచే నైపుణ్యాభివృద్ధి ఉండాలి

అప్పుడే విద్యార్థులు ఇష్టమైన రంగాల్లో రాణిస్తారు.. విద్యాశాఖ సమీక్షలో సీఎం

ఉస్మానియా, జలమండలి, ప్రజారోగ్యంపైనా ముఖ్యమంత్రి సమీక్ష

9



12

'ఫార్ములా-ఈ' కేసులో కేటీఆర్‌కు

మళ్లీ నోటీసులు

16న హాజరు కావాలన్న ఏసీబీ

కొన్ని డాక్యుమెంట్లు ఇవ్వాలని సూచన

చార్జిషీటు దాఖలుకు ఏసీబీ కసరత్తు

నోటీసుల పేరిట రేవంత్ నాటకాలు

దమ్ముంటే లైడిటెక్టర్‌కు నిలవాలి: కేటీఆర్

మా వర్కింగ్ ప్రెసిడెంట్‌కే

నోటీసులిస్తారా?

12

సర్కార్ కక్ష సాధింపును ఖండిస్తున్నా

మీ వైఫల్యాలను ఎండగడతాం: కవిత

నేడు నీట్ ఫలితాలు

11

రాష్ట్రంలో 72,507 మంది హాజరు

స్టాంప్ డ్యూటీ తగ్గిద్దాం

భూముల విలువలు పెంచుదాం!

సర్కార్‌కు రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదనలు

త్వరలో నిర్ణయం తీసుకోనున్న ప్రభుత్వం

అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్లకు 100 నుంచి 300 శాతం దాకా పెంపు!

ఈసీ ఉచితంగా ఇవ్వడంపై యోచన



హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లకు సంబంధించిన స్టాంప్ డ్యూటీని తగ్గించి, భూ విలువలను పెంచితే ఎలా ఉంటుందన్న అంశంపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ విస్తృత కసరత్తు చేస్తోంది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో స్టాంప్ డ్యూటీ 5.5శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 1.5శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5శాతంగా ఉన్నాయి. మొత్తంగా 7.5 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. అయితే దీన్ని 6 శాతానికి కుదించాలని రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదించినట్లు

మిగతా 7వ పేజీలో...



12

ఎన్నికల 'భరోసా'!

10–15 రోజుల్లో రైతులకు పెట్టుబడి సాయం

స్థానిక ఎన్నికలకు ముందే పంపిణీకి కసరత్తు

నిధుల సమీకరణ ప్రారంభించిన ప్రభుత్వం

4 వేల కోట్ల రుణం కోసం ఆర్బీఐకి ఇండెంట్



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో యుద్ధం!

ఇరాన్ గుండెలమీద కొట్టాం అన్నారు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ. అతిశయోక్తి ఏమీ లేదు. ఇజ్రాయెల్ చేతిలో అది నవనాడులూ కుంగిపోయేలా దెబ్బతిన్నది. అనేక దశాబ్దాలుగా ఎన్నడూ చవిచూడని ఘోరపరాభవం ఇది. దిక్కూమొక్కూలేని గాజాలో ఎంతదాష్టీకంతో మానవహననాన్ని సాగిస్తున్నదో, అదే తరహాలో ఇరాన్‌లోనూ ఇజ్రాయెల్ రెచ్చిపోయింది. ఇరానియన్లు గాఢనిద్రలో ఉండగా, ఇజ్రాయెల్‌కు చెందిన రెండువందల యుద్ధవిమానాలు చొరబడి, వేర్వేరు ప్రాంతాల్లోని కనీసం వందచోట్ల వందలాది క్షిపణులను కురిపించాయి. యురేనియం శుద్ధి ప్లాంట్లు, సైనికస్థావరాలు, మిసైల్ కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిపానని ఇజ్రాయెల్ చెప్పుకుంది కానీ, నూటయాభైమంది సామాన్యజనం కూడా మరణించారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కేంద్రకార్యాలయం మీద దాడి చేసి ఆ సంస్థ అధినేత సహా పలువురు కీలకనాయకులనూ, అణుశాస్త్రవేత్తలను మట్టుబెట్టడం చిన్న విషయం కాదు. ఇరాన్ ఏకంగా తన సైన్యాధ్యక్షుడినే ఈ దాడుల్లో కోల్పోవడం తీవ్ర అవమానం. నంతాజ్ అణుకేంద్రం సహా అనేక కీలకస్థావరాలమీద పదేపదే విరుచుకుపడి, ఇరాన్ అణుకార్యక్రమాన్ని ఇక అడుగు కూడా కదలనివ్వకుండా చేయగలిగింది ఇజ్రాయెల్. యుద్ధానికి కాలుదువ్విన ఇజ్రాయెల్‌కు గట్టిగుణపాఠం చెబుతానని ఇరాన్ హెచ్చరికలు చేస్తోంది. అది ఎప్పుడో, ఏ స్థాయిలో ఉంటుందో తెలియదు.

ఇరాన్ అణుకార్యక్రమం అమితవేగంగా సాగుతోందని, వారాల్లో కాకున్నా, కొద్దినెలల్లోనే అది అణ్వస్త్రాలను తయారుచేయగల స్థాయికి చేరుకుందని ఇటీవల పాశ్చాత్య మీడియానుంచి వరుసకథనాలు వెలువడుతున్నప్పుడే మనకు అసలు కథ అర్థమైంది. ఇరాన్ కట్టుతప్పిందని, నిబంధనలను ఉల్లంఘిస్తోందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) గవర్నర్ల బోర్డు గురువారం తీర్మానించడంతో, దాడికి పూర్వరంగం సిద్ధమవుతోందని తెలిసిపోయింది. ఇప్పుడు నెతన్యాహూ కూడా తన 'ఆపరేషన్ రైజింగ్ లయన్' లక్ష్యాన్ని నొక్కిచెబుతూ, ఒకటీ రెండూ కాదు, ఏకంగా తొమ్మిది అణుబాంబులు తయారుచేయగలిగే శక్తి ఇరాన్‌కు ఉందన్నారు. శుద్ధిచేసిన యురేనియం ఇరాన్ దగ్గర ఎంతో పోగుపడిందనీ, ఆ దేశాన్ని ఇప్పుడే ఆపకపోతే అణ్వాయుధాలు తయారుచేసి ప్రపంచపటం నుంచి ఇజ్రాయెల్‌ను చెరిపేస్తుందని, ఈ ముందస్తు దాడులు ఆత్మరక్షణకేనని నెతన్యాహూ అంటున్నారు. ఇరాన్ ముప్పు పూర్తిగా తొలగిపోయేంతవరకూ ఈ ముప్పేటదాడి కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో నంతాజ్ అణుకేంద్రం పూర్తిగా ధ్వంసమైందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) ప్రకటించింది. ఒకపక్క అమెరికాతో దశలవారీ చర్చలు జరుగుతూండగా, ఇజ్రాయెల్ ఈ దాడులు చేయడం విశేషం. ఈ చర్యతో తమకు సంబంధం లేదని అమెరికా వెంటనే ప్రకటిస్తూ, ప్రతీకారం పేరిట హద్దులు దాటవద్దని ఇరాన్‌ను హెచ్చరించింది. కానీ, ఇరాన్‌కు ఇది తగిన గుణపాఠమని, మరిన్ని దాడులకు గురికాకుండా ఉండాలంటే దారికొచ్చి, తనతో ఒప్పందం కుదర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరికలు చేయడం విశేషం. ఇజ్రాయెల్ దాడిలో తన పాత్రేమీలేకున్నా, తనకు చెప్పే ఈ దాడి జరిగిందని అమెరికా తేల్చేసింది. బరాక్ ఒబామా ఏలుబడిలో కుదిరిన ఒక చక్కని అంతర్జాతీయ ఒప్పందాన్ని 2018లో నిలువునా పాతరేసిన ట్రంప్, ఈ విడతలో మళ్ళీ ఒప్పందం కోసం పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఇరాన్ తన యురేనియం శుద్ధికార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేసి, ఇప్పటికే తన దగ్గరున్న 400కేజీల యురేనియంను నాశనం చేయాలని ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారని, అందుకు ఇరాన్ అంగీకరించడం లేదని వార్తలు వచ్చాయి. అరవైరోజుల్లో రాజీకి రావాలని అప్పుడే హెచ్చరించాను, ఇవాళ 61వ రోజు అని ఈ దాడుల అనంతరం ట్రంప్ ట్వీట్ చేయడం విశేషం.

అప్పట్లో ఒబామా ఆధ్వర్యంలో కుదిరిన ఒప్పందం ఇరాన్‌ను మిగతా ప్రపంచానికి జవాబుదారీని చేసి, పరిధుల్లోనూ, పర్యవేక్షణలోనూ ఉంచింది. అప్పటివరకూ యుద్ధభయంతో ఉన్న ప్రపంచానికి ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. యుద్ధం తప్ప శాంతి గిట్టని, ఒప్పందాల మాటే నచ్చని నెతన్యాహూ మాత్రం ఆదినుంచీ దానిని వ్యతిరేకిస్తూ ట్రంప్ అధికారంలోకి రాగానే సదరు ఒప్పందాన్ని కాలదన్నేట్టు చేశారు. ఇప్పుడు మళ్ళీ ఒప్పందం పేరిట ఒక కొత్త కథకు ట్రంప్ తెరదీసినా, ఇరువురి అంతిమ లక్ష్యం ఇరాన్‌ను నాశనం చేయడమే. ఇజ్రాయెల్ దాడితో ఆదివారం ఒమాన్‌లో జరగాల్సిన మరోవిడత చర్చలకు విఘాతం ఏర్పడింది. సైన్యంతో తప్ప, సామరస్యంగా వ్యవహరించడం గిట్టని నెతన్యాహూ, తన చేతికి మట్టి అంటకుండా ఇరాన్‌ను లొంగదీసుకోవాలని అనుకుంటున్న ట్రంప్ ఈ ప్రపంచాన్ని పెనుప్రమాదంలోకి నెట్టకపోతే అంతేచాలు.

మోదీ పాలనపై సామాన్యుడి సణుగుడు

ఏ విషయం పైన అయినా ఒకే ఒక్క సరైన దృక్పథమనేది ఉండదు. ఐన్‌స్టీన్ అమోఘ సృష్టి సాధారణ సాపేక్ష సిద్ధాంతాన్ని జయంత్ నార్లికర్ సహా పలువురు శాస్త్రవేత్తలు ప్రశ్నించారు. దురుద్దేశమనేది లేనంతవరకు ఏ దృష్టి కోణంలోనైనా ఎంతో కొంత సత్యం తప్పక ఉంటుంది. ఆ సత్యాన్ని గౌరవించి తీరాలి. భిన్న దృక్పథంలోని సత్యాన్ని గుర్తించి, గౌరవించే గుణ విశేషం ప్రస్తుత ప్రభుత్వానికి లేనే లేదు. గత 11 సంవత్సరాలలో అటువంటి సుగుణాన్ని అలవరచుకునే ప్రయత్నం అది ఏ కోశానా చేయలేదు. నరేంద్ర మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయ్యాయి. సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా ఉన్న నాయకులలో ఆయన మూడవవారు. ఆ అత్యున్నత పదవిలో ఇంతకాలం ఉండడమే, తన పార్టీని ఎన్నికలలో గెలిపించగల ఆయన పట్టుదల, సామర్థ్యానికి నిదర్శనం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రతి ప్రభుత్వంలోను మంచి-చెడు రెండూ ఉంటాయి. ఎన్డీఏ ప్రభుత్వమూ ఇందుకు మినహాయింపు కాదు. ఒక ప్రభుత్వ పనితీరును అంచనా వేసేందుకు ప్రజలు ప్రాతిపదికగా తీసుకునే ప్రమాణాలు భిన్నంగా ఉంటాయి. అవి పరిమాణాత్మకమైనవి కావు. 'సుపరిపాలన' అనేది ఆ అంచనాకు ప్రమాణం, ప్రాతిపదిక. సుపరిపాలన ఉంటే ఒక దేశం సకల ప్రజలకు మెరుగైన, బలమైన, న్యాయమైన సమాజంగా కనిపిస్తుంది. తన కుటుంబానికి మరింత సౌఖ్యదాయక జీవితం చేకూరగలదనే సంతృప్తి ప్రతి వ్యక్తికీ సమకూరుతుంది. సుపరిపాలన నాణ్యతను పరిమాణాత్మకంగా వివేచించలేము, గ్రహించలేము. నా అంచనాలో భారత్ అందరికీ మెరుగైన, బలమైన, అనుకూలమైన జీవన స్థితిగతులను సమకూర్చేదిగా లేదు. లక్షలాది ప్రజల స్థితిగతులు మెరుగుపడ్డాయి, సందేహం లేదు. అయితే మరెన్నో లక్షల మంది బతుకులు నిత్య అనిశ్చితి, పేదరికం, నిరుద్యోగం, భయంతో నాశనమయ్యాయి. ఎంతో మందికి ఈ హాని ఇంకా మరింత తీవ్రంగా వాటిల్లుతోంది.

భారతదేశ వృద్ధిరేటును పెంపొందించే లక్ష్యంతో ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ విధానాలను అమలుపరిచాము. యూపీఏ ప్రభుత్వాల పదేళ్ల పాలన (2004–14)లో సగటు జీడీపీ వృద్ధి రేటు పాత అంచనాల ప్రకారం 7.46 శాతం కాగా కొత్త అంచనాల ప్రకారం 6.7 శాతంగా ఉన్నది. 2014–15 తరువాత, మరీ ముఖ్యంగా 2019–20 తరువాత అధికారిక గణాంకాలే జీడీపీ వృద్ధిరేటు మందగిస్తున్నదని వెల్లడించాయి. 2024–25లో వృద్ధిరేటు పెరుగుదల స్వల్పస్థాయిలోనే ఉన్నది.

ప్రజల మెరుగైన జీవన పరిస్థితులకు ప్రమాణం వారి తలసరి ఆదాయమే కానీ, జీడీపీ పరిమాణం కాదు. యూపీఏ ప్రభుత్వాల పదేళ్ల పాలనలో దేశ ప్రజల తలసరి ఆదాయం రెట్టింపు కంటే ఎక్కువయింది. వాస్తవంగా అది 2.64 రెట్లు పెరిగింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే భారత ప్రజల తలసరి ఆదాయం 543 నుంచి 1438 డాలర్లకు పెరిగింది. ఎన్డీఏ ప్రభుత్వాల పాలన మొదటి పది సంవత్సరాలలో భారత ప్రజల తలసరి ఆదాయం 1.89 రెట్లు మాత్రమే పెరిగింది. అంటే 1438 నుంచి 2711 డాలర్లకు పెరిగింది. 11వ సంవత్సరంలో అది 2878 డాలర్లకు పెరిగింది. ఈ ప్రకారం తలసరి ఆదాయం విషయంలో మన దేశం ప్రపంచంలో 136వ స్థానంలో ఉన్నది. మరి అభివృద్ధి చెందిన దేశంగా పరిగణన పొందాలంటే తలసరి ఆదాయం 14,000 డాలర్లకు పెరగాలి. ఇది ఎప్పటికి సాధ్యమవుతుంది?



'భారతీయుడిని అయినందుకు గర్విస్తున్నానా?' అని నన్ను నేను ప్రశ్నించుకుంటే సమాధానం సానుకూలంగా ఉంటుంది. 'భారత్‌ను పరిపాలిస్తున్న తీరుతెన్నుల పట్ల సంతోషంగా ఉన్నానా' అని ప్రశ్నించుకుంటే జవాబు వ్యతిరేకంగా ఉంటుంది. సమస్త భారతీయులకు మరింత మెరుగైన, శక్తిమంతమైన, న్యాయమైన సమాజంగా భారత్ వర్ధిల్లే రోజు కోసం ఎదురుచూస్తున్నాను.

అసమానతలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు సంపన్నులు/ అధిక సంపన్నులు (దేశ జనాభాలో ఎగువ 20 శాతం), పేదలు/నిరుపేదలు (దేశ జనాభాలో దిగువ 20 శాతం) అందరిలోను భయం, అభద్రత గూడు కట్టుకున్నాయి. మెజారిటేరియనిజం ప్రబలమవుతోంది, మతోన్మాదం పెచ్చరిల్లుతోంది, కుల ఘర్షణలు పెరిగిపోతున్నాయి, విద్వేష ప్రసంగాలు, రాతలకు అడ్డూ అదుపు ఉండడం లేదు, ఆశ్రిత పెట్టుబడిదారీతనం నిర్లజ్జగా వర్ధిల్లుతోంది, నేర విచారణా వ్యవస్థ కూలిపోయింది; సమాఖ్య పాలనా పద్ధతి బీటలు వారింది, పాలనలో నిరంకుశ ధోరణులు తీవ్రమవుతున్నాయి. ఇందుకు రెండు ఉదాహరణలు చాలు: (1) ఆదాయ పన్ను చట్టం నుంచి మనీలాండరింగ్ నిరోధక చట్టం దాకా అనేక చట్టాలను రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవడానికి దుర్వినియోగం చేస్తున్నారు; (2) నిధుల కొరత నెదుర్కొంటున్న ముంబై సబర్బన్ రైల్వేస్ పరిధిలో 2014–25 సంవత్సరాల మధ్య సంభవించిన రైలు ప్రమాదాలలో 29,970 మంది మరణించగా 30,214 మంది గాయపడ్డారు. ఈ సబర్బన్ రైల్వే నెట్‌వర్క్ పరిస్థితుల మెరుగుదలను ఉపేక్షించి ముంబై–అహ్మదాబాద్‌ల మధ్య బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.1,08,00 కోట్లు ఖర్చు పెట్టారు.

దేశం దృఢంగా ఉండడమంటే ఏమిటి? సమైక్యంగా ఉండడం, ఇరుగు పొరుగుదేశాలతో స్నేహ, సహకార సంబంధాలు కలిగి ఉండడం, సరిహద్దులు భద్రంగా ఉండడం, సమర్థమైన సాయుధ బలగాలు, ప్రపంచ దేశాలతో సహృద్భావపూర్వక దౌత్య, వాణిజ్య సంబంధాలు ఉండడం, అంతర్జాతీయ వేదికలపై గౌరవప్రదమైన ప్రాధాన్యం లభించడం. పహల్గాంలో ఉగ్ర ఘాతుకం, ఆపరేషన్ సిందూర్ తరువాత మన బలహీనతలు బయల్పడ్డాయి. ఇరుగు పొరుగు దేశాలైన శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ అఫ్గానిస్తాన్‌లకు మన పార్లమెంటరీ ప్రతినిధి బృందాలను పంపలేదు. ఆ దేశాలూ పహల్గాం, సిందూర్‌పై బహిరంగంగా మాట్లాడలేదు. అనేక దేశాలు ఉగ్రవాద దాడిని ఖండించాయి. అయితే ఏ దేశమూ ఆ దాడి వెనుక ఉన్న పాకిస్థాన్ ప్రమేయాన్ని ఖండించలేదు. సంప్రదాయ యుద్ధ తంత్రంలో పాకిస్థాన్‌పై భారత్‌కు ఉన్నదని అనుకుంటున్న ఆధిక్యతపై సందేహాలు ముసురుకున్నాయి. పలు అంతర్జాతీయ కూటములలో సభ్య దేశంగా ఉన్న భారత్ ఎగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించింది. పైగా దౌత్య వ్యవహారాలలో భారత్, పాకిస్థాన్‌లకు సమ ప్రాధాన్యమిస్తోంది. ఐఎమ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్, ప్రపంచ బ్యాంకు డైరెక్టర్ల బోర్డ్‌లో సభ్యత్వమున్నా ఆ రెండు సంస్థలూ ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌కు భారీ రుణాలు మంజూరు చేయడాన్ని భారత్ నిలువరించలేకపోయింది. ఫ్రెంచ్, రష్యన్, ఇజ్రాయెలీ సైనిక సామగ్రితో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ నాలుగు రోజుల యుద్ధం చేసింది. భారత్ శక్తిమంతంగా ఉండవచ్చుగానీ మనం విశ్వసిస్తున్నంత శక్తిమంతంగా లేదు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి అధికారాన్నీ తన చేతుల్లో కేంద్రీకరించుకున్నారు. ప్రభుత్వ విజయాల ఘనత తనదే అని ఆయన చెప్పుకోవచ్చు గానీ ప్రభుత్వ వైఫల్యాలు అన్నిటికీ ఆయనే బాధ్యత వహించి తీరాలి. 'భారతీయుడిని అయినందుకు గర్విస్తున్నానా?' అని నన్ను నేను ప్రశ్నించుకుంటే 'అవును, గర్విస్తున్నాను' అని తప్పక సమాధానం చెప్పుకుంటాను. 'భారత్‌ను పరిపాలిస్తున్న పద్ధతి పట్ల సంతోషంగా ఉన్నానా' అని ప్రశ్నించుకుంటే సంతోషంగా లేను అనేదే స్పష్టమైన సమాధానం. సమస్త భారతీయులకు మరింత మెరుగైన, శక్తిమంతమైన, న్యాయమైన సమాజంగా భారత్ వర్ధిల్లే రోజు కోసం ఎదురుచూస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఆ 'చీకటి రోజుల్లో' నేను–నా దేశం

వర్తమానం గతంతో ముడివడివుంటుంది. మన ప్రజాస్వామ్య వక్రగతికి ఒక పూర్వ దృష్టాంతం–ఎమర్జెన్సీ. ఈ జూన్ 26కు సరిగ్గా యాభై సంవత్సరాల క్రితం ఆ 'చీకటి అధ్యాయం' మొదలయింది. నేను నా 'India after Gandhi'లో ఆ చీకటి రోజుల గురించి వివరంగా రాశాను. అత్యవసర పరిస్థితి కాలంలో భారతదేశ చరిత్ర గురించి మరింత తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నవారు ఎమ్మా టార్లో (Unsettling Memories. Narratives of the Emergency in Delhi), గ్యాన్ ప్రకాశ్ (Emergency Chronicles: Indira Gandhi and Democracy's Turning Point), క్రిస్టొఫెజఫ్రెలాట్, ప్రతినావ్ అనిల్ (India's First Dictatorship: The Emergency, 1975–1977), సుగత శ్రీనివాసరాజు (The Conscience Network: A Chronicle of Resistance to a Dictatorship | Untold History of India's Emergency Resistance | US Solidarity, Indian Diaspora & Gandhi-Inspired Civil Rights) పుస్తకాలు చదవాల్సిందిగా సూచిస్తున్నాను. ఈ కాలమ్‌లో ఢిల్లీలో ఒక కళాశాల విద్యార్థిగా ఎమర్జెన్సీ కాలంలో నా వ్యక్తిగత అనుభవాలను రేఖా మాత్రంగా వివరిస్తాను. వీడని జ్ఞాపకాలవి.



మే 1975లో నేను న్యూఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం పూర్తి చేశాను. వేసవి సెలవులకు డెహ్రాడూన్‌లో ఉండే నా తల్లిదండ్రుల వద్దకు వెళ్లాను. సెలవుల్లో ఉన్నప్పుడే అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. జూలై మూడవ వారంలో కళాశాల కేంపస్‌కు తిరిగివచ్చాను. ఎమర్జెన్సీ విషయం నా మనసులో లేనేలేదు. ప్రధాని ఇందిర తన ప్రత్యర్థులు అందరినీ ఖైదు చేయడం, దీని ప్రభావాలు, పర్యవసానాలు వర్తమాన, భావి భారత దేశంపై ఎలా ఉంటాయన్న విషయమై నేనేమీ ఆలోచించలేదు. అసలా విషయమే నాకు పట్టలేదు. అప్పుడు నా వయసు 17 సంవత్సరాలు మాత్రమే. కళాశాల క్రికెట్ జట్టులో నాకొక స్థానాన్ని దక్కించుకోవడం గురించే నా ధ్యాస అంతా. ఆ మాటకొస్తే స్టీఫెన్స్‌లోని నా సహపాఠాలు ఎవరికీ రాజకీయాల గురించి పెద్దగా ఆసక్తి లేనివారే. రాజకీయ వ్యవహారాల పట్ల మా ఉదాసీనతను కళాశాల పాలకవర్గం పనిగట్టుకుని ప్రోత్సహించేది. ఢిల్లీ విశ్వవిద్యాలయ స్టూడెంట్స్ యూనియన్ కార్యవర్గ స్థానాలకు ఎన్నికలు చాలా తీవ్ర పోటీతో జరిగాయి. ఆ ఎన్నికలలో ఓటు వేసేందుకు స్టీఫెన్స్ విద్యార్థులకు అనుమతి లేదు! విశ్వవిద్యాలయంలోని ఇతర కళాశాలల–హిందూ, హన్స్‌రాజ్, రాంజాస్, కిరోరిమాల్ విద్యార్థులు అందరూ చాలా ఉత్సాహంగా ఆ ఎన్నికలలో పాల్గొన్నారు. సరే, ఢిల్లీకి మరో చివర జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న విశ్వవిద్యాలయం విద్యార్థులు అందరూ రాజకీయాలలో మరింత చురుగ్గా ఉండేవారు.

మహాత్మాగాంధీ సన్నిహితుడు సి.ఎఫ్ అండ్రూస్ మా కళాశాలలో అధ్యాపకుడుగా ఉండేవారు. ఈ విషయాన్ని మేము గొప్పగా, సగర్వంగా చెప్పుకునే వాళ్లం. మా కళాశాల నుంచి హర్ దయాళ్, బ్రిజ్‌కృష్ణ చండీవాలా మొదలైన స్వాతంత్ర్య సమరయోధులు వచ్చినప్పటికీ ముంబై, పూణే, కోల్‌కతా, చెన్నై, వారణాసి, అలహాబాద్, పాట్నా తదితర నగరాలలోని కళాశాలలతో పోలిస్తే స్వాతంత్ర్యోద్యమానికి చేసిన దోహదం వెలవెలబోతుంది. రాజకీయాల పట్ల ఉపేక్ష స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగింది. స్టీఫెన్స్ నుంచి ప్రభవించిన ప్రతిభావంతులు సివిల్ సర్వీసెస్‌లో చేరేందుకు ప్రథమ ప్రాధాన్యమిచ్చేవారు. 1960 దశకంలో కొంతమంది మార్క్సిజం పట్ల ఆకర్షితులయ్యారుగానీ వారు కేవలం దారి తప్పినవారు మాత్రమే. వారి సమకాలికులు ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ పదవులనధిష్ఠించడమే లక్ష్యంగా పెట్టుకునేవారు. జర్నలిస్టులు, విద్యావేత్తలు, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు అయినవారూ చాలా మంది ఉన్నారు. నాకు తెలిసిన స్టీఫెన్స్ కళాశాలకు గుణ విశేషాలు చాలా ఉన్నాయి గానీ రాజకీయాలలో క్రియాశీలంగా పాల్గొనడం వాటిలో ఒకటి కానేకాదు. మేము వర్తమానంలో నివసించేవాళ్లం, భవిష్యత్తు వర్తమానం అయినప్పుడు మాత్రమే దాని గురించి ఆలోచించే వాళ్లం.

> ఇంటర్నెట్ అప్పటికి ఇంకా సుదూర భావి అద్భుతమే. విశ్వసనీయమైన సమాచారానికి ఆకాశవాణి, దూరదర్శన్‌పై ఆధారపడే పరిస్థితి లేదు. పలు పత్రికా కార్యాలయాలు ఉన్న బహదూర్‌షా జాఫర్ మార్గ్‌లో ఒక పెద్ద బ్లాక్ బోర్డ్‌పై ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు ఫ్లాష్ అవుతున్నాయి. అమేథీలో సంజయ్‌గాంధీ ఓడిపోయాడన్న వార్త వచ్చినప్పుడు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. రాయబరేలీలో ఇందిర అపజయం పాలయ్యారని తెలియగానే మరింతగా హర్షధ్వానాలు చేశాము.



■ రామచంద్ర గుహ

గతానుగతం

వేసవి సెలవుల అనంతరం జూలైలో కళాశాలకు తిరిగివచ్చాను. కళాశాలలో పరిస్థితులు యథాతథంగా ఉన్నాయి. ప్రతిపక్ష నాయకుల నిర్బంధం, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు మమ్మలను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. ఎప్పటిలాగానే పిచ్చాపాటీ చేసేవాళ్లం, సందడి చేసేవాళ్లం, ఆడుకునేవాళ్లం. 1975 ద్వితీయార్థంలో క్రికెట్‌లో నా నైపుణ్యాలను మరింతగా మెరుగుపరచుకోవడంపై శ్రద్ధ పెట్టాను. అలాగే నా తోటివారు తమ తమ ప్రత్యేక అభిరుచులకు ప్రాధాన్యమిచ్చేవారు. షేక్స్పియర్ నాటకాలు చదవడం, బ్రిడ్జి ఆడడం, శాస్త్రీయ సంగీతం వినడం మొదలైన వాటిపై వారు అమితాసక్తి చూపేవారు.

సరే, ఎమర్జెన్సీ కొనసాగుతూనే ఉన్నది. దాని మాటున జరుగుతున్న ఘోరాలూ మాకు మెల్లమెల్లగా తెలియవస్తున్నాయి. ప్రధానమంత్రి కుమారుడు సంజయ్‌గాంధీకి ప్రమేయమున్న ఉదంతాలు తెలిసినప్పుడు దిగ్భ్రాంతికి లోనవుతుండేవాళ్లం. విద్యార్థులు ఎంతగానో అభిమానిస్తుండే విజయన్ (ఉన్ని) నాయర్ విషయం సంజయ్ దృష్టికి వెళ్లింది. ఆయన, విజయన్ డెహ్రాడూన్ స్కూల్‌లో సహ విద్యార్థులు. ఇరువురికీ ఉమ్మడి స్నేహితుడు అయిన ఒక వ్యక్తి ద్వారా కళాశాల అధ్యాపకత్వాన్ని వదిలివేసి, 'దేశాన్ని పాలించడం'లో తనకు సహాయకారిగా ఉండేందుకు రమ్మని సంజయ్ ఆహ్వానించాడు. అయితే ఇందుకు విజయన్ ససేమిరా అన్నారు. తాను తన వృత్తిలో సంతృప్తికరంగా ఉన్నానని సంజయ్‌కు సమాధానమిచ్చారు. యూనివర్సిటీ కాఫీ హౌస్‌లో మేము ఒక వ్యక్తిని రోజూ చూస్తుండేవాళ్లం. ఆయన గడ్డం గోధుమ రంగులో ఉండేది. ఆయన సులోచనాలు కూడా అదే రంగులో ఉండేవి. గంటల తరబడి అక్కడే కూర్చునేవాడు. సదా కాఫీ తాగుతూ ఉండేవారు. కాఫీ కాకపోతే ధూమపానం. చివరకు మేము ఆ వ్యక్తి ఇంటెలిజెన్స్ బ్యూరో ఏజెంట్ అనే నిర్ధారణకు వచ్చాం. కేంపస్‌లో పరిస్థితుల గురించి వాకబ్ చేయడమే అతని విధి. అందుకే నిత్యం యూనివర్సిటీ కాఫీ హౌస్‌లో ఉండేవాడు.

ఈ అనుభవాలతో, నాలో అప్పటివరకు నిద్రాణంగా ఉన్న రాజకీయ చైతన్యం మేలుకోవడం ఆరంభమయింది. ఏప్రిల్ 1976 రెండో వారంలో ఒక రాత్రి ఆకాశవాణి ప్రభుత్వ కాకారాయుడు ఒకరు చేసిన ఓ వ్యాఖ్య నా రాజకీయ చైతన్యాన్ని జాగరూకం చేసింది. ఆ రాత్రి మేము ఒక ట్రాన్సిస్టర్ రేడియో చుట్టూ మూగి క్రికెట్ కామెంటరీ వింటున్నాం. పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో వెస్టిండీస్‌పై టెస్ట్ మ్యాచ్ చివరిరోజు అది. 400కు పైగా పరుగులు సాధిస్తేగానీ మన జట్టు విజయం సాధించే అవకాశం లేదు. మన లిటిల్ మాస్టర్ల ద్వయం –సునీల్ గవాస్కర్, గుండప్ప విశ్వనాథ్ – ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఇంకేముంది, ఆకాశవాణిలోని మన వ్యాఖ్యాత తన ఆనందాన్ని ఇలా వ్యక్తంచేశాడు: 'యే ఇందిరాగాంధీ కా దేశ్ హై! యే బీస్ సూత్రి కారికారమ్ కా దేశ్ హై!' (ఇది ఇందిరాగాంధీ భూమి! ఇది ఆమె ఇరవై సూత్రాల కార్యక్రమం అమలవుతున్న దేశం). ఈ వ్యాఖ్య విన్న వెంటనే అది దేశానికి చాలా అవమానకరంగా ఉన్నదని నేను భావించాను. క్రికెటర్లు తమ ప్రతిభాపాటవాలతో దేశానికి సాధించిన కీర్తిచంద్రికలను నిరంకుశ పాలకురాలు అయిన రాజకీయవేత్త ఘనతగా పేర్కొనడం మితిమీరిన భజనపరత్వం కాక మరేమిటి?

1977 సంవత్సరారంభంలో ఎమర్జెన్సీని ఎత్తివేసి సార్వత్రిక ఎన్నికలు ప్రకటించారు. ఇందిర, ఆమె కాంగ్రెస్‌ను వ్యతిరేకించే నాలుగు పార్టీల కలయికతో కొత్త జనతా పార్టీ ఆవిర్భవించింది. మా కళాశాలకు సమీపంలో ఉన్న మారిస్ చౌక్‌లో జనతా పార్టీ ర్యాలీ నొకదాన్ని నిర్వహించారు. వేలాది ఇతర విద్యార్థులతో పాటు నేనూ ఆ సభకు వెళ్లాను. సోషలిస్టు రాజ్ నారాయణ్ నెహ్రూ–కీర్తిశేషులు, సజీవులు, పుట్టబోయేవారు–పై తీవ్ర విమర్శలు చేశారు. నెహ్రూ సోదరి విజయలక్ష్మి పండిట్ డెహ్రాడూన్ నుంచి ప్రత్యేకంగా వచ్చి ఆ ర్యాలీలో ప్రసంగించారు పౌర హక్కులు పునరుద్ధరించాలని, తన మేనకోడలి నియంతృత్వ పాలనకు చరమ వాక్యం పలకాలని ఓటర్లకు ఆమె పిలుపునిచ్చారు. పలువురు విద్యార్థి నాయకులు (మా కళాశాలకు చెందినవారు ఒక్కరూ లేరు), జనసంఘ్ నాయకుడు అటల్ బిహారీ వాజపేయి కూడా ఆ ర్యాలీలో ప్రసంగించారు. వాజపేయి ఉపన్యాసం శబ్ద సారళ్యంతో సంస్కారవంతంగాను, శ్రావ్యంగాను ఉన్నది. ఆయన హాస్యోక్తులు, చతురోక్తులకు శ్రోతలు పగలబడి నవ్వారు. క్రికెటేతర వ్యవహారాలు, సెయింట్ స్టీఫెన్స్ కళాశాల వెలుపలి ప్రపంచంపై నా శ్రద్ధాసక్తులను ఆ బహిరంగ సభ ఇతోధికంగా పెంచింది. ఈ ర్యాలీ అనంతరం కొద్దివారాలకు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపు ఆరంభమయింది. నేనూ, నా స్నేహితుల బృందం పలు ప్రధానపత్రికల ప్రధాన కార్యాలయాలు ఉన్న బహదూర్ షా జాఫర్ మార్గ్‌కు వెళ్లాము. ఇంటర్నెట్ అప్పటికి ఇంకా సుదూర భావి అద్భుతమే. విశ్వసనీయమైన సమాచారానికి ఆకాశవాణి, దూరదర్శన్‌పై ఆధారపడే పరిస్థితి లేదు. ఒక పత్రికా కార్యాలయం బయట ఒక పెద్ద బ్లాక్ బోర్డ్‌పై ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు ఫ్లాష్ అవుతున్నాయి. అమేథీలో సంజయ్‌గాంధీ ఓడిపోయాడన్న వార్త వచ్చినప్పుడు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. రాయబరేలీలో ఇందిర అపజయం పాలయ్యారని తెలియగానే మరింతగా హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి.

నిరంకుశ పాలన ఓడిపోయింది. వంశపారంపర్య రాజకీయాలు ముగిశాయి. అవునా? అయ్యో! యాభై సంవత్సరాల తరువాత నిరంకుశ పాలన, వంశ పారంపర్య రాజకీయాలు రెండూ మనలను వెంటాడుతున్నాయి, పీడిస్తున్నాయి. కాకపోతే తేడా అల్లా ఇప్పుడు వాటికి వివిధ పార్టీలలో ప్రాతినిధ్యం ఉన్నది; పరిపూర్ణ ఆలంబన కూడా లభిస్తోంది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

చట్టం ఉన్నా.. వృద్ధులపై ఆగని వేధింపులు

పిల్లలను కని, పెంచి వారు ప్రయోజకులుగా ఎదగడానికి సర్వశక్తులు ధారపోసిన తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో ఆ పిల్లలే వారిని అవమానిస్తూ, నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారు. ఇది అత్యంత బాధాకరం. ఈ వేధింపులకు కులం, మతం, ధనిక, బీద తేడా లేదు. అన్ని వర్గాల వయోధికులూ వేధింపులకు గురవుతున్నారు. వయోధికులు ప్రధానంగా తమ పిల్లల నుంచే కాక, సేవకులు, ఇరుగు పొరుగు, ఇతరుల నుంచి నిత్యం వేధింపులను ఎదుర్కొంటున్నారు.

కొందరు పిల్లలు జీవితాల్లో స్థిరపడిన తర్వాత తల్లిదండ్రుల యోగక్షేమాలపట్ల ఆసక్తి కనబరచడం లేదు. దీంతో తల్లిదండ్రుల పోషణ బాధ్యతను అనవసరపు ఖర్చుగా భావిస్తున్నారు. తల్లిదండ్రులను కనీసం ఫోన్లో కూడా పలకరించడం లేదు. మరికొందరు తమ తల్లిదండ్రులను సూటిపోటి మాటలతో దూషిస్తున్నారు. వారిని కించపరచడం, వేళకు భోజన సదుపాయాలు కల్పించకుండా పస్తులుంచడం, వారి వైద్య చికిత్సల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి చేష్టలతో కన్నవారిని వేధిస్తున్నారు. ఆస్తులను తమ పేర రాయాలని తల్లిదండ్రులను వేధిస్తూ శారీరకంగా హింసలకు గురిచేస్తున్నారు. తాము కోరుకున్న ఆస్తులు రాసివ్వలేదని.. తల్లిదండ్రులు చనిపోతే వారి అంత్యక్రియల్లో కూడా పాల్గొనని పిల్లలు ఉన్నారు. వయోధికులు తమ సంపాదనలో కొంత భాగాన్ని తమ కనీస అవసరాలకు ఖర్చు చేసుకోడానికి కూడా పిల్లల నుంచి అవరోధాలను ఎదుర్కొంటున్నారు!



రాష్ట్రవ్యాప్తంగా మేము సేకరించిన సమాచారం ప్రకారం వయోధికులపై వేధింపుల్లో 35 శాతం ఆస్తుల కోసం, 30 శాతం పోషణ కోసం, 25 శాతం వైద్య చికిత్సల కోసం, 10 శాతం ఇతర కారణాల వల్ల జరుగుతున్నట్లు తెలుస్తోంది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి భారతీయుడికి గౌరవప్రదంగా జీవించే హక్కును కల్పించింది. అలాగే 'తల్లిదండ్రులు, వయోధికుల పోషణ, సంక్షేమ చట్టం–2007' ప్రతి వయోధికుడికి పోషణ, రక్షణ, వైద్య సేవలు, చికిత్సల విషయంలో అండగా ఉన్నది. వయోధికులు గౌరవప్రదంగా జీవించాలని దేశంలోని చట్టాలు చెబుతున్నాయి. మన వేదాలు, ఉపనిషత్తులు, దర్శన గ్రంథాలు, సనాతన ధర్మం అన్నీ కూడా పిల్లలకు తల్లిదండ్రులే తొలి దైవాలని ఘోషిస్తున్నాయి. అయినా వయోధికులపై వేధింపులు ఆగడం లేదు. కారణం.. చట్టాలను అమలు చేసే ప్రభుత్వ యంత్రాంగానికి, దానికి దిశానిర్దేశం చేసే పాలకులకు వయోధికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేకపోవడం. దేశంలోని ప్రజాప్రతినిధుల్లో వయోధికులు చాలామంది ఉన్నారు. అయినా వారికి దేశంలోని సాటి వయోధికుల సంక్షేమం పట్ల తగిన శ్రద్ధ లేదనేది వాస్తవం.

దీనికి ఉదాహరణలు అనేకం. వయోధికుల సంక్షేమం కోసం 'వయోధికుల సంక్షేమ చట్టం–2007'ను తెచ్చినా ఆ చట్టం పట్ల ప్రజలకు కనీస అవగాహన కల్పించడానికి ఎవరూ కృషి చేయడం లేదు. ఒకవేళ ఈ చట్టంలోని అంశాలేవైనా వయోధికుల ప్రయోజనాలకు అవరోధంగా ఉన్నాయని వయోధికుల సంఘాలు విజ్ఞప్తి చేస్తే వాటిని సవరించేందుకు కూడా కేంద్రం 'సవరణ బిల్లు 2019'ను ప్రకటించింది. కానీ ఎంపీల ఉదాసీనత కారణంగా ఇప్పటివరకూ ఆ సవరణ బిల్లు పార్లమెంట్‌లో చర్చకు రాలేదు.

వయోధికులపై వేధింపులను నిరోధించుటకు ఐక్యరాజ్యసమితి 2011 డిసెంబర్ 19న నాటి జనరల్ బాడీ సమావేశంలో ఓ తీర్మానం చేసింది. ప్రతి సంవత్సరం జూన్ 15ను 'ప్రపంచ వయోధికుల వేధింపుల అవగాహన రోజు'గా పరిగణించాలని తెలిపింది. ఆ సందర్భంగా సభ్య దేశాలు సభలు, సమావేశాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి, వేధింపుల నివారణకు కృషి చేయాలని ఐరాస పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా వయోధికులపై నానాటికీ వేధింపులు పెరిగిపోతున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం 'ప్రపంచ వయోధికుల వేధింపుల అవగాహన రోజు'న కూడా ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. అందుకు సంబంధించిన సమావేశాలను నిర్వహించడం లేదు.

ఈ తరుణంలో 'తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్' తల్లిదండ్రులు, వయోధికుల పోషణ, సంక్షేమ చట్టంలో 2007లోని ముఖ్యాంశాలను సూచించే బోర్డులను రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మండల కార్యాలయాలు, పోలీసు స్టేషన్లు, డివిజన్, జిల్లా కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసే బృహత్తర కార్యక్రమాన్ని 2025 మార్చి నుంచి చేపట్టింది. తద్వారా వయోధికులకు, యువతకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ యంత్రాంగానికి ఆ చట్టం పట్ల అవగాహన కలిగి వయోధికులపై వేధింపులు తగ్గిపోగలవని విశ్వసిస్తోంది. పౌరసమాజం, ప్రభుత్వ యంత్రాంగం ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మా సంఘం కోరుకుంటోంది.

■ పి. నర్సింహారావు
రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

(రేపు ప్రపంచ వయోధికుల వేధింపుల అవగాహన రోజు)

అధిక జనాభా... వరమా, భారమా?

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా 146 కోట్లకు చేరుకుంది. మరో నలభై ఏళ్లలో అది 170 కోట్లకు చేరుకుని, తర్వాత తగ్గడం మొదలుపెడుతుంది. ఎందుకంటే ప్రస్తుత జననాల రేటు స్థిరీకరణకు అవసరమైన 2.1 కన్నా తక్కువగా 1.9గా కొనసాగుతోంది. అలా తక్కువగా కొనసాగడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. కాబట్టి దాన్ని అధిగమించాలా, లేదా ప్రపంచంతోనే నడుస్తూ, భారత్ కూడా అట్టే పట్టించుకోనక్కరలేదా అన్నది ఒక కోణం.

ఇప్పుడు దృష్టి పెట్టాల్సినవి రెండు ముఖ్యాంశాలు ఉన్నాయి. ఒకటి– జనాభాలో 68 శాతం పని చేయగల వయస్సువారు, అంటే అరవై నాలుగు సంవత్సరాల లోపువారు. అందులో యువత కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. సమగ్ర ప్రణాళికలు, వాటి అమలుతో వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చు. ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు, ఉపాధి వీలైనంత ఎక్కువమందికి చవకగా అందుబాటులో ఉంచాలి. వ్యవసాయం, పరిశ్రమలు, పరిశోధన, సేవలు, ఉత్పాదకత రంగాలను ఆధునిక సాంకేతికత సాయంతో దేశం స్వయం సమృద్ధి సాధించడానికే కాకుండా ప్రపంచ దేశాలకు అందించే స్థాయికి తీసుకురావాలి. ప్రస్తుతం తీసికట్టుగా ఉన్న మానవ అభివృద్ధి సూచీల మెరుగుదల సాధించాలి. పెరుగుతున్న ఆర్థిక అంతరాల్ని తగ్గించే విధానాలు ఉండాలి. దేశ సంపద, ఆదాయాలు ఒక్క శాతం మంది చేతిలో నలభై శాతం ఉండడం, ఏభై శాతం మంది ప్రజలు, ఆరు శాతం సంపదతో సరిపెట్టుకోవాల్సి రావడం సమర్థనీయం కాదు. ఈ అంతరంతో సమ్మిళిత అభివృద్ధి సాధ్యం కాదు. అందుకనే సంపద పంపిణీ, పేదరిక నిర్మూలనలపై విధానాల్ని పునస్సమీక్షించుకోవాలి. ఇక రెండోది– వృద్ధులు జనాభాలో ఏడు శాతం. జీవన ప్రమాణాల పెంపుతో ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. వారికి సామాజిక రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. కనుక నూతన విధానాలతో ఆ దిశగా అడుగులు వేయాల్సి ఉంటుంది.

ఇక, జననాల రేటు తగ్గినా అది దేశవ్యాప్తంగా ఒకేలా లేదు. అందుకనే దక్షిణాది రాష్ట్రాలు పిల్లల్ని ఎక్కువగా కనమని పిలుపు ఇస్తుంటే, ఉత్తరాది వారు ఎక్కువమందితో సతమతమవుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కూడా దీనితో ప్రభావితమవుతోంది. ప్రాంతీయ అసమానతలు ఎక్కువ కాకుండా చూడాలి. సున్నితత్వంతో, దీర్ఘకాలిక వ్యూహంతో వ్యవహరిస్తే అధిక జనాభా దేశానికి వరం. లేదంటే పెను భారం.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ



కలెక్టర్‌గా హరిచందన.. బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్‌గా హరిచందన దాసరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు ముకుందరెడ్డి, కదిరవన్ పలని, వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. బొకేలు అందించి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



రక్తదాతల కోసం ఎదురుచూపులు

కొరతతో బాధితుల ఉరుకులు పరుగులు 6

- తలసీమియా బాధితులకు నెలకు 2వేల యూనిట్లు అవసరం
- హిమోఫిలియా, కేన్సర్ బాధితులకూ తప్పని కష్టాలు
- ప్రసూతి ఆస్పత్రుల్లో గర్భిణులకు పాట్లు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎవరైనా దానం చేస్తేనే రోగికి..

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



హెచ్‌సీయూకు 5వ ర్యాంక్

- అత్యుత్తమ వర్సిటీల జాబితాలో చోటు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ యూనివర్సిటీల జాబితాలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి ఐదవ స్థానం దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఐఐఆర్ఎఫ్) వెల్లడించిన అత్యుత్తమ యూనివర్సిటీల జాబితాలో ఐదవ స్థానంలో నిలిచింది. దక్షిణాదితోపాటు తెలంగాణలో మొదటి స్థానం సాధించింది. ప్లేస్‌మెంట్ పెర్ఫార్మెన్స్, రీసెర్చ్, ఇండస్ట్రీ ఇన్‌కమ్ అండ్ ఇంటిగ్రేషన్ తదితర అంశాల్లో కేటాయించిన పాయింట్లలో జేఎన్‌యూ 994.89 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, బనారస్ హిందూ యూనివర్సిటీ జామియా ఇస్లామియా వర్సిటీలు నిలవగా, 988.93 పాయింట్లతో హెచ్‌సీయూ ఐదవ స్థానం సాధించింది.

ఫిట్‌నెస్ లేని 22 బస్సులపై కేసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. రెండు రోజుల్లో పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో ఫిట్‌నెస్‌లేని 22 బస్సుల యజమానులపై కేసులు నమోదు చేసినట్టు రవాణా శాఖ సంయుక్త కమిషనర్ రమేష్ చిదుర తెలిపారు. నార్త్ జోన్‌లో మూడు, వెస్ట్‌జోన్‌లో 3, సౌత్ జోన్‌లో 3, సెంట్రల్ జోన్‌లో 3, నాగోల్ డీటీటీ పరిధిలో 10 బస్సులపై కేసులు నమోదయ్యాయి. జిల్లాలో 1,247 విద్యాసంస్థల బస్సులు ఉండగా.. మరో 200 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోలేదని అధికారులు చెబుతున్నారు. కాలం చెల్లిన వాహనాలూ తిరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు.

పనుల్లో కునుకు.. ప్రజల్లో వణుకు

సా..గుతున్న నాలాల విస్తరణ పనులు

- **ఎస్ఎన్‌డీపీ ఫేజ్-1 పనుల్లో తీవ్ర జాప్యం**
- **వరద వస్తే భయం భయం**
- **కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్న స్థానికులు**

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చార్మినార్ జోన్‌లోని మౌలా కా చిల్ల నుంచి గంగానగర్ వెళ్లే నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు రెండేళ్లుగా సా...గుతున్నాయి. ఎక్కడికక్కడ మట్టి కుప్పలు ఉండడం, నాలాకు ఇరువైపులా ఎలాంటి అడ్డంకులూ లేకపోవడంతో వర్షం కురిస్తే వరద నీరు పక్కనున్న బస్తీలను ముంచెత్తుతోంది.

వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) ఫేజ్-లో భాగంగా గుర్రం చెరువు నుంచి సన్ని గార్డెన్ వరకు రూ.48 కోట్లతో 1.44 కి.మీల మేర బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టారు. మే 1వ తేదీ నాటికి పనులు పూర్తి చేస్తామని అధికారులు చెప్పినా.. ఇప్పటికీ పూర్తి కాలేదు.

- సికింద్రాబాద్ జోన్‌లోని హుస్సేన్‌సాగర్ సర్‌ప్లస్ నాలాకు రెండు వైపులా రూ.35.25 కోట్లతో 1.21 కి.మీల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. 1.21 కి.మీల మేర పనులు జరుగగా, పలు కారణాలతో మిగతా పనుల్లో వేగం మందగించింది.



మౌలా కా చిల్ల నుంచి గంగానగర్ వరకు జరుగుతున్న రిటైనింగ్ వాల్ పనులు

- ఖైరతాబాద్ జోన్‌లోని బుల్కాపూర్ నాలా పునరుద్ధరణ పనులు రూ.56.34 కోట్లతో చేపట్టగా.. 3.99 కి.మీలకుగాను 3.73 కి.మీల మేర పనులు పూర్తయ్యాయి.

రెండు, మూడేళ్ల క్రితం చేపట్టిన నాలాల విస్తరణ, బాక్స్ డ్రైన్, రిటైనింగ్ వాల్ పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీంతో వర్షాకాలం వచ్చిందంటే ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదవుతుండడం.. వరద నీరు ముంచెత్తుతుండడంతో జనం అల్లాడుతున్నారు. పనులు జరిగే చోట మట్టికుప్పలు, నిర్మాణ సామగ్రి పేరుకుపోయి ఉండడం.. నాలాలకు ఇరువైపులా ఓపెన్‌గా ఉండడంతో వరద నీరు ఇళ్లలోకి చేరుతోంది.

గాడి తప్పిన పనులు

పర్యవేక్షణా లోపంతో ఏడాదిగా ఎస్ఎన్‌డీపీ పనులు గాడి తప్పాయి. ఈ విభాగానికి ప్రత్యేకంగా చీఫ్ ఇంజనీర్ ఉన్నా, పనుల్లో పురోగతి అంతగా కనిపించడం లేదు. భూగర్భంలోని పైపులైన్లు, విద్యుత్ కేబుళ్ల ఇతరత్రా యుటిలిటీలు మార్చడం, ఆస్తుల సేకరణ ఇబ్బందుల వల్లే నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందని ఎస్ఎన్‌డీపీ వర్గాలు చెబుతున్నాయి. అంబర్‌పేటలో పోలీస్ విభాగంతో మాట్లాడి కొంత స్థల సేకరణ జరిపితే అక్కడ పెండింగ్‌లో ఉన్న నాలా విస్తరణ పూర్తవుతుంది. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేయాల్సిన యంత్రాంగం మాత్రం ఏం పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఈ విభాగాధిపతిగా ఉన్న అధికారి లేక్స్ విభాగం చీఫ్ ఇంజనీర్‌గా, ఎస్ఎన్‌డీపీ సీఈగా, సమగ్ర వ్యర్థాల నిర్వహణ విభాగం ఎస్ఈగా కొనసాగుతున్నారు. నాలుగు పోస్టుల్లో ఉన్న ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఆసక్తి చూపరు. మరో నెలలో పదవీ విరమణ చేయనున్న సదరు అధికారి.. మూడు, నాలుగు నెలలుగా.. పనులపై అంతగా దృష్టి సారించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



తార్నాకలోని నిజాం కళాశాల హాస్టల్, మెస్ మూసివేత

- ఓయూ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఆందోళన, విద్యార్థుల ధర్నా

6

బెదిరింపు కాల్స్ వస్తున్నాయి

- మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ ఫిర్యాదు



సౌదీలో డ్రైవర్ ఉద్యోగమంటూ మోసం

- వ్యవసాయం చేయిస్తూ వేధింపులు
- ఆరోగ్యం క్షీణించిన నా భర్తను రప్పించండి
- సీఎం ప్రజావాణిలో వినతి

6

తరగతి మారేదెప్పుడు?

అద్దె గదుల్లోనే సర్కారు స్కూళ్లు

- ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు కరువు
- మరికొన్ని ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లలో నిర్వహణ
- బాగ్‌లింగంపల్లి ఘటనతో మరోసారి వెలుగులోకి..



ఉదయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నడుస్తున్న పాఠశాల

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా, ఐదేళ్లకోసారి పాలకులు మారుతున్నా కొన్ని సర్కారు స్కూళ్ల గతి మారడం లేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా సర్కారు స్కూళ్లకు సొంత భవనాలు నిర్మించకపోవడంతో విద్యార్థులు అద్దె గదులు, కమ్యూనిటీ హాళ్లలో ఇబ్బందులు పడుతూ పాఠాలు నేర్చుకుంటున్నారు. హైదరాబాద్ జిల్లాలోని సర్కారు బడుల నిర్వహణ అధ్వానంగా మారింది. గదుల కొరతతో కొన్నిచోట్ల ప్రాథమిక, ఉన్నత తరగతులను విభజించి ఉదయం, మధ్యాహ్నం షిఫ్ట్ పద్ధతితో తరగతులు నిర్వహిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ కమ్యూనిటీ హాళ్లలోనే సరైన సౌకర్యాలు లేకుండా పాఠశాలలు నడుస్తున్నాయి.

నెలవారీ కిరాయి రూ. 18-20 లక్షలు

జిల్లాలోని మొత్తం 713 స్కూళ్లలో 159 పాఠశాలలు అద్దె ఇళ్లలో నడుస్తున్నాయి. వాటికి నెలవారీ కిరాయి కింద సుమారు రూ. 18-20 లక్షల వరకు చెల్లిస్తున్నారు. కిరాయి ఇళ్లు, కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్న స్కూళ్లను పక్కా భవనాల్లోకి మార్చాలని కొన్నేళ్లుగా

మిగతా 4వ పేజీలో..



త్వరలో

ఐపీఎస్‌ల బదిలీలు?

పోలీస్ శాఖపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్

- అక్రమార్కుల ప్రక్షాళనకు రంగం సిద్ధం
- ట్రై కమిషనరేట్స్ డీసీపీల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భారీ స్థాయిలో ఐఏఎస్‌ల బదిలీలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, నేడో రేపో ఐపీఎస్‌ల బదిలీలకు సంబంధించిన ఉత్తుర్వులను జారీ చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కొంతకాలంగా పోలీస్ శాఖపై స్పెషల్ ఫోకస్ పెట్టిన ఉన్నత అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న డీసీపీ స్థాయి అధికారులపై ఆరా తీసినట్లు సమాచారం. దాంతో డీసీపీలకు స్థానచలనం కలిగే అవకాశం ఉన్నట్లు ఆ శాఖలో చర్చించుకుంటున్నారు. దీంతో ట్రై కమిషనరేట్స్ డీసీపీల్లో గుబులు మొదలైంది. బదిలీలు అనివార్యమని భావించిన కొందరు డీసీపీలు ప్రాధాన్యం కలిగిన పోస్టింగ్‌లు దక్కించుకునేందుకు తీవ్రంగా లాబీయింగ్ చేసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పెరిగిపోయిన అవినీతి, అక్రమాలు

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే మొట్టమొదట పోలీస్ శాఖపైనే దృష్టి సారించింది. ట్రై కమిషనరేట్ సీపీలను, డీసీపీలు, ఏసీపీలను మార్చింది. లాబీయింగ్ చేసుకున్న కొంతమంది డీసీపీలు, ఏసీపీలు ఫోకల్ పోస్టింగ్‌లు పొందారు. వారిలో కొందరు డీసీపీలు, ఏసీపీలు అక్కడి నుంచి కదలకుండా ఉండేందుకు గట్టి ప్రయత్నాలు చేసుకున్నారు. దాంతో పలు జోన్‌లు, డివిజన్‌లలో అవినీతి పెచ్చుమీరిపోయిందనే విమర్శలు వస్తున్నాయి. కేసులు పక్కన పడేసి కాసుల కోసం అర్రులు చాస్తున్నట్లు, సివిల్ తగాదాల్లో సెటిల్‌మెంట్ చేసి రూ. లక్షలు వెనకేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో ఉన్నతాధికారులు ఇటీవల భారీస్థాయిలో

మిగతా 4వ పేజీలో..

వజ్రపు ఉంగరం బహుమతి పేరుతో.. టీచర్‌కు టోకరా



- రూ.2.02 లక్షలు కొట్టేసిన సైబర్ నేరగాడు
- సోషల్‌మీడియాలో స్నేహం పేరుతో మోసం

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మహిళా టీచర్‌తో సోషల్‌మీడియాలో స్నేహం నటించిన సైబర్ నేరగాడు వజ్రపు ఉంగరం బహుమతి పంపించానని నమ్మించి రూ.2.02 లక్షలు కొట్టేశాడు. సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన 41 ఏళ్ల మహిళా టీచర్‌కు గతేడాది డిసెంబర్‌లో ఫేస్‌బుక్ మెసేంజర్ నుంచి కాల్ వచ్చింది. 'నాపేరు టోనీ విలియం. లండన్ నుంచి మాట్లాడుతున్నా' అని పరిచయం చేసుకున్నాడు. 'నాకు భారతీయులు అంటే చాలా ఇష్టం. ఎంతో మంది ప్రొఫైల్స్ చెక్ చేశాను. నాకు నచ్చిన క్వాలిటీస్ ఉన్న ప్రొఫైల్ కనిపించలేదు. మొదటిసారి మీ ప్రొఫైల్ నచ్చింది. అందుకే మీకు కాల్ చేశాను' అన్నాడు. అలా వారి మధ్య స్నేహం ఏర్పడింది.

లండన్‌లో ఆస్తి రాసిస్తానని..

తాను లండన్‌లో పెద్ద కోటీశ్వరుడినని, రెండు పెద్ద పెద్ద ఇళ్లు, అపారమైన ఆస్తులు ఉన్నాయని నమ్మబలికాడు. కానీ నాకు వారసులు లేరని, తనకిష్టమైన భారతీయులకు ఆస్తిలో

మిగతా 4వ పేజీలో..



సచివాలయం పరిసరాల్లో కురుస్తున్న వర్షం

నగరంలో వర్షం..!

- పలు ప్రాంతాల్లో జలమయమైన రహదారులు
- మరో నాలుగు రోజులు వర్షాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ఖైరతాబాద్, లకిడీకాపూల్, పంజాగుట్ట, ట్యాంక్‌బండ్, ఉప్పల్, హయత్‌నగర్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వరదనీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం సమీపంలో భారీగా వరదనీరు నిలిచిపోయింది. ట్రాఫిక్‌జాం కావడంతో వాహనదారులు వర్షంలో తడిసి ముద్దయ్యారు. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు ఉప్పల్, న్యూ నాగోల్‌లో 12.5, హయత్‌నగర్‌లో 11.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గ్రేటర్‌లో మరో నాలుగురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

అత్యవసర బృందాలు కావలెను

- టెండర్ నోటిఫికేషన్ ప్రకటించిన హైడ్రా
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో..

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో హైడ్రా అప్రమత్తమైంది. వర్షాకాల అత్యవసర బృందాల ఏర్పాటుకు టెండర్ నోటిఫికేషన్ ప్రకటించింది. వాహనాలతో కూడిన బృందాల కోసం రూ.20 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. స్టాటిక్ టీంలకు మరో రూ.8కోట్ల నుంచి రూ.9 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. గతంలో జీహెచ్ఎంసీ వరద నీటి పంపింగ్‌కు మోటార్లను అద్దె ప్రాతిపదికన వినియోగించేది. దానికి ఖర్చు ఎక్కువవుతోందని గుర్తించిన హైడ్రా మోటార్లు, మరికొన్ని పరికరాలు కొనుగోలు చేయాలని

మిగతా 4వ పేజీలో..

బాధితులకు శ్రీలీల స్పర్శ్



హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఖాజాగూడలోని స్పర్శ్ హాస్పిస్‌ను సినీనటి శ్రీలీల శుక్రవారం సందర్శించారు. సంస్థ కేంద్రంలో ఉన్న రోగులతో ముచ్చటించారు. వారిని ఉత్సాహపరుస్తూ నృత్యం కూడా చేశారు. అనంతరం స్పర్శ్ హాస్పిస్‌కు నిధుల సమీకరణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'గార్డియన్ ఆఫ్ స్పర్శ్' కార్యక్రమాన్ని శ్రీలీల ప్రారంభించారు. జీవితపు చివరి దశలో ఉన్న రోగులకు స్పర్శ్ సేవలనందిస్తోంది.



నిమ్స్‌మేలో కొట్టేసిన శ్రీగంధం చెట్లు

నగరంలో పార్థీ గ్యాంగ్

- నిమ్స్ మే, జూబ్లీహిల్స్‌లో శ్రీగంధం చెట్ల నరికివేత
- నలుగురు మహిళల అరెస్టు
- పరారీలో 19 మంది ముఠా సభ్యులు


బంజారాహిల్స్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను నరికి బ్లాక్ మార్కెట్ తరలించే పార్థీ గ్యాంగ్ కన్ను నగరంపై పడింది. 23 మందితో కూడిన గ్యాంగ్ సభ్యులు 20 రోజుల క్రితం నగరానికి వచ్చి రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. నిమ్స్‌మేతో పాటు జూబ్లీహిల్స్‌లో ఓ ఇంట్లో పెంచుకుంటున్న గంధపు చెట్లను నరికేశారు. వాటిని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకొని పారిపోతుండగా జూబ్లీహిల్స్ పోలీసులు నలుగురు మహిళలను పట్టుకున్నారు. 19 మంది పరారీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన ఈ గ్యాంగ్‌లో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. పురుషులు రెక్కీ నిర్వహించి నిమ్స్‌మేలో శ్రీగంధం చెట్లు ఉన్నట్లు గుర్తించారు. మహిళలు, పిల్లలు సందర్శకుల్లా వెళ్లి చెట్లను నరికి చిన్న దుంగల్లా మార్చి బ్లాక్ మార్కెట్‌లో అమ్మేశారు. దీనిపై మధురానగర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. తమ మీదకు పోలీసుల దృష్టి మళ్లలేదని భావించిన దొంగలు జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంట్లో గంధం చెట్టును నరికి అమ్మేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. దుంగలను తరలిస్తున్న ఆటో నంబర్ ఆధారంగా డ్రైవర్‌ను గుర్తించి ప్రశ్నించగా మహిళల్ని ఉప్పల్‌లో దించినట్టు చెప్పాడు. ప్రత్యేక బృందాలుగా మారిన పోలీసులు ఉప్పల్‌లో దాడులు నిర్వహించారు. పలన్‌భాయ్ పార్థీ, షానాజ్ బాయి, నిమ్మత్ బాయి, మాధురి పోలీసులకు చిక్కారు.

బెదిరింపు కాల్స్ వస్తున్నాయి

● మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే రాజాసింగ్ ఫిర్యాదు

మంగళ్‌హాట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, తనకు రక్షణ కల్పించాలని బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. శుక్రవారం మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత రెండు మూడు రోజుల నుంచి కొందరు వ్యక్తులు ఫోన్‌చేసి బాంబులతో దాడిచేసి కుటుంబాన్ని అంతం చేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజాసింగ్‌కు వచ్చిన ఫోన్ కాల్స్ ఏ నంబర్ల నుంచి వచ్చాయి. వాటి సిమ్ కార్డులను ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు. లోకేషన్‌ను ట్రేస్ చేసే పనిలో ఉన్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 70ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
8.00,11.00,2.00,6.00,9.00
సుదర్శన్ 35 - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్ 8.00am

ఈనెల 20న బ్రహ్మాండమైన విడుదల




సంధ్య 35 ఎంఎం- ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
తారకరామ 70 ఎంఎం ఎ/సి - కాచిగూడ
మల్లికార్జున 70 - కూకట్‌పల్లి
అలంకార్ (ప్రతాప్) - లంగర్‌హౌస్
అర్జున్ 70 ఎంఎం - కూకట్‌పల్లి
జ్యోతి 70 - ఆర్.సి.పురం
కోణార్క్ 70 - దిల్‌సుఖ్‌నగర్
సూపర్ 70 ఎ/సి - బాలాపూర్
ఇంద్ర నాగేంద్ర కాంప్లెక్స్ - కర్మన్‌ఘాట్
ముకుంద్ 70 - మేడ్చల్
GLOBAL CINEMAS RELEASE

విజయవంతమైన 2వ వారం



సుదర్శన్ 35 ఎంఎం - ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.15,6.00,9.15

SUPER HIT నేడే చూడండి



దేవి 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
2.15,6.00,9.15
MG MOVIES 9989522999



ENGLISH VERSION IN 4DX: NEXUS MALL - KUKATPALLY | IRRUM MANZIL - KHAIRTABAD | IN 2D: INDRA VENKATARAMANA PADMAVATHI - KACHIGUDA | PRASADS MULTIPLEX - NTR GARDENS | AMB CINEMAS - GACHIBOWLI | PVR - INOX CINEMAS: NEXUS MALL - KUKATPALLY | IRRUM MANZIL - KHAIRTABAD | INORBIT - MADHAPUR | PRESTON PRIME - GACHIBOWLI | ICON - HITECH | R.K.COMPLEX - BANJARAHILLS | PLAY HOUSE HYD - BAD NEXT GALLERIA - PUNJAGUTTA | HYDERABAD NEXT GALLERIA - MOOSRAMBAGH | CENTRAL - PUNJAGUTTA | PRISM - GACHIBOWLI | ATRIUM - GACHIBOWLI | GVK MALL - BANJARAHILLS | MAHESHWARI PARMESHWARI MALL - KACHIGUDA | GSM MALL - MIYAPUR | ASHOKA ONE MALL - KUKATPALLY | SATTVA NECKLACE MALL - KAVADIGUDA | MIRAJ CINEMAS: SHALINI SHIVANI - DILSUKHNAGAR | CINETOWN - MIYAPUR | JP CINEMAS - CHANDANAGAR | CINEPOLIS: MANTRA MALL - ATTAPUR | LULU MALL - KUKATPALLY | DSL MALL - UPPAL | CCPL - MALKAJGIRI | SUDHA - SHALIBANDA | TNR NORTH CITY - KOMPALLY | ASIAN CINEMAS: CINESQUARE - UPPAL | M CUBE MALL - ATTAPUR | CINEPLANET - KOMPALLY | TIVOLI - SEC'BAD | APARNA CINEMAS - NALLAGANDLA | AAA CINEMAS - AMEERPET | PLATINUM MOVIE TIME - GACHIBOWLI | MOVIEMAX AMR PLANET - ECIL | SAIRAM - MALKAJGIRI
TELUGU VERSION IN 2D: PVR - INOX CINEMAS: NEXUS - KUKATPALLY | PLAY HOUSE HYDERA - BAD NEXT GALLERIA - PUNJAGUTTA | GVK MALL - BANJARAHILLS | GSM MALL - MIYAPUR | ASHOKA ONE - KUKATPALLY | SATTVA NECKLACE MALL - KAVADIGUDA | MIRAJ CINEMAS: CENTRAL - BALANAGAR | RAGHAVENDRA - MALKAJGIRI | GEETHA - CHANDANAGAR | CINEPOLIS: LULU MALL - KUKATPALLY | DSL MALL - UPPAL | CCPL - MALKAJGIRI | TNR NORTH CITY - KOMPALLY | ASIAN CINEMAS: LAXMIKALA CINEPRIDE - MOOSAPET | PLATINUM MOVIE TIME SKYMALL - SANATHNAGAR | GPR - KUKATPALLY | MAHALAXMI - KOTHAPET
HINDI VERSION IN 2D: INDRA VENKATARAMANA PADMAVATHI - KACHIGUDA | PVR - INOX CINEMAS: CENTRAL MALL - PUNJAGUTTA | HYDERABAD NEXT GALLERIA - MOOSRAMBAGH | MAHESHWARI PARMESHWARI - KACHIGUDA | CINEPOLIS: MANTRA - ATTAPUR | SUDHA - SHALIBANDA

కలిసుందామా... చంపుకుందామా?

● భారతదేశం మాది, ఏలుతున్నది మేము
● అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వివాదాస్పద వాఖ్యలు

సైదాబాద్/చాదర్‌ఘాట్, జూన్13(ఆంధ్రజ్యోతి): కలిసుందామా.. చంపుకుందామా.. అంటూ బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం మలక్‌పేట ఆస్మాన్‌ఘడ్‌లోని ఎలైట్ రెసిడెన్సీ గ్రౌండ్ ఫోర్ పార్కింగ్ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని బ్రహ్మానందం అనే వ్యక్తి అడ్డుకోగా బిల్డర్, అతడి అనుచరులు దాడి చేసిన విషయం తెలిసిందే. గాయపడిన బ్రహ్మానందం సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఆసత్రికి వచ్చిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాతబస్తీలో ఆడబిడ్డలపై పాకిస్తాన్‌లో దౌర్జన్యం చేసినట్టు చేస్తున్నారని, చట్టం, ధర్మం, న్యాయం అందరికీ ఒకేలా ఉండాలన్నారు. మీరు హైదరాబాద్‌లో ఉండాలనుకుంటే వాటిని పాటించాలని సూచించారు. భారతదేశం మాది, ఏళుతున్నది మేమని అన్నారు. అధికార పార్టీ ముసుగులో, లోపాయికారీ ఒప్పందాలతో అత్యాచారాలు. హత్యకాండలు చేస్తే రాబోయే రోజుల్లో వంద రేట్లు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రకాశ్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





ఫోన్‌లో డీసీపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

బిల్డర్‌తోపాటు మరో నలుగురిపై కేసు

అపార్ట్‌మెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణంపై అభ్యంతరం తెలిపిన అపార్ట్‌మెంట్ నివాసి బ్రహ్మానందంపై బిల్డర్, అతడి అనుచరులు దాడి చేశారు. అపార్ట్‌మెంట్‌కు చెందిన వృద్ధురాలు కామేశ్వరీ మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మహిళల పట్ల పరుష పదజాలంతో దూషించినట్టు ఫిర్యాదులో పేర్కొంది. దాంతో బిల్డర్ మసీఉద్దీన్, అతడి అనుచరులు ఇషాఖ్, అర్షద్, జావేద్‌తోపాటు వాచ్‌మన్ ఖలీల్‌ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు.

విద్యార్థులు ప్రాక్టికల్ విజ్ఞానాన్ని పొందాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫైనాన్స్‌లో ప్రాక్టికల్ విజ్ఞానాన్ని పొందాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్ర కంటి శేఖర్ సూచించారు. వేగంగా మారుతున్న ఆర్థికవ్యవస్థలో ఉన్న అవకాశాలు, సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సెంట్రల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (సీఎస్‌డీఎల్), భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు(ఎస్ఈబీఐ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్(బీఎస్ఈ) సౌజన్యంతో శుక్రవారం ఉస్మానియా యూని వర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 'క్యాపిటల్ మార్కెట్లు, డిపాజిటరీ సేవల'పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్థిక సాక్షరతను పెంపొందించడం, అకాడెమియా- పరిశ్రమల మధ్య భాగస్వామ్యాన్ని పటిష్టం, పెట్టుబడులు, నియంత్రణ, ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ మెకానిజంపై బతిన్ మహంతి, శివప్రసాద్, నాగభూషణం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 200కి పైగా కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ముఖ్య వక్తలు

అక్రిడిటేషన్ విధి విధానాలను వెంటనే ప్రకటించాలి

● అర్హులైన జర్నలిస్టులకు కార్డులు ఇవ్వాలి
● డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ

పంజాగుట్ట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అక్రిడిటేషన్ విధి విధాలను వెంటనే ప్రకటించి అర్హులైన జర్నలిస్టులు అందరికీ వీలైనంత తర్వగాకార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూజేఐ) జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ చేశారు. అక్రిడిటేషన్ పాలసీపై ఏడాది కాలంగా ఎటు తేల్చకుండా కాలయాపన మంచిది కాదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిల్ దేశాయ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. జర్నలిస్టుకు బీమా, ఆస్పత్రులలో ఉచిత చికిత్స, ఆరోగ్య కార్డులు తదితర అంశాలతోపాటు తెలంగాణలోని జర్నలిస్టుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి త్వరలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రైళ్లు, విమానాల టికెట్లలో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలన్నారు. టోల్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని తాము పోరాడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఈ అంశాలపై ప్రధాని మోదీకి విన్నవిస్తామని చెప్పారు.

నేడు ఉస్మానియా వర్సిటీలో జాతీయ సెమినార్

'జాతీయ విద్యావిధానం-2020, మీడియా పాత్ర' అంశంపై డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ తెలిపారు. ఉత్తమ జర్నలిస్టులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సిద్ధిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి క్రాంతి, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

తార్నాకలోని నిజాం కళాశాల హాస్టల్, మెస్ మూసివేత

● ఓయూ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఆందోళన, విద్యార్థుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తార్నాకలోని నిజాం కళాశాల హాస్టల్‌ను, మెస్‌ను అధికారులు రెండు రోజులుగా మూసివేశారు. దీంతో విద్యార్థులు శుక్రవారం హాస్టల్లో ఆందోళన చేపట్టారు. అనంతరం ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉస్మానియా యనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎదుట ధర్నాకు దిగారు. ఓయూ వీసీ స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ మెస్ మూసివేతపై కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా నిధుల కొరతతో ఉందని చెప్పారన్నారు. నిధుల కొరత ఉంటే వర్సిటీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మెస్‌ను పునఃప్రారంభించాలని, లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామన్నారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.



అడ్మినిస్ట్రేట్ బిల్డింగ్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

అత్యవసర బృందాలు కావలెను

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించింది. నాలుగు రోజుల్లోనే హైడ్రాలోని ఇంజనీరింగ్ అధికారులు టెండర్లపై కసరత్తు పూర్తి చేసి నోటిఫికేషన్ ప్రకటనకు రంగం సిద్ధం చేశారు. నేటి సాయంత్రం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. 150 బృందాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఒక్కో బృందంలో గతంలో నలుగురు కార్మికులు ఉండగా, ఇప్పుడా సంఖ్యను మూడుకు కుదించారు. బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటున్నాయా..? పని చేస్తున్నారా..? లేదా అన్నది పరిశీలించేందుకు, వారితోపాటు పని చేసేందుకు ఒక్కో బృందంలో ఒక్కో డీఆర్ఎఫ్ సిబ్బంది ఉంటారు. సర్కిళ్ల వారీగా టీంల పనితీరును హైడ్రాలోని రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది పర్యవేక్షిస్తారు. వరద నీటి కాలువలపై ఉండే క్యాచ్‌పిట్లు, మైనర్ నాలాల ఇన్‌లెట్, అవుట్ లెట్ల వద్ద చెత్తా చెదారం తొలగింపునకు 350కి పైగా స్టాటిక్ టీంలు ఏర్పాటు చేయనున్నారు. వీటి కోసం రెండు, మూడు రోజుల్లో మరో టెండర్ ప్రకటించనున్నారు.

విమాన ప్రమాదానికి నైతిక బాధ్యతగా

కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి : ధర్పల్లి

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లో విమాన ప్రమాదానికి నైతిక బాధ్యతగా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విమాన ప్రమాదం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విమానంపై రెండుసార్లు కంప్లయింట్ వచ్చాయని చెప్పారు. సాంకేతిక లోపమున్న విమానం నడపడానికి అనుమతి ఇచ్చిన అధికారి ఎవరు? అని ఆయన ప్రశ్నించారు. గతంలో ప్రమాదాలు జరిగితే కాంగ్రెస్ మంత్రులు బాధ్యత వహించి పదవులకు రాజీనామా చేశారని గుర్తుచేశారు.

వజ్రపు ఉంగరం బహుమతి పేరుతో..

టీచర్‌కు టోకరా

(3వ పేజీ తరువాయి)

సగం రాసి ఇవ్వాలని నిర్ణయించుకున్నాని తెలిపాడు. ఇన్ని రోజులకు ప్రొఫైల్ నచ్చి మీతో స్నేహం చేస్తున్నానని చెప్పాడు. ఆమె పూర్తిగా నమ్మిన తర్వాత 'ముందుగా నా స్నేహితురాలి కోసం ఒక ఖరీదైన వజ్రపు ఉంగరం, బంగారు గొలుసు పార్శిల్ పంపుతున్నా' అని టీచర్‌కు చెప్పాడు. పార్శిల్ పంపేముందు ఫొటోలు, వీడియోలు తీసి పోస్టు చేశాడు. కొద్దిరోజుల్లో తనకు ఖరీదైన పార్శిల్ వస్తోందని ఆ టీచర్ మురిసిపోయింది. అనంతరం ఆమెకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి కస్టమ్స్ అధికారులం మాట్లాడుతున్నామంటూ ఒక ఫోన్ వచ్చింది. 'మీ పేరుతో పార్శిల్ వచ్చింది. అందులో ఖరీదైన డైమండ్, బంగారం ఉన్నాయి. ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్) క్లియరెన్స్ సర్టిఫికెట్ కావాలి. అప్పుడే పార్శిల్ డెలివరీ అవుతుంది' అని చెప్పారు. అందుకోసం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దాంతో బాధితురాలు వారు చెప్పిన విధంగా రూ.2.02లక్షలు చెల్లించింది. అయినా పార్శిల్ రాకపోవడం, లండన్ స్నేహితుడు సహా ఎవరూ స్పందించకపోవడంతో ఇదంతా మోసమని బాధితురాలు గుర్తించింది. పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

త్వరలో ఐపీఎస్‌ల బదిలీలు?

(3వ పేజీ తరువాయి)

ఏసీపీ (డీఎస్పీ)లను బదిలీ చేశారు. ఇప్పుడు డీసీపీల ప్రక్షాళనకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వసూళ్లలో 'స్పెషల్' డీసీపీ

ఖరీదైన కమిషనరేట్‌లో స్పెషల్ పోలీస్ డీసీపీగా పనిచేస్తున్న ఒక అధికారి వసూళ్లలో స్పెషల్ అనిపించుకుంటున్నారు. వసూళ్ల కోసం ఆయన ఏకంగా క్షేత్రస్థాయిలో ఇద్దరు పోలీసులను నియమించుకున్నట్లు సమాచారం. వసూళ్లకు పాల్పడుతున్న క్రమంలో వారు ఇతర పోలీసులకు చిక్కి కేసుల పాలయ్యారు. ఆ తర్వాత డీసీపీ వారిని దూరం పెట్టి జైలు నుంచి బయటకు తెచ్చేందుకు పరోక్షంగా సహకరించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అక్రమాల హవా

శివారులో ఉన్న ఓ ఖరీదైన కమిషనరేట్‌లో డీసీపీల హవా కొనసాగుతున్నట్లు డిపారుమెంట్‌లో జోరుగా చర్చ జరుగుతోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఖరీదైన కమిషనరేట్ బాస్‌గా బాధ్యతలు చేపట్టిన కమిషనర్, పాలనలో సింహభాగం డీసీపీల చేతుల్లోనే పెట్టినట్లు తెలుస్తోంది. దాంతో వారి అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఖరీదైన కమిషనరేట్ ఇమేజ్ డ్యామేజ్ అయిందని, అనవసర విషయాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టిన సీపీ అబాసుపాలైనట్లు డిపార్టుమెంట్‌లో జోరుగా చర్చ జరుగుతోంది. కొందరు డీసీపీలైతే ఏసీపీలను పక్కకు నెట్టి మరీ అక్రమార్కులతో చేతులు కలిపి, ఇన్‌స్పెక్టర్ల సహకారంతో అడ్డగోలు దందాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అలా సంపాదించిన డబ్బుతో విదేశాల్లో ఆస్తుల కొనుగోలుకు ఇటీవల ఒక డీసీపీ ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. దానిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. నేడో రేపో జరగబోయే ఐపీఎస్‌ల బదిలీల్లో ఉన్నతాధికారులు ఏ మేరకు ప్రక్షాళన చేస్తారో వేచి చూడాల్సిందే.

తర'గతి' మారేదెప్పుడు?

3వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు వినతిపత్రాలు అందజేస్తున్నా ఫలితం ఉండడం లేదు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	
మొత్తం	713
విద్యార్థుల సంఖ్య	94,339
సొంత భవనాలున్న స్కూళ్లు	446
అద్దె గదుల్లో ఉన్నవి	159
కమ్యూనిటీ హాళ్లలో ఉన్నవి	68
వివిధ ప్రభుత్వ భవనాల్లో ఉన్నవి	40

కమ్యూనిటీ హాళ్లలో అవస్థలు

కమ్యూనిటీ హాళ్లలోని స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, లైట్లు సరిగా లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లోని పాఠశాలల్లో స్థానికులు, వీధి వ్యాపారులు తరగతి గదుల్లోని సెల్ఫ్‌లు, సజ్జెలపై వస్తువులను పెడుతున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అలాగే రాత్రి వేళల్లో ఆకతాయిలు మద్యం తాగుతూ పాఠశాల పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనాలు కాకపోవడంతో తమకు స్వేచ్ఛ లేకుండా పోయిందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, షేక్‌పేట్, నాంపల్లి, ముషీరాబాద్, అంబర్‌పేట్, సికింద్రాబాద్, గోల్కొండ, ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కువగా అద్దె గదులు, కమ్యూనిటీ హాళ్లలో స్కూళ్లు నడుస్తుండడంతో తల్లిదండ్రులు.. అక్కడికి పంపించేందుకు ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది.

చొరవ చూపేవారేరీ?

ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని గొప్పలు చెబుతున్న పాలకులు, అధికారులు అద్దె భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో నడుస్తున్న వాటికి మోక్షం కల్పించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని సర్కారు స్థలాలు కబ్జాదారుల చేతిలో అన్యాకాంత్ర మవుతుంటే చూస్తున్నారే తప్పా అక్కడ నూతన పాఠశాలల నిర్మించేందుకు చొరవ చూపించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన మన ఊరు-మన బడి, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో.. ఇప్పటికే అక్కడ కొనసాగుతున్న పాఠశాలలకు అరకొరగా మరమ్మతులు చేశారని, పక్కా స్కూల్ భవనాలను నిర్మించలేకపోయారని తెలిపారు.

బాగ్‌లింగంపల్లి ఘటనతో తెరపైకి..

నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉత్సాహంతో విద్యార్థులు స్కూళ్లకు వెళ్లారు. అయితే అద్దె భవనంలో నడుస్తున్న బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు యజమాని తాళం వేయడం జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. 13 నెలల నుంచి ఇంటి కిరాయి చెల్లించకపోవడంతో విసిగివేసారిన యజమాని భవనానికి తాళం వేసి నిరసన తెలపడంతో అద్దె గదుల్లోని పాఠశాలల వ్యవహారం తెరపైకి వచ్చింది. తక్షణమే సర్కారు బడులకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జావిద్, అశోక్ డిమాండ్ చేశారు.

మంత్రి వర్గ విస్తరణలో బంజారాలకు అన్యాయం

● సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో బంజారాలకు తీరని అన్యాయం జరిగిందని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబు నాయక్ అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటనే బంజరా అని ఆ పార్టీని నమ్మిన బంజారా సమాజాన్ని మంత్రివర్గ విస్తరణలో తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. సమావేశంలో సేన వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురాం రాథోడ్, ప్రధాన కార్యదర్శి రేఖ్యానాయక్, ఉపాధ్యక్షుడు రవినాయక్, పరశురాంనాయక్, బీంలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎలక్షన్ మెటీరియల్ మ్యాన్‌ఫ్యాక్చర్ ట్రేడర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

బర్కత్‌పుర, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్షన్ మెటీరియల్ మ్యాన్‌ఫ్యాక్చర్ ట్రేడర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు అసోసియేషన్ నూతన అధ్యక్షుడు జగన్ నాగుల తెలిపారు. కోఠిలోని ఎస్‌వీఎం గ్రాండ్‌లో జరిగిన అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్‌లో ఈ నూతన కార్యవర్గం ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. నూతన ప్రధాన కార్యదర్శిగా మురళీధ యానపల్లి, కోశాధికారిగా వాసు కటకం, గౌరవ అధ్యక్షుడుగా ఎక్కాల నందు, సలహాదారులుగా కిషోర్‌గుప్తా, విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఉస్మాన్ షేక్, వేణు గుండేటి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏ.కృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎక్కాల భిక్షపతిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అసోసియేషన్‌ను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ

నార్సింగ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా రవాణాశాఖ అధికారులు రెండవరోజు కూడా స్కూల్ బస్సుల తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా అప్పా జంక్షన్, రాజేంద్రనగర్, నార్సింగ్ ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. లంగర్‌హౌజ్ టిప్పుఖాన్‌పూల్ బ్రిడ్జి వద్ద నిబంధనలు పాటించని 12 బస్సులను సీజ్ చేశారు. ఎలాంటి నిబంధనలు లేకుండా బస్సులు నడుపుతున్నారని, అలాంటి బస్సులను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. బస్సులు సీజ్‌తో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఆర్టీఏ అధికారులు హెచ్చరించారు. నిబంధనలు పాటించని స్కూల్స్‌కు నోటీసులు ఇస్తున్నామని, వారు వెంటనే స్పందించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. మోటర్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ నవీన్, కిరణ్‌కుమార్, సునీతారెడ్డి, కృష్ణవేణి పాల్గొన్నారు.

యువకుడికి 7 రోజులు జైలు

మదీన, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడికి న్యాయమూర్తి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి... చాంద్రాయణగుట్ట నసీబ్‌నగర్ పూల్‌బాగ్‌కు చెందిన సయ్యద్ అక్బర్ కుమారుడు సయ్యద్ వజాహత్(23) ఏసీ టెక్నీషియన్. ఈనెల 12న బస్తీలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన 9వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మంద మురళి నిందితుడికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపీ తెలిపారు.

ధూల్‌పేట ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌పై దాడి కేసులో నలుగురికి జైలు

మంగళ్‌హాట్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ధూల్‌పేట ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.నవీన్‌కుమార్‌పై దాడిచేసిన కేసులో నలుగురు నిందితులకు 16వ న్యాయస్థానం అడిషనల్ చీఫ్ జడ్జి రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించారు. ఇన్‌స్పెక్టర్ మహేశ్ తెలిపిన వివరాల మేరకు.. మంగళ్‌హాట్ గంగాబౌలికి చెందిన విక్రంసింగ్, ఆర్.రవిరాజ్‌సింగ్, విశాల్‌సింగ్, రాజేశ్వరి భాయి 11-11-2018 సంవత్సరంలో ఓ కేసు విషయంలో ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద జరిగిన గొడవలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.నవీన్‌కుమార్‌పై దాడి చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం నలుగురు నిందితులకు జైలుశిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయండి



సంక్షేమ భవన్‌ను ముట్టడించేందుకు వస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కార్వాన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాల్లో నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేసి, సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాసాబ్‌ట్యాంక్ సంక్షేమ భవన్ కార్యాలయాన్ని ముట్టడించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. గురుకుల విద్యాసంస్థలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవతీసుకొని నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యా సంస్థల్లో నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సంక్షేమ భవన్ ముట్టిడి చేసిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల వ్యవస్థాపకుడు రామారావు

విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు

కార్వాన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సింధూ మహిళా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కోసం శుక్రవారం వారివారి ఉద్యోగాలకు సంబంధించిన సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యం పరిశీలించింది. కార్యక్రమంలో మ్యాజిక్ బస్సు అధికారి సత్యనారాయణ, కళాశాల వ్యవస్థాపకలు ఐ.రామారావు, కళాశాల అధ్యక్షుడు జై.వెంకట చలపతి, వైస్ ప్రిన్సిపల్ ఎం.నరేందర్‌రెడ్డి, జూనియర్‌కళాశాల ప్రిన్సిపల్ రాణి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అవగాహన

రాజేంద్రనగర్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ సంస్థ పంచాయతీరాజ్, వికేంద్రీకృత ప్రణాళిక, సామాజిక సేవల కేంద్రం విభాగానికి చెందిన డాక్టర్ అంజన్‌కుమార్ భాంజా శుక్రవారం తెలిపారు. బిహార్ ప్రభుత్వ గ్రామ పంచాయతీలకు చెందిన 89మంది గ్రామ పంచాయతీల అధ్యక్షులు, బిహార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (బీపార్డ్) నుంచి వచ్చిన ముగ్గురు యువ నిపుణులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రతినిధులు తెలిపారు.ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు చెందిన డాక్టర్ చిన్ని దొరై, డాక్టర్ ప్రత్యూష పట్నాయక్, డాక్టర్ అరుణ జయమణి, అజిత్ కుమార్ సింగ్, కడ్తాల్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'సోషల్ మీడియాలో దుష్ప్రచార దారులపై చర్యలు తీసుకోవాలి'

అఫ్జల్‌గంజ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఈమేరకు సైబర్ క్రైమ్స్ డీసీపీ కవితకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, కాంగ్రెస్ పార్టీ మీద బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇలాంటివారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'అక్రమ కేసులు ఎత్తివేయాలి'

పహాడిషరీఫ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): హిందువుల యువకులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు అన్నారు. శుక్రవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని లక్ష్మీగూడలో నివాసముంటున్న బాధిత హిందువుల యువకుల కుటుంబ సభ్యులను ఓదార్చి, బీజేపీ అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. బక్రీద్ మరుసటి రోజు ఆదివారం గోమాత కళేబరాలను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని అడ్డుకున్నందుకు జల్‌పల్లికి చెందిన హిందువులపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేసి, వారిని చంచలగూడ జైలుకు రిమాండ్‌కు పంపిన నేపథ్యంలో బాధితుల కుటుంబసభ్యులను పరామర్శించారు.

రాజా బహదూర్ వెంకట రామారెడ్డికి నివాళి

అఫ్జల్‌గంజ్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బొగ్గులకుంటలోని రాజాబహదూర్ వెంకట రామారెడ్డి బాలుర వసతి గృహం ఆడిటోరియంలో శుక్రవారం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు రిటైర్డ్ జస్టిస్ ఆర్.సుభాషణ్‌రెడ్డి, ప్రొఫెసర్ ఏఆర్ రెడ్డి, ఎల్.శివారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, సెక్రెటరీ తీగల మోహన్ రెడ్డి హాజరై రాజా బహదూర్ వెంకట రామారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజా బహదూర్ వెంకట రామారెడ్డి సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవో 263 అమలుపై క్యాబ్ వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం

చార్మినార్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రవాణా శాఖ జీవో నెం. 263 జారీ చేయడం ద్వారా సిటీ ఆటో, మోటార్ క్యాబ్ డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ చేసిన డిమాండ్లను పరిష్కరించినందుకు సిటీ ఆటో అండ్ మోటర్ క్యాబ్ డ్రైవర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహమూద్ హుస్సేన్ మక్కి తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మూడు సంవత్సరాలుగా, పైన పేర్కొన్న సమస్యలు పరిష్కారం కావడం సంతోషంగా ఉందన్నారు.

నీటి సమస్య రాకుండా చూడాలి

● ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్

నార్సింగ్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హకీంపేట్, మోహ్రాజ్ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం జలమండలి డీజీఎం, మేనేజర్‌లతో కలిసి కార్వాన్ ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్ పర్యటించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ ఏర్పాట్లు, బూస్టర్‌ను కనెక్ట్, నీటి సరఫరా తదితర విషయాలను పరిశీలించి, అధికారులతో చర్చించారు. ప్రజలకు నీటి సమస్య రాకుండా జలమండలి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని కౌసర్ సూచించారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

నిలోఫర్‌లో రక్షిత నీటి ఆర్వో ప్లాంట్ల ప్రారంభం

గన్‌పార్క్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రి ప్రాంగణంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద దివిస్ ల్యాబరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.31లక్షలతో సుజలాం సేఫ్ డ్రింకింగ్ వాటర్ (ఆర్వో)ప్లాంట్లను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్లను ఆస్పత్రి సూపరింటెండ్ ప్రొఫెసర్ డా.విజయ్‌కుమార్ ప్రారంభించారు. రోగుల సహాయార్థం ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తాగునీటి ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసినందుకు ల్యాబరేటరీ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ రెసిడెంటల్ మెడికల్ ఆఫీసర్ డా.సీహెచ్.నాగజ్యోతి, ల్యాబరేటర్ హెడ్.జి.నగేష్, ప్రొఫెసర్లు ఆర్.వినోద్‌కుమార్, శ్రీకాంత్, ఆర్ఎంఓ డా.రమ్య, వైద్యులు స్రవంతి, పల్లవి, కిరణ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్. https://ejyothy.com/XdkLijv**లో చదవండి.**
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminar**లో చూడగలరు. నోట్:** htpps://epaper.andhrajyothy .com**లో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.**





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | గోవిందరావు : 9703618721, రాజ్ కుమార్: 9985921389 కె. అనిల్ కుమార్: 99854 03628

రక్తదాతలు కావాలి

తలసీమియా బాధితులకు నెలకు 2 వేల యూనిట్లు అవసరం

- ప్రసూతి ఆస్పత్రుల్లోనూ ఇక్కట్లు
- ప్రజల్లో రక్తదానంపై అవగాహన లేమి
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'రక్తం నిల్వలకు కొరత ఏర్పడింది.. ఎక్కడి నుంచైనా తెచ్చుకోండి. ఎవరైనా దాత నుంచి రక్తం ఇస్తేనే మీ రోగికి ఏర్పాటు చేస్తాం..' ఇలా ప్రస్తుతం ఆస్పత్రుల్లో వినిపిస్తున్న మాటలు. ఎవరైనా బంధువులు, కుటుంబ సభ్యులు రక్తదానం చేసేందుకు ముందుకు వస్తేనో లేదా బయటి నుంచి తెస్తేనో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రక్తం అందజేస్తున్నారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి. తలసీమియా బాధితుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రసూతి ఆస్పత్రుల్లో గర్భిణులకు రక్తం బ్యాగ్ కోసం కుటుంబ సభ్యులు ఉరుకులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు అందుబాటులో ఉండడం లేదు. ప్రజల్లో రక్తదానంపై అవగాహన లేకపోవడంతో రక్త దాతలు ముందుకు రావడం లేదు. రక్త నిల్వల కొరతకు ఇదే ప్రధాన కారణంగా మారింది. గ్రేటర్‌లో ప్రతి ఏడాదికి దాదాపు 4.10 లక్షల యూనిట్ల రక్తం అవసరం. అయితే 2.80 లక్షల యూనిట్ల మేరకు మాత్రమే అందుబాటులో ఉంటోంది. బ్లడ్ బ్యాంకుల్లో నెగిటివ్ గ్రూప్ రక్తం దొరకడం మరింత కష్టంగా మారింది. ఏబీ నెగిటివ్, ఓ నెగిటివ్, బీ నెగిటివ్ ఏ నెగిటివ్ గ్రూప్ రక్తం కొరత బాధితులను తీవ్రంగా వేధిస్తోంది.

రక్త సేకరణపై చిత్తశుద్ధి ఏదీ..

రక్తాన్ని గ్రూపులుగా ఆవిష్కరించిన 'కరల్ ల్యాండ్ స్టేనర్' పుట్టిన రోజైన జూన్ 14ను 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం'గా జరుపుకొంటున్నారు. అయితే ప్రతి ఏటా దినోత్సవాల పేరిట కార్యక్రమాలను నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారే తప్పా, అవసరాల మేరకు రక్తం సేకరించే కార్యక్రమాలను ఏడాది పొడవునా నిర్వహించడం లేదు.

ప్రసూతి ఆస్పత్రుల్లో వారానికి వంద యూనిట్లు

తలసీమియా-సికిల్ సెల్ సొసైటీలో నాలుగు వేల మందికిపైగా బాధితులున్నారు. వీరికి నెలకు 2వేల యూనిట్లు రక్తం అవసరమవుతుంది. ఎంఎన్‌జే కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు రోజూ 20 యూనిట్లకు మించి రక్తం రోగులకు తప్పనిసరి అవుతోంది. బ్లడ్ కేన్సర్ రోగులు, కేన్సర్ బాధిత పిల్లలకు ప్లేట్‌లెట్స్ తక్కువ అవుతుండడంతో వారికి రక్తం ఎక్కించడం ప్రధానం. బాధితులకు 20 నుంచి 30 శాతం మేరకు మాత్రమే రక్తదానం చేయడానికి ముందుకు వస్తున్నారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే కేన్సర్, హిమోఫీలియా, తలసీమియా వ్యాధి గ్రస్తులతో పాటు ప్రసవానికి వచ్చే గర్భిణులకు ప్రతినెలా మూడు వేల యూనిట్ల మేరకు రక్తం అవసరమవుతుంది. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో వారానికి వంద యూనిట్ల రక్తం అవసరమవుతోంది.

ఫ్రెండ్స్ టు సపోర్ట్ సంస్థ సేవలు

రక్తదానంపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు మాత్రమే ప్రచారం చేస్తున్నాయి. హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని ఫ్రెండ్స్ టు సపోర్ట్ సంస్థ రక్తదానం చేయడం, సభ్యులను కూడగట్టుకోవడంలో విశేష కృషి చేసింది. వీరి వెబ్‌సైట్ ఆధారంగా చేసుకుని రోజుకు సగటున 300 మందికిపైగా రక్తదానం చేస్తున్నారు. రక్తదానం చేసేందుకు వచ్చేవారి కోసం మొబైల్ యాప్ (అప్లికేషన్స్) సదుపాయం కల్పించారు.

అవగాహన కల్పిస్తున్నాం



ప్రత్యేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం సేకరిస్తున్నాం. రోగులకు రక్తం అవసరం పడుతుండడంతో ఆస్పత్రికి వచ్చే కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. అయితే కొంతమంది ముందుకు వస్తున్నారు. మరికొందరు భయపడుతున్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలి. దీని వల్ల బాధితులకు రక్తం సకాలంలో అందుతుంది. ఎవరికి వారు స్వేచ్ఛగా వచ్చి రక్తదానం చేయడం మంచిది.

- డాక్టర్ శ్రీనివాసులు, డైరెక్టర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్

రక్తదానం ఇలా చేయవచ్చు

- ఒక వ్యక్తి జీవితంలో 168 సార్లు రక్తదానం చేయవచ్చు
- పురుషులు మూడు నెలలకు ఒకసారి, మహిళలు ఆరు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు
- ఆరోగ్యంగా ఉన్న 18 నుంచి 60 ఏళ్ల లోపు వారు అర్హులు
- రక్తదానం చేసిన 21 రోజుల్లోనే మళ్లీ కొత్తరక్తం సమకూరుతుంది.

వీరి నుంచి తీసుకోరు

- కొవిడ్, ఇతర వైరస్‌లు, ఇన్‌ఫెక్షన్ల బాధితుల నుంచి రక్తం సేకరించరు
- విదేశాలు, కొవిడ్ తీవ్రత ఉన్న రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన వారి వద్ద నుంచి కూడా రక్తం సేకరించరు
- హెపటైటిస్ బి, సి, హెచ్ఐవీ, రక్తపోటు అధికంగా ఉన్న వారి నుంచి రక్తాన్ని తీసుకోరు.

దాతలకు విశ్రాంతి

- రక్తదానం చేశాక 48 గంటల పాటు ఏ వ్యాయామమూ చేయకూడదు
- పొగ తాగడం, మద్యం సేవించడం వంటి వాటికి 24 గంటల పాటు దూరంగా ఉండాలి.



క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న వీసీ

ఓయూ నావిగేషన్ కోసం క్యూఆర్ కోడ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓయూ క్యాంపస్‌లోని వివిధ స్థలాలను సులభంగా గుర్తించి చేరుకోవడానికి క్యూఆర్ కోడ్ ఆధారిత నావిగేషన్ వ్యవస్థను ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (ఓటీబీఐ) విడుదల చేసింది. ఈ విధానం ద్వారా ఓయూలోని 400కి పైగా ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా గుర్తించి చేరుకోవచ్చు. ఈ వ్యవస్థను ఓయూ విద్యార్థులు డెవలప్ చేయగా, ప్రొఫెసర్ టి.హరినారాయణ (సలహాదారు), ఓటీబీఐ డైరెక్టర్ ప్రొఫెసర్ ఇ.విద్యాసాగర్ విద్యార్థులకు మార్గదర్శకత్వం చేశారు. క్యాంపస్ నావిగేషన్ క్యూఆర్ కోడ్ రూపొందించించిన విద్యార్థి, అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా వీసీ అభినందించారు.



స్టైల్ తత్త్వ .. మహిళా సాధికారతకు ప్రతీక

- మేయర్ గద్వాల విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టైల్ తత్త్వ ఒక ప్రదర్శన మాత్రమే కాదని, మహిళా సాధికారతకు ప్రతీక అని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కొనియాడారు. శుక్రవారం హైటెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టైల్ తత్త్వ ఎగ్జిబిషన్‌ను మేయర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఫ్లో కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని అన్నారు. ఫ్లో జాతీయ అధ్యక్షురాలు పూనమ్‌శర్మ మాట్లాడుతూ విధాన నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేయాలన్నారు. ఫ్లో హైదరాబాద్ ఛైర్‌పర్సన్ ప్రతిభ కుంద మాట్లాడుతూ డోక్రా కళ పునరుజ్జీవనానికి తోడ్పడేలా ప్రత్యేకంగా ఓ పెవిలియన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫ్యాషన్ స్టైలిస్ట్ డాలీ జైన్ మాట్లాడారు.

ధ్వంసమైన పైప్‌లైన్‌కు మరమ్మతులు

- నీటి సరఫరా పునరుద్ధరణ



పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించిన ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్13 (ఆంధ్రజ్యోతి): హైడ్రా ఆధ్వర్యంలో చింతల్‌బస్తీలో నాలా ఆక్రమణ నిర్మాణాలను గురువారం తొలగిస్తుండగా ధ్వంసమైన 300ఎంఎం డయా మెయిన్ పైప్‌లైన్‌కు వాటర్‌బోర్డు అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు పనులను పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో బంజారా హిల్స్ సంప్ ఔట్‌లెట్ నుంచి ఏసీ గార్డ్స్, చింతల్‌బస్తీ, మాసబ్‌ట్యాంక్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా యథావిధిగా కొనసాగింది. ఈ అత్యవసర మరమ్మతు పనులను వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎండీ ఆదేశాలనుగుణంగా ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా ఉచిత నీటి సరఫరా చేశారు.



సమీక్షలో మాట్లాడుతున్న వెంకటయ్య

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అట్రాసిటీ కేసులు, భూసమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, భూసమస్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి డీఎంసీ, ప్రతినెలా సివిల్ రైట్స్ డే నిర్వహించి చట్టాలపై, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అట్రాసిటీ కేసులకు నష్టపరిహారాన్ని చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2022- 2025లో ఇప్పటివరకు జిల్లాలో 571 అట్రాసిటీ కేసులు నమోదు కాగా.. 135 విచారణ దశలో ఉన్నాయని, 15 చార్జిషీట్ వేశారన్నారు. ఇప్పటివరకు 210 కేసుల్లో రూ.2.47 కోట్ల పరిహారాన్ని బాధితులకు అందజేశామన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముకుందరెడ్డి, డీసీపీ శ్వేత, కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కురసం, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాంప్రసాద్, ఎల్లేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓలు సాయిరామ్, రామకృష్ణ, జిల్లా సంక్షేమ అధికారులు ఆర్. కోటజీ, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

దేశీయ ఆవిష్కరణలే భారత్ బలం

- ఎఫ్ఎన్‌డీహెచ్ఎస్ కమిటీ కో-ఛైర్ అశోక్ అట్లూరి



మాట్లాడుతున్న అశోక్ అట్లూరి, చిత్రంలో సురేష్‌బాబు, రాధాకిషోర్, రామరాజు, దీప్తి గడ్డం

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశీయ ఆవిష్కరణలే భారతదేశపు బలం అని ఫిక్కీ నేషనల్ డిఫెన్స్ అండ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (ఎఫ్ఎన్‌డీహెచ్ఎస్) కమిటీ కో-ఛైర్, జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్ అట్లూరి అన్నారు. ఈ విషయాన్ని ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' నిరూపించిందని తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) శుక్రవారం బేగంపేటలో 'ఎంఎస్ఎంఈ యాక్సలరేట్ 2025' పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అశోక్ అట్లూరి మాట్లాడుతూ పాకిస్థాన్‌పై జరిపిన 'ఆపరేషన్ సిందూర్'లో దేశీయంగా అభివృద్ధి చేసిన డ్రోన్లు, అంతర్గతంగా జోడించిన డిటెక్టర్లు, జామర్లు, రాడార్లు విజయవంతంగా చైనీస్ డ్రోన్లను నిలువరించగలిగాయన్నారు. విప్లవాత్మక సాంకేతిక ఆవిష్కరణలతో మాత్రమే దీర్ఘ కాలంలో విజయం సాధించగలమన్నారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) జనరల్ మేనేజర్ సురేష్‌బాబు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా తమ ఉత్పత్తులను పలు ప్రభుత్వ శాఖలకు విక్రయించేందుకు ఎంఎస్ఎంఈలు సహాయపడుతున్నాయన్నారు. ఫిక్కీ తెలంగాణా డిఫెన్స్ అండ్ ఎయిరోస్పేస్ కమిటీ ఛైర్మన్ రాధాకిశోర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి సాంకేతికత, ఆవిష్కరణలతో నడిచే ఎంఎస్ఎంఈలే ఊతమని అన్నారు. ఫిక్కీ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు, ఓజోన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తి గడ్డం మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థకు ఎంఎస్ఎంఈలే ఊతమని, దేశ సమగ్ర అభివృద్ధికి వారు నేతృత్వం వహించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పరిశ్రమలు వేగంగా మారుతున్న దశలో ఎంఎస్ఎంఈలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయని ఫిక్కీ తెలంగాణ రాష్ట్ర మండలి ఛైర్మన్ వీవీ రామరాజు అన్నారు.

గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,050 బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల పాఠశాలలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కోరారు. ఉచిత భోజన, విద్యా సదుపాయాలు ఉన్న ఈ గురుకులాల్లో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా 3వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకోవచ్చని, పిల్లలను ఇందులో చేర్పి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆయన సూచించారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ నేడు విద్యకున్న విలువ దేనికి లేదని, అది ఉంటే అన్నీ సాధించుకోవచ్చని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బీసీ ఇతర కుల సంఘాలన్నీ తమ వర్గాలకు చెందిన పిల్లలను బడికి వెళ్లే విధంగా తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు గుజ్జ సత్యం, రాష్ట్ర నాయకులు వేముల రామకృష్ణ, సి.రాజేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెట్రో పనులపై హైకోర్టు స్టే ఇవ్వలేదు: ఎండీ

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలోని మెట్రో కారిడార్ 6 పనులపై హైకోర్టు స్టే ఇవ్వలేదని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారసత్వ కట్టడాల జోలికి వెళ్లబోమని, వాటిని తాకబోమంటూ తామే కోర్టులో అండర్‌టేకింగ్ ఇచ్చామని తెలిపారు. సమగ్రమైన కౌంటర్ దాఖలు చేయడానికి హైకోర్టు మూడు వారాల సమయం ఇచ్చిందని పేర్కొన్నారు. మధ్యంతర ఉపశమనం ఏదైనా గతంలో ఇచ్చి ఉంటే.. తదుపరి విచారణ వరకు అది అమల్లో ఉంటుందని మాత్రమే హైకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొందని వివరించారు. వారసత్వ కట్టడాలను మినహాయిస్తూ మిగిలిన ప్రభావిత ఆస్తులను జాగ్రత్తగా కూల్చివేసే పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న ప్రఫుల్ రాంరెడ్డి తదితరులు

చిక్కడపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గద్దర్ అవార్డుల ప్రదాన కార్యక్రమంపై హై కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తాము స్వాగతిస్తున్నట్లు తెలంగాణ సినిమా వేదిక (టీవీసీ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, కన్వీనర్ లారా, కో కన్వీనర్ మోహన్ బైరాగి తెలిపారు. చిక్కడపల్లిలోని టీసీవీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఏమాత్రం నైతికత ఉన్నా వెంటనే అవార్డుల ప్రదానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గద్దర్ పేరిట ఇస్తున్న ఈ అవార్డులను ఆంధ్ర సినిమాలకు ఇవ్వడం వల్ల తెలంగాణ సినిమా రంగానికి రాష్ట్ర ప్రభుతమే అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. తెలంగాణ సినిమా పెద్దలు, ఆర్టిస్టులు, కవులు, కళాకారులు ఐక్యంగా ఈ అన్యాయాన్ని ఎదిరించి ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీసీవీ రాష్ట్ర నాయకులు జి. రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

విజయా డెయిరీలో ప్రమాదం

తార్నాక, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): లాలాపేట్‌లోని విజయా డెయిరీలో శుక్రవారం బాదం మిల్క్ తయారీ యూనిట్‌లో ప్రమాదం జరిగింది. బాయిలర్ పేలడంతో పలువురు కార్మికులు గాయపడ్డారు. టెక్నీషియన్ రవి బాయిలర్ మూతను ఒక్కసారిగా తీయడంతో పేలిపోయింది. తీవ్రంగా గాయపడిన రవిని డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడే ఉన్న మీరజ్, చంద్రయ్య, మరో మహిళకు స్వల్ప గాయాలు కాగా నాచారంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. రవి పరిస్థితి విషమంగా ఉందని తోటి కార్మికులు తెలిపారు.

9 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్



గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తదితరులు

ముషీరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఎక్సైజ్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన రాజేష్ (21), దినేష్‌రెడ్డి (25)లు గత కొంతకాలంగా వైజాగ్, అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి రహస్యంగా విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పార్సీగుట్ట చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో గంజాయి తరలిస్తున్న రాజేష్, దినేష్‌రెడ్డిలు పట్టుబడ్డారు. కారులో నల్లటి చారల బ్యాగులో 9 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వెంటనే వారిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను, కారును సీజ్ చేశారు.

సౌదీలో డ్రైవర్ ఉద్యోగమంటూ మోసం

వ్యవసాయం చేయిస్తూ వేధింపులు

ఆరోగ్యం క్షీణించిన నా భర్తను రప్పించండి

సీఎం ప్రజావాణిలో మహిళ వేడుకోలు



ప్రవాసీ ప్రజావాణిలో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అలేఖ్య

బేగంపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో డ్రైవర్ ఉద్యోగం అంటూ సౌదీకి తీసుకెళ్లారు.. అక్కడ వ్యవసాయ పనులు చేయిస్తూ వేధింపులకు గురిచేస్తుండడంతో తన భర్త ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని, ఇండియాకు రప్పించేలా చొరవతీసుకోవాలని అతని భార్య అలేఖ్య శుక్రవారం ప్రవాసీ ప్రజావాణిలో సీఎం రేవంత్‌రెడ్డి పేరిట వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన గుడిసె యాకూబ్ ముంబైకి చెందిన ఏజెంట్‌ను కలిశాడు. సౌదీలో ఓ ఇంట్లో డ్రైవర్ పని ఉందని నమ్మించి అతన్ని సౌదీ అరేబియాలోని దమామ్‌కు పంపించాడు. అక్కడకు వెళ్లిన యాకుబ్‌కు డ్రైవర్ పని అప్పగించకుండా అతని యజమాని వ్యవసాయ పనులు చేయిస్తూ సరైన భోజనం పెట్టకుండా, వసతి సౌకర్యం ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని అలేఖ్య అందజేసిన లేఖలో పేర్కొంది. దీంతో యాకుబ్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని ఈ విషయాన్ని ఏజెంట్‌తోపాటు తమకు తెలియజేశాడని తెలిపింది. అయితే, ఏజంట్ నుంచి స్పందన లేకపోవడంతో ప్రవాసీ ప్రజావాణి ద్వారా ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ డా. బి.ఎం.వినోద్‌కుమార్, వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డిలను కలిసి ఆమె వినతి పత్రం అందజేసింది. తన భర్తను వెంటనే తిరిగి రప్పించాలని ఈ సందర్భంగా ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.

నీటమునిగిన యశ్రబ్‌నగర్

- ఎమ్మెల్యేను నిలదీసిన ముంపు బాధితులు
- ఎంఐఎం నేతలు, స్థానికుల మధ్య వాగ్వాదం.. పరస్పర దాడి
- తడిసి ముద్దయిన బియ్యం, ఇతర వస్తువులు, దుస్తులు
- కూలి చేసుకొనెటోళ్లం.. తిండిగింజలు పాడైతే ఏం తినాలి
- బాధితుల ఆవేదన.. ● వరద నీటిలో పెళ్లి సామగ్రి



తడిసి పాడైన ఫర్నిచర్, ఇతర వస్తువులు



ఎంఐఎం నేతలు, స్థానికుల పరస్పర దాడి దృశ్యం

చార్మినార్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ మెరాజ్ హుస్సేన్‌కు చేదు అనుభవం ఎదురైంది. వరదనీటి ముంపునకు గురైన యాకుత్‌పురాలోని యశ్రబ్‌నగర్, మౌలా కా చిల్ల ప్రాంతాల సందర్శనకు వెళ్లిన ఆయనను తమ సమస్యలకు పరిష్కారమెపుడు చేస్తారంటూ స్థానికులు నిలదీశారు. 'వర్షం కురిసి వరద వచ్చిన ప్రతిసారీ ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయి.. కూలి పని చేసుకుంటూ బతికేటోళ్లం. ఆహార వస్తువులు తడిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇంకా ఎప్పుడు సమస్య పరిష్కరిస్తారు..' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ క్రమంలో ఎంఐఎం నేతలు, స్థానికుల మధ్య వాగ్వాదం జరుగగా.. పరస్పరం దాడి చేసుకున్నారు. గురువారం జరిగిన ఈ ఘటనపై అజీజ్, ఉమర్‌ఖాన్‌లు రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. యాకుత్‌పురాలోని యశ్రబ్‌నగర్, మౌలా కా చిల్ల ప్రాంతాలు బుధవారం రాత్రి కురిసిన వర్షానికి నీట మునిగాయి. ఆయా ప్రాంతాల్లో గురువారం స్థానిక ఎమ్మెల్యే జాఫర్ పర్యటించిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

వరద నీటిలో పెళ్లి సామగ్రి

యశ్రబ్‌నగర్‌కు చెందిన ముజాహిద్ స్క్రాప్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన కుమార్తె పెళ్లి ఉండడంతో బియ్యం, నూనె, గృహాలంకరణ వస్తువులు, ఇతరత్రా నిత్యావసరాలతోపాటు దుస్తులు, ఫర్నిచర్ కొనుగోలు చేసి ఇంట్లో ఉంచాడు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నల్లవాగు పొంగడంతో బస్తీలో ఐదు అడుగుల మేర నీరు నిలిచింది. వరదతోపాటు బురద కొట్టుకురావడంతో వస్తువులన్నీ తడిసిపోయాయి. పట్టు చీరలు, ఫర్నిచర్, బియ్యం, మసాలాలు, నిత్యావసర సామగ్రి పాడైపోయింది. దీంతో ముజాహిద్ కుటుంబం కన్నీరుమున్నీరైంది.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SME దిల్‌సుఖ్‌నగర్ శాఖ
ప్లాట్ నం.54, 55 & 56, వైష్ణవి సిగ్నేచర్, PVT మార్కెట్ ప్రక్కన, కొత్తపేట, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500035

స్వాధీనతా ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) క్రింద (స్థిరాస్తి కోసం)

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME దిల్‌సుఖ్‌నగర్ శాఖ అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, రుణగ్రహీత మరియు హామీదారులు: నం.1) M/s BPSC ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహించు డైరెక్టర్లు: శ్రీ బొమ్మ పునీత్ & శ్రీ కృష్ణచైతన్య బొమ్మ, ఇ.నం.5-4-143, ప్లాట్ నం.23, కమలానగర్, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070; 2) శ్రీ బొమ్మ పునీత్ తండ్రి బొమ్మ లక్ష్మయ్య, ఇ.నం.5-4-143, ప్లాట్ నం.23, కమలానగర్, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070; 3) శ్రీ కృష్ణచైతన్య బొమ్మ తండ్రి బొమ్మ లక్ష్మయ్య, ఇ.నం.5-4-143, ప్లాట్ నం.23, కమలానగర్, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070; 4) శ్రీ బొమ్మ లక్ష్మయ్య తండ్రి దానయ్య బొమ్మ, ఇ.నం.5-4-143, ప్లాట్ నం.23, కమలానగర్, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070; 5) శ్రీమతి బొమ్మ అరుణ భర్త బొమ్మ లక్ష్మయ్య, ఇ.నం.5-4-143, ప్లాట్ నం.23, కమలానగర్, వనస్థలిపురం, హైదరాబాద్ - 500070; సిసి ఖాతా నంబర్లు: 33869833860/ 34529044638 వారికి 02.04.2025 తేదీగల డిమాండ్ ప్రకటన జారీచేసి, సదరు ప్రకటనలో తెలిపిన మొత్తం 01.04.2025 నాటికి రూ.2,21,38,888/- (రూపాయలు రెండు కోట్ల ఇరవైఒక్క లక్షల ముప్పై ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది మాత్రమే) మరియు 02.04.2025 నుండి దానిపై కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలను సదరు ప్రకటన స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరారు.
సదరు పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు- హామీదారులు విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, దిగువ ఇందులో వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు 12 జూన్ 2025న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు/ హామీదారులకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీతను/ హామీదారులను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా 01.04.2025 నాటికి మొత్తం రూ.2,21,38,888/- (రూపాయలు రెండు కోట్ల ఇరవైఒక్క లక్షల ముప్పై ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది మాత్రమే) మరియు 02.04.2025 నుండి కాంట్రాక్చువల్ రేటు వంతున భవిష్య వడ్డీ మరియు దానిపై వ్యయాలు, మొ.వి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME దిల్‌సుఖ్‌నగర్ శాఖకు చెల్లించుటకు లోబడి ఉంటాయి.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు రుణగ్రహీత/ హామీదారులకు ఉండే సమయానికి సంబంధించి SARFAESI చట్టంలోని సెక్షన్ 13లోని సబ్‌సెక్షన్ (8)లోని ప్రొవిజన్లను గమనించవలసిందిగా మేము మిమ్మల్ని కోరుచున్నాము.
తనఖాపెట్టబడిన స్థిరాస్తి వివరణ: సేల్‌డీడ్ నం.8281/1991 తేది 14.08.1991: 1) శ్రీ బొమ్మ లక్ష్మయ్యకు చెందిన, ఎస్ఆర్ఓ, హైదరాబాద్ ఈస్ట్ వద్ద నమోదైన రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం.8281/1991 తేది 14.08.1991 ప్రకారం జీ.పి.పి. హైదరాబాద్ ఈస్ట్ రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్ & ఎమ్.పి.పి, రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ రెవెన్యూ మండలం, ఎల్.బి.నగర్ మునిసిపాలిటీ, సాహెబ్‌నగర్ కలాన్ గ్రామంలోని సర్వే నం.9 వద్దగల 193.23 చ.మీటర్లకు సమానమైన 231.11 చ.గజాల విస్తీర్ణం గల ప్లాట్ నం.23 కలిగిన నివాసం భూమి మరియు భవనం మరియు **సరిహద్దులు:** ఉత్తరం: 30 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: 20 అడుగుల వెడల్పు రోడ్డు, తూర్పు: ప్లాట్ నం.21, పశ్చిమం: ప్లాట్ నం.25
సేల్‌డీడ్ నం.4818/1999 తేది 29.12.1999: 2) శ్రీమతి బొమ్మ అరుణకు చెందిన, ఎస్ఆర్ఓ, సరూర్‌నగర్ వద్ద నమోదైన రిజిస్టర్డ్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం.4818/1999 తేది 29.12.1999 ప్రకారం సరూర్‌నగర్ రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్ పరిధిలోని రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ రెవెన్యూ మండలం, ఎల్.బి.నగర్ మునిసిపాలిటీ, సాహెబ్‌నగర్ ఖుర్ద్ గ్రామంలోని మల్లికార్జున నగర్ కాలనీ వద్దగల బ్లాక్ నం.5, వార్డు నం.5, సర్వే నం.11/ఏ భాగంలోని 268 చ.గజాలు లేదా 224.07 చ.మీటర్ల విస్తీర్ణం గల ప్లాట్ నం.73 కలిగిన నివాసం భూమి మరియు భవనం మరియు **సరిహద్దులు:** ఉత్తరం: పొరుగువారు, దక్షిణం: ప్లాట్ నం.74, తూర్పు: ప్లాట్ నం.72, పశ్చిమం: 30 అడుగుల వెడల్పు రోడ్డు.

తేది: 12.06.2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SME దిల్‌సుఖ్‌నగర్ శాఖ)

ఆంధ్రజ్యోతి Daily CLASSIFIEDS

అమ్మబడును

★ నెల్లూరు జిల్లా, రామాయపట్నం పోర్టు దగ్గరలోని పొలాలు కందుకూరు పట్టణంలో ప్లాట్లు, ఇళ్లు, అపార్ట్‌మెంట్స్, నూతన బైపాస్ ప్రక్కన పొలాలు అమ్మబడును. సంప్ర: 70321 78599 AJO-232931

PLOT FOR SALE

★ VJA, మంగళగిరి, బందరు రోడ్డు, మచిలీపట్నం పోర్టు, బెంజిసర్కిల్‌కి 6 కిమీ, గన్నవరం ఎయిర్‌పోర్టు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల ప్రక్కన, కంచికచర్ల చ.గ.2900/- నుండి 13,900/- ఇళ్ళ ప్లాట్స్. 20 సెంట్ల ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ రూ.1,35,000/- సంప్ర:93985 76997 AJB-43

★ Bhongir Town, Suprabhat Heights, HMDA Layout 1st Phase. 267 yds. E/F. 20000 per Sq.Yd. Negotiable. Ph: 9347303007, 9000987474 AJH-15158

★ Narayankhed open plots 121 sq.yds 2 Lacs Only. sizes 242, 363,484,605 Red Sandal wood Plantation. 12 yrs. Maintenance Free High returns. Ph.: 7207936669 AJH-1529

LOST

★ I, Zakia Anwer W/o Anwer Hussain R/o: 8-3-624-626, Imam guda, Yellareddyguda, Ameerpet, Hyd. Has lost my Original plot Document no: 1465 While travelling Saradhi Studio, Ameerpet to Yousufguda. If anyone Found Pls. Cont. 9848323404 AJH-003307

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ADVT

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
99859 21380, 99859 21386
97036 18806

మళ్లీ ప్రణీత్‌రావును ప్రశ్నించిన సిట్

» ప్రభాకర్‌రావు చెబితేనే డేటాను ధ్వంసం చేసినట్లు గతంలో వాంగ్మూలం

» నేడు ప్రభాకర్‌రావు విచారణ

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును సిట్ అధికారులు మరోసారి విచారించారు. ఈ కేసులో అరెస్టయి, బెయిల్ మీదున్న ఆయన్ను శుక్రవారం సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఇదే కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు శనివారం విచారణకు హాజరవుతున్న క్రమంలో ప్రణీత్‌రావును మరోసారి ప్రశ్నించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రణీత్‌రావు కీలకపాత్ర పోషించినట్లు ఇప్పటికే సిట్ అధికారులు చార్జిషీటులో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్‌గా ఎస్ఐబీలోకి ప్రవేశించిన ప్రణీత్‌రావు ఆ తర్వాత యాక్సిలరేటరీ పదోన్నతి పొంది డీఎస్పీ అయ్యారు. ప్రణీత్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఫోన్ ట్యాపింగ్‌లో కీలకపాత్ర పోషించింది. ఎస్ఐబీలో ప్రణీత్‌రావు బృందానికి ప్రత్యేకంగా రెండు గదులున్నాయని.. వాటిలో అధునాతన కంప్యూటర్లు, ట్యాపింగ్ పరికరాలు, హైస్పీడ్ ఇంటర్నెట్ ఏర్పాటు చేశారని సమాచారం. ఇదే సెటప్‌ను తర్వాత మీడియా బాస్ శ్రవణ్‌రావు ఇంట్లోనూ ప్రణీత్‌రావు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే 2023 డిసెంబరు 4న రాత్రి ప్రణీత్‌రావు ఎస్ఐబీ ఆఫీసులోకి వెళ్లి ఫోన్ ట్యాపింగ్ డేటాను ధ్వంసం చేశారు. దాదాపు రెండు టీబీల డేటాను నాశనం చేయడమేగాక 42 హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి, తీసుకెళ్లి మూసీలో పడేసినట్లు ప్రణీత్‌రావు గత విచారణలో అంగీకరించారు. ప్రభాకర్‌రావు చెబితేనే డేటాను ధ్వంసం చేశానని వాంగ్మూలం ఇచ్చారు. అయితే ఈ వాంగ్మూలాన్ని ప్రభాకర్‌రావు వ్యతిరేకిస్తున్న క్రమంలో డేటా విధ్వంసం జరిగితే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రకారం ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే విషయాలపై ప్రభాకర్‌రావును ఇటీవల సిట్ అధికారులు ప్రశ్నించారు. ఎవరి ఆదేశాలతో రాజకీయ నాయకుల ఫోన్లను ట్యాప్ చేశారనే కోణంలో ప్రణీత్‌రావు చెప్పే విషయాలను బట్టి ప్రభాకర్‌రావును విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌పై ప్రభాకర్‌రావు పెదవి విప్పుతారా? లేదా? అన్నది పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. ప్రభాకర్‌రావును సాంకేతిక ఆధారాలతో ప్రశ్నించాలని సిట్ అధికారులు ప్రయత్నిస్తున్న క్రమంలో తదుపరి విచారణపై రాజకీయవర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది.

స్టాంప్ డ్యూటీ తగ్గిద్దాం

(మొదటి పేజీ తరువాయి)



తెలిసింది. పెట్టుబడులను ఆకర్షించేందుకు అన్ని రాష్ట్రాల్లో ఒకే తరహా స్టాంప్ డ్యూటీ ఉండాలన్న కేంద్రం సూచనలను పరిగణనలోకి తీసుకుని కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజును యధాతథంగా ఉంచి.. స్టాంప్ డ్యూటీని 4శాతానికి తగ్గిస్తే ఆర్థికంగా తలెత్తే నష్టాన్ని అంచనా వేస్తూ పూర్తి వివరాలు నివేదించినట్లు తెలిసింది. ఇదే సమయంలో భూముల విలువలను సవరించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో ప్రాంతాల వారీగా జరుగుతున్న లావాదేవీలను బట్టి.. ఎక్కడ పెంచాలి.. ఎక్కడ తగ్గించాలి.. అనే కోణంలో ప్రతిపాదనలు అందజేశారని సమాచారం.

రాష్ట్రాల వారీగా స్టాంప్ డ్యూటీ ఇలా

పొరుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్ డ్యూటీ కింద ఎంత శాతం వసూలు చేస్తున్నారనే గణాంకాలను సైతం అధికారులు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. తెలంగాణలో స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కలిపి 7.5శాతం ఉండగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో స్టాంప్ డ్యూటీ 5శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 2 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5శాతం కలిపి మొత్తం 7.5శాతంగా ఉన్నట్లు తెలిపింది. తమిళనాడులో అత్యధికంగా ట్రాన్స్‌ఫర్ డ్యూటీ తీసుకోకుండా.. స్టాంప్ డ్యూటీ 7శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 4శాతం కలిపి 11శాతం తీసుకుంటున్నట్లు పేర్కొంది. కేరళలో స్టాంప్ డ్యూటీ 8శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 2శాతం కలిపి 10శాతం, మహారాష్ట్రలో స్టాంప్ డ్యూటీ 6శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 1శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 1% కలిపి 8% వసూలు చేస్తున్నట్లు ప్రస్తావించింది. కర్ణాటకలో స్టాంప్ డ్యూటీ 5శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.6శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 1 శాతం కలిపి 6.6శాతం వసూలు చేస్తున్నట్లు వెల్లడించింది.

విలువల పెంపుపై ప్రతిపాదనలు

రాష్ట్రంలో 2021లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారి 20 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2022లో మరోసారి 33 శాతం పెంచింది. ఆ తరువాత భూముల విలువ పెంచలేదు. 2025-26లో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయ లక్ష్యం రూ.19వేల కోట్లుగా నిర్ణయించిన నేపథ్యంలో భూముల విలువల పెంపు తప్పదని ప్రభుత్వం సైతం భావిస్తోంది. నిజానికి ప్లాట్లు, ఫ్లాట్ల వాస్తవ విలువలకు, రిజిస్ట్రేషన్ల శాఖ పుస్తక విలువలకు చాలా చోట్ల పొంతన లేదు. దీన్ని సవరించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. భూముల విలువల పెంపునకు సంబంధించి ఓ ప్రైవేట్ ఏజెన్సీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే ప్రాంతాల్లో ఎంత మేర పెంచాలి? అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్ల విషయంలో ఇప్పుడున్న విలువలను ఎంత శాతం పెంచాలి? అనే దానిపై రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తు చేసింది. అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్ల విషయంలో ఇప్పుడున్న విలువలను వంద నుంచి మూడొందల శాతం వరకు పెంచాలని తాజాగా సర్కార్‌కు నివేదించినట్లు సమాచారం. ప్రస్తుతం నగరాల్లో ఫ్లాట్ల చదరపు అడుగు ధర రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువ ప్రకారం సగటున రూ.3000ఉన్న చోట వంద శాతం, చదరపు అడుగు రూ.1800 ఉన్న ప్రాంతాల్లో దాన్ని 300శాతం చొప్పున ప్రతిపాదించినట్లు తెలిసింది. కొండాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు గజం ధర రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువ ప్రకారం రూ.26,700గా ఉంది. ఇదే వాణిజ్య స్థలమైతే గజం రూ.44,900గా ఉంది. అలాగే, నార్సింగ్‌లో రూ.23,800, మణికొండలో రూ.23,900, రాయదుర్గంలో రూ.44,900, బుద్వేల్‌లో రూ.10,200చొప్పున పుస్తక విలువ ఉంది. వీటిని వంద శాతం పెంచితే ఎలా ఉంటుందనే కోణంలో ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలిసింది. శేర్‌లింగంపల్లి పరిధిలో గజం ధర పుస్తక విలువ ప్రకారం రూ.26,700 ఉండగా.. రూ.50-60వేలకు పెంచాలని, మోకిలలో రూ.2,300గా ఉన్న విలువను రూ.6వేలకు పెంచేలా ప్రతిపాదించినట్లు సమాచారం.

ఈసీ ఉచితంగా ఇస్తే ఎలా ఉంటుంది?

ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉంది. ఏటా ఈసీ చలానాల ద్వారా రూ.20 కోట్లకు మించి ఆదాయం రావడం లేదు. ఈ మొత్తాన్ని వదులుకుని.. ప్రజలకు ఉచితంగానే ఈసీ ఇస్తే ఎలా ఉంటుందన్న అంశాన్నీ రిజిస్ట్రేషన్ల శాఖ ప్రభుత్వం ముందు ఉంచినట్లు తెలిసింది. దీని వల్ల ప్రజల్లో సానుకూల స్పందన వస్తుందని, ప్రభుత్వానికి పెద్దగా నష్టమూ జరగబోదని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ల శాఖ సమర్పించిన ప్రతిపాదనలపై త్వరలోనే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

గులాబీ కార్యకర్తలకూ ఇల్లు ఇస్తాం

» పేదోడైతే చాలు మంజూరు చేస్తాం: పొంగులేటి

» సన్నబియ్యం రూపంలో ప్రతి కుటుంబానికి నెలకు రూ.2 వేల వరకు ఆదా: శ్రీధర్‌బాబు



లబ్ధిదారుకు డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు పత్రాన్ని ఇస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): "ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేటప్పుడు, ఏ కులం, ఏ మతం అని చూడలేదు. పేదోడైతే చాలనుకున్నాం. చివరకు గులాబీ తొడుక్కున్న వాళ్లకు కూడా ఇళ్లు ఇస్తాం" అని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరతామని స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పెద్దపల్లి జిల్లాలో ఎలిగేడు, పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు శుక్రవారం ఆయన ప్రారంభించారు. పెద్దపల్లిలో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న సమీకృత కూరగాయల మార్కెట్‌కు శంకుస్థాపన చేసి చందపల్లి, రాంపెల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూముల ఇళ్లను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడారు. కల్లబొల్లి మాటలు చెప్పి, ప్రజలను మోసం చేసి పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ.. ప్రజలకు వెలగ బెట్టిందేమి లేదని పొంగులేటి విమర్శించారు. పేదలకు ఇళ్లు ఇవ్వలేని దద్దమ్మ తన కోసం రాజభవనం నిర్మించుకున్నాడని విమర్శించారు. పేద వాడి కలను కలగానే మిగిల్చారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు అండగా ఉండేందుకు ఈ ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను చేపట్టాలని నిర్ణయించామని, ఇందుకు 22,500 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. తల తాకట్టు పెట్టయినా రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లు మంజూరు చేసి తీరతామని అన్నారు. మరో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించిందని, వీటి విలువ రూ. 175 కోట్లు అని చెప్పారు. ఎన్నికల సందర్భంగా సన్న బియ్యం ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. ప్రతి నెలా ఒక్కో కుటుంబానికి సన్న బియ్యం రూపంలో రూ.2 వేల వరకు ఆదా చేస్తున్నామన్నారు.

దక్షిణాదిన ఎంపీ సీట్లను తగ్గిస్తే.. కేంద్రంపై తిరుగుబాటు: చంద్రకుమార్

» హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా ప్రకటించి.. సుప్రీం బెంచిని ఏర్పాటు చేయాలి: గాలి వినోద్

బర్కత్‌పుర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : త్వరలో చేపట్టనున్న పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జనాభా ప్రాతిపదికన చేస్తే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సుప్రీంకోర్టు న్యాయవాది, జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా మూమెంట్ వ్యవస్థాపకులు డాక్టర్ కరణం రాజేష్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం దక్షిణాది రాష్ట్రాల సమ్మేళనం నిర్వహించారు. ఐదు రాష్ట్రాలకు చెందిన పలు పార్టీల నేతలు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఇందులో జస్టిస్ బి. చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఎంపీ సీట్లను తగ్గిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు కేంద్రంపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. దక్షిణ భారత పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ప్రకటించి సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

డబ్బు కోసం మేనత్తను చంపిన కిరాతకుడు

వరంగల్ క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం మేనత్తను హత్యచేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.18 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు రూ.10 వేలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వరంగల్ సీపీ కార్యాలయంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. వరంగల్ మట్టెవాడకు చెందిన రేకులపల్లి ప్రణయ్ ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. జల్సాలకు అలవాటు పడి పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. గీసుగొండ, మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు చోరీలు కూడా చేశాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మేనత్త బంగారంపై కన్నేశాడు. ఈ క్రమంలోనే గీసుగొండ మండలంలోని స్తంభంపల్లిలో ఒంటరిగా ఉంటున్న మేనత్త స్వరూప ఇంటికి వచ్చాడు. హత్య జరిగిన రోజు సాయంత్రం మేనత్తతో కలిసి మద్యం తాగి అక్కడే పడుకున్నాడు. ఆమె నిద్రలోకి జారుకున్నాక డంబెల్‌తో తలపై మోదడంతో స్వరూప మరణించింది. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలతో పాటు ఇంట్లో ఉన్న వెండి, నగదును తీసుకుని పారిపోయాడు.

విజిలెన్స్ చర్యలు అభ్యంతరకరం

స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ మార్గదర్శకాలను కఠినతరం చేయాల్సిందే.. ఎస్ఎల్ఎస్‌సీలో నిర్ణయం

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల ప్రాజెక్టుల పనుల అంచనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే సవరణ అంచనాలకు ఆమోదం తెలిపారని, ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్(ఈవోటీ) ఇచ్చారని, ఒక ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుండగా మధ్యలోనే అదనంగా ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలిపారనే కారణాలతో స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ(ఎస్ఎస్ఎల్‌సీ) సభ్యులను బాధ్యులుగా చేసి విచారణకు పిలవడం, క్రిమినల్ కేసులు పెట్టాలని విజిలెన్స్ కమిషన్ సిఫారసు చేయడాన్ని ఎస్ఎల్ఎస్‌సీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం జలసౌధలో ఈఎన్‌సీ(జనరల్) చైర్మన్‌గా ఎస్ఎల్ఎస్‌సీ సమావేశం జరిగింది. ఈ భేటీలో విజిలెన్స్ సిఫారసులను ఎస్ఎల్ఎస్‌సీ సభ్యులు తప్పుపట్టారు. ఇక ముందు విజిలెన్స్ నుంచి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే ఎస్ఎల్ఎస్‌సీ మార్గదర్శకాలను మరింత కఠినతరం చేయాలని అభిప్రాయపడ్డారు. దీని కోసం ప్రభుత్వం సవరణ మార్గదర్శకాలను జారీ చేయాలని చర్చించారు. తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వ్యవహారంలో ఎస్ఎల్ఎస్‌సీ తీరును విజిలెన్స్ తప్పుబట్టింది. అంతేకాకుండా మార్గదర్శకాలు సరిగా లేవని పేర్కొంది. ఎస్ఎల్ఎస్‌సీలో సభ్యులుగా ఉన్నవారిపై నేర విచారణకు సిఫారసు చేసింది. దీనికితోడు తాజాగా కొండపోచమ్మసాగర్‌తో పాటు కాళేశ్వరం అదనపు టీఎంసీపై కూడా విచారణకు హాజరు కావాలని ఎస్ఎల్ఎస్‌సీ సభ్యులకు విజిలెన్స్ తాఖీదులు పంపడంతో నీటి పారుదల శాఖ అధికారులు భగ్గుమంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇద్దరు ఈఎన్‌సీ, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్, డైరెక్టర్ వర్క్ అండ్ అకౌంట్స్‌తో పాటు సంబంధిత ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్లను తప్పుబడుతూ ఇటీవలే విజిలెన్స్ నివేదిక ఇచ్చిన విషయం విదితమే.

త్వరలో కొత్త విత్తన చట్టం: కోదండరెడ్డి

గద్వాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విత్తన ఎంపిక, సాగులో రైతులకు కలుగుతున్న ఇబ్బందులను గుర్తించిన కాంగ్రెస్ సర్కారు.. త్వరలో కొత్త విత్తన చట్టాన్ని తేబోతోందని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. ఇందులో అన్ని పక్షాలకు న్యాయం జరుగుతుందన్నారు. శుక్రవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పత్తి విత్తన కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. పత్తి విత్తన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే విత్తన చట్టాలు ఉన్నాయని, అయితే వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పారు. 8 నెలలుగా అనేక అంశాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని అందరికీ న్యాయం చేసేలా కొత్త చట్టాన్ని తేబోతున్నట్లు వివరించారు. అతి త్వరలోనే ఈ కొత్త చట్టం సభలో ఆమోదం పొంది రైతుల ముందుకు వస్తుందన్నారు. సమావేశంలో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, రైతు కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

మీకేమైనా ముప్పు ఉందా?

» వివేకా కుమార్తెను అడిగిన సీబీఐ కోర్టు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'భద్రత పరంగా మీకేమైనా ముప్పు ఉందా'? అని సీబీఐ కోర్టు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డిని అడిగింది. వివేకా హత్య కేసు శుక్రవారం మరోసారి సీబీఐ కోర్టు ఎదుట విచారణకు వచ్చింది. సాక్షుల భద్రత పథకం కింద సునీతారెడ్డికి రక్షణ కల్పించాలని కోరుతూ సీబీఐ దరఖాస్తు దాఖలు చేసింది. ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన వివేకా కుమార్తె సునీతారెడ్డిని మీ భద్రతకు ఏమైనా ముప్పు ఉన్నట్లు భావిస్తున్నారా? అంటూ జడ్జి టీ రఘురాం ఆరా తీశారు. దీనికి సునీతారెడ్డి సమాధానం ఇస్తూ.. భద్రతకు ముప్పు ఉందని తెలిపారు.

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (GHMC)

NIT No. టెండరు ప్రకటన నం. 05/SE(P-WZ)/GHMC/2025-26 (3వ పిలుపు) తేది: 13.06.2025

పని పేరు: 1) GHMC, జూబ్లీహిల్స్ సర్కిల్-18లో ఎరిండి హాస్పిటల్ జంక్షన్ నుండి ... చెక్‌పోస్ట్ జంక్షన్ వరకు 100 అ.లు/120 అ.లు RDP వరకు రోడ్డు వెడల్పు చేయబడిన ... రోడ్డు నిర్మాణం. అంచనా మొత్తం: రూ.150.00 కోట్లు. 2) IIIT జంక్షన్ వద్ద ...

DIPR RO No.3581-PP/CL/ADVT/1/2025-26 తేది:13.06.2025

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (GHMC)

EOI సహిత బిడ్ ప్రకటన

EOI నోటిఫికేషన్ No.01/EE/Cir-03/GHMC/2025-26/89 తేది:12.06.2025

DIPR RO No.3532-PP/CL/ADVT/1/2025-26, తేది:13.06.2025

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ - తెలంగాణ

కమిషనర్ హైడ్రా

టెండరు ప్రకటన

టెండరు ప్రకటన నం.07/COMM/HYDRAA/2025-26 తేది:13.06.2025

www.eprocurement.telangana.gov.in

DIPR RO No.3598-PP/CL/ADVT/1/2025-26, Dt.13.06.2025

తెలంగాణ ప్రభుత్వం

ఆర్థిక శాఖ

35 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) 2060 వేలం

మొత్తం	: రూ.1000.00 కోట్లు
జారీ ధర	: ప్రతీ రూ. 10,000.00 లకు రూ. 10,000.00
కాలవ్యవధి	: 35 సంవత్సరాలు
రుణ దరఖాస్తు స్వీకరణ వ్యవధి	: సదరు మొత్తం అందిన వెంటనే నోటీసు లేకుండా 17.06.2025వ ...

DIPR RO No.36-DP/CL/ADVT/1/2025-26, Dt.13.06.2025

ICAR - నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్

(ISO 9001: 2015 సర్టిఫైడ్)

రాజేంద్రనగర్, హైదరాబాద్-500030, తెలంగాణ, ఇండియా.

https://naarm.org.in, ఫోన్ నం.040-24581382/406

F.No.2-523/25-A.I జూన్ 13, 2025

ఉద్యోగ ప్రకటన

https://naarm.org.in ను 14.06.2025న లేదా ఆ తర్వాత దర్శించగలరు.

డైరెక్టర్

NUTRIHUB TECHNOLOGY BUSINESS INCUBATOR STARTUPS CONFEDERATION

ICAR - Indian Institute of Millets Research (IIMR)

Global Centre of Excellence on Millets (Shree Anna)

Rajendranagar, Hyderabad-500030.

www.nutrihubiimr.com

WALK-IN-INTERVIEW

Director/CEO, Nutrihub TBISC, ICAR-IIMR invites eligible candidates for walk-in-interview on 1st July, 2025 (Tuesday) as per the given date for engagement of the following position to work on contractual basis.

Sl.	Name of the Post	No. of Positions	Project
1	Business Executive	1	RKVY-RAFTAAR

The detailed notification, qualifications, experience, remuneration etc. can be obtained from our website: https://www.nutrihubiimr.com/careers.

Dr. J Stanley
Director / CEO, Nutrihub TBISC

The Singareni Collieries Company Limited
(A Government Company)
Regd. Office: Kothagudem— 507101, Telangana.

E-PROCUREMENT TENDER NOTICE

Tenders have been published for the following Services / Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in - or - https://scclmines.com

NIT/Enquiry No. - Description / Subject - Last date and time for Submission of bid(s).

E08250O067 – Procurement of Coal and Stone drill bits and drill rods for roof bolters on rate contract for 2 years – 26.06.2025 – 17:00 Hrs.

E03250O076 – Procurement of portable X-ray machine with 3 years warranty and 5 years CMC for use at SCCL Hospitals – 27.06.2025 – 17:00 Hrs.

E16250O074 – Operation and Maintenance Contract for JVR CHP Sathupalli, KGM Area for a period of 1 year – 27.06.2025 – 17:00 Hrs.

E14250O046 – Transportation of Coal from Kistaram OC and JVR OC-II to RCHP, Kothagudem Area on weight basis for a period of 2 years – 30.06.2025 – 15:00 Hrs.

E05250O063 – Procurement of Metal cutting Band saw Blades for use at Main Workshop for cutting of HFIW MS pipe for manufacture of various sizes belt conveyor rollers – 30.06.2025 – 17:00 Hrs.

E02250O061 – Procurement of PRECO make Proximity Warning Devices Kits for 100T, 60T Dumpers and Water Sprinklers and its spares under Rate Contract for a period of two years – 30.06.2025 – 17:00 Hrs.

E05250O079 – Procurement of spares for RD-100 model Drills pertaining to Exploration Division on Rate Contract basis for a period of 2 years – 30.06.2025 – 17:00 Hrs.

E17250O083 – Procurement of Cartridges for HP501DN, 226 DN/1007 Printers through Rate contract basis for a period of 2 years – 01.07.2025 – 17:00 Hrs.

Inviting Interest Rates-800 MW (604068) – Request for expression of interest for debt financing of Rs. 7,200 Crore for Setting up of 1 x 800 MW super critical unit (Stage-II) at Pegadapalli Village, Jaipur Mandal, Mancherial District – 07.07.2025 – 17:00 Hrs. GM (MP)

NIT/Enquiry No. - Description / Subject / Estimated Contract Value - Last date and time.

CW/RD/e-32/2025-26 – Providing training gallery, parking shed and Misc., Civil works to existing CTC/MVTC building at 3 incline Kothagudem area, Bhadradri Kothagudem District, Telangana State ("Invited under earmarked work – SCCL Registered contractors belong to Waddera/Sagara/Uppara community only are eligible to participate") – Rs. 32,21,089/- – 25.06.2025 – 04.30 PM. GM KGM

BHP/CVL/ET-15/2263/25-26, Dt.06.06.2025 – Providing external coloring works to MD type quarters from Block No. 1 to 18 (252 quarters) in phase-I at Subash colony,Bhupalpalli Area – Rs. 40,90,886/- – 21.06.2025 – 04.30 PM. DGM (Civil), BHPL

PR/2025/ADVT/MP/KGM/ BHPL/57

DIPR R.O.No.3584-PP/CL/ADVT/1/2025-26, Dt.:13-06-2025

TELANGANA POWER GENERATION CORPORATION LIMITED VIDYUT SOUDHA :: HYDERABAD - 82.

T.No.e-13/CEG/SEG-II/E2A5/KTPS-V&VI/TGGENCO/2025-26

KTPS-V&VI Stage - Procurement of Spares for ELGI make (model: NH-210 & NH-265) oil free Screw type Transport Air Compressors required for Unit-XI at Kothagudem Thermal Power Station Stage-VI, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works: Rs.1,23,00,000/-. Scheduled Open & Closing Date: 09.06.2025 at 18:00 Hrs & 08.07.2025 at 10:30 Hrs.

T.No.e-110/CE/O&M/KTPS-V&VI/EM&MRT-V/P42/TGGENCO/2025-26

KTPS-V&VI - Procurement of Spares and Retrofitting of VFD controller system in place of NCL controller system for OTIS make UNIT-IX boiler lift required for EM&MRT-V stage at Kothagudem Thermal Power Station Stages-V&VI Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works Rs.38,00,000/- Scheduled Open & Closing Date: 18.06.2025 at 19:00 Hrs. & 09.07.2025 at 15:30 Hrs.

T.No.e-03/CE/(HPC&HP)/SE(PI)/TGGENCO/2025-26

NSHES Procurement and installation of a new microprocessor-based electronic governor in place of the existing ASEA make turbine governor and runner blade controller (HPC600), including its Design, Manufacture, Supply Inspection & testing at manufacturers works before dispatch, Delivery along with mandatory spares, Erection, Cabling, Termination, Testing & Commissioning and its integration with the existing Mechanical Electro-Hydraulic Control Unit(E40M) duly disassembling of existing complete EHGC Governor Control panel (i.e. Electronic Panel only) in the control room, along with its old cables for Unit-2 at NSLC Power House, Nagarjunasagar, Nalgonda Dist. - Value of the works: Rs.83,85,000/- Scheduled Open & Closing Date: 16.06.2025 at 17:00 Hrs. & 14.07.2025 at 16:00 Hrs.

T.No.e-01/CE/TPC/SE-III/EME-5/YTPS/TGGENCO/2025-26

YTPS- Electrification works of Township - Providing consultancy services for study and design the power distribution scheme, preparation of drawings for extension of permanent power supply to the proposed YTPS town ship from YTPS CHP 11KV Boards, arranging of street lighting system and providing Diesel Generator sets for extending alternate power supply at various locations in YTPS colony town ship including residential and non- residential complexes and preparation of detailed estimate, tender specification to fix up an agency an tendering basis. Vetting of Vendor Drawings/ Documents during the execution of the subject work at Yadadri Thermal Power Station, Veerlapalem (V), Dameracherla (Mdl), Nalagonda Dist. Value of the works: Rs.39,00,000/- Schedule Extended upto: 19.06.2025 at 15:00 Hrs

T.No.e-201/CE/O&M/KTPP/CAM-I/TGGENCO/2025-26

KTPP Procurement of Spares for SAM Turbo make HP, Ash Slurry, Refractory, Overflow Sump Pumps and Refractory cooling water pump in Ash Handling plant at Kakatiya Thermal Power Project, Chelpur (V), Jayashankar Bhoopalapally Dist. Value of the works Rs.19,16,214/- Scheduled Open & Closing Date: 06.06.2025 at 10:30 Hrs & 18.06.2025 at 10:30 Hrs

T.No.e-88/CE/O&M/KTPS-VII/P12/I&C/TGGENCO/2025-26

KTPS-VII Stage - Enquiry for Supply of Pressure and differential pressure transmitters at Kothagudem Thermal Power Station Stage-VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works: Rs.29,19,080/- Scheduled Open & Closing Date: 06.06.2025 at 18:30 Hrs & 01.07.2025 at 15:30 Hrs

T.No.e-87/CE/O&M/KTPS-VII/P11/BM/TGGENCO/2025-26

KTPS-VII Stage - Enquiry for Supply of Spares for sky man OCTO 800 Hoist at Kothagudem Thermal Power Station Stage-VII, Paloncha, Bhadradri Kothagudem Dist. Value of the works: Rs.15,83,620/- Scheduled Open & Closing Date: 06.06.2025 at 18:00 Hrs & 05.07.2025 at 15:30 Hrs

DIPR RO No.3586-PP/CL/ADVT/1/2025-26,Dt.13.06.2025

SAINIK SCHOOL KALIKIRI, ANNAMAYYA DIST (AP)
(Under the aegis of Sainik Schools Society, Ministry of Defence)
Advt No. SSKAL/1010/RECT/2025-03, dated 21 Jun 2025

TGT (ENGLISH) ON CONTRACTUAL BASIS

Sainik School Kalikiri invites applications from eligible candidates for the following vacancies purely on temporary contractual basis (period not exceeding one year).

S.No	Post	No. of Vacancies	Age Limit	Pay Scale
1.	TGT (English)	One Vacancy Contractual (Reserved for OBC-NCL)	21-35 years as on 11 Jul 2025	Consolidated Pay Rs. 58,819/-

Interested candidates may apply to the Principal, Sainik School Kalikiri, Annamayya District, Andhra Pradesh, PIN - 517234 within 21 days from the date of publication of the advertisement. Eligible and shortlisted candidates will be called for the selection process on a date to be intimated later. No TA/DA is admissible to candidates called for Test/Interview. **The School administration reserves the right to cancel the vacancy due to administrative reasons.**

For application form and further details visit School website https://sskal.ac.in/careers.

Sd/-PRINCIPAL

ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు


ఇజ్రాయెల్ దాడిలో దెబ్బతిన్న ఇరాన్‌లోని ఓ భవనం


రక్షణ షెల్టర్లలో ఇజ్రాయెల్ ప్రజలు

(మొదటి పేజీ తరువాయి)

అణు శాస్త్రవేత్తలు, ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు మరణించారు. 'ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్' ఎయిర్‌ఫోర్స్ విభాగానికి చెందిన అగ్రనాయకత్వం సమావేశమైన ఒక అండర్ గ్రౌండ్ కమాండ్ సెంటర్‌పై తమ యుద్ధవిమానాలు చేసిన దాడిలో పలువురు అధికారులు చనిపోయినట్టు ఇజ్రాయెల్ రక్షణ శాఖ అధికారులు తెలిపారు. కాగా.. శుక్రవారం రాత్రి సమయంలో కూడా ఇరాన్‌లోని ఫోర్డో అణు శుద్ధి కేంద్రం వద్ద రెండు పేలుళ్లు జరిగినట్టు సమాచారం. ఇరాక్‌తో యుద్ధం తర్వాత.. ఇరాన్‌పై జరిగిన అతిపెద్ద దాడులు ఇవే. నిజానికి ఇజ్రాయెల్ దాడుల ముప్పును ముందే ఊహించి.. నతాంజ్‌లోని తన యురేనియం శుద్ధి కర్మాగారాన్ని ఇరాన్ భూమికి 22 మీటర్ల లోతున, 2.5 మీటర్ల మందం ఉండే కాంక్రీట్ గోడలతో నిర్మించింది. అయినా ఇజ్రాయెల్ దాన్ని బంకర్ బస్టర్ బాంబులతో బద్దలుగొట్టింది. తమ దాడుల్లో ఆ కేంద్రం దెబ్బతిన్నట్టు ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఇరాన్ అణు ఇంధన సంస్థ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ కూడా.. నతాంజ్ (ఇరాన్)లోని అణు శుద్ధి కర్మాగారంపై ఇజ్రాయెల్ దాడిని ధ్రువీకరించింది. అక్కడ అణు ధార్మికత స్థాయులను నిశితంగా పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. ఇక.. తమ దేశంలోని పౌర ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. రక్తపు మరకలు అంటిన చేతులతో ఇజ్రాయెల్ ఈ నేరానికి పాల్పడిందని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా.. తాము చేసిన దాడులకు ప్రతిగా ఇరాన్ 100 డ్రోన్లను ప్రయోగించిందని.. వాటిని తమ గగనతలానికి ఆవలే అడ్డుకుని కూల్చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఆ ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. తాము ఎలాంటి డ్రోన్లనూ ప్రయోగించలేదని.. త్వరలోనే ప్రతీకార దాడి చేస్తామని స్పష్టం చేసింది. ఇక.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని పలు దేశాలు ఖండించాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నేతలు సంయమనం పాటించాల్సిందిగా ఇరు దేశాలకూ సూచించారు. ఇరాన్ అండతో పనిచేసే లెబనీస్ మిలిటెంట్ గ్రూపు హెజ్బొల్లా కూడా.. ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో చనిపోయినవారికి సానుభూతి తెలిపింది.

మావి ముందుజాగ్రత్త దాడులే..

ఇరాన్ అణు కార్యక్రమాన్ని చాలాకాలంగా వ్యతిరేకిస్తూ వస్తున్న ఇజ్రాయెల్.. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా ఆపడానికి తాము కట్టుబడి ఉన్నామని చాలాసార్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే.. మూడో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని, మరింత అధునాతనమైన సెంట్రీఫ్యూజ్‌లను ఏర్పాటు చేస్తామని ఇరాన్ గురువారం చేసిన ప్రకటనతో అప్రమత్తమై ఈ దాడులకు పాల్పడినట్టు భావిస్తున్నారు. దాడుల అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చేసిన ప్రకటన ఇందుకు నిదర్శనం. "టెహ్రాన్ నియంతలు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఇజ్రాయెల్ నాశనానికి బహిరంగంగా, నిస్సిగ్గుగా పిలుపునిస్తున్నారు. అందుకోసం అణ్వాయుధాల తయారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవలికాలంలో ఇరాన్ తొమ్మిది అణుబాంబులు చేయడానికి కావల్సిన శుద్ధి చేసిన యురేనియాన్ని ఉత్పత్తి చేసింది. ఇజ్రాయెల్ మనుగడకే ఇది పెనుముప్పు. ఇరాన్ పాలకుల అణు మారణహోమానికి మా దేశం బలి కాకుండా చూసుకుంటాను" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ అణు, సైనిక స్థావరాలను, ఇరాన్ అణు కార్యక్రమానికి నేతృత్వం వహిస్తున్న అధికారులను, సైనికాధికారులను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగినట్టు ఆయన స్పష్టం చేశారు. మరీ ముఖ్యంగా.. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమానికి గుండెకాయలాంటి నతాంజ్ ఎన్‌రిచ్‌మెంట్ ఫెసిలిటీపై తాము దాడి చేశామని.. తాము చేసిన ఈ దాడులు విజయవంతమయ్యాయని.. దేవుడి సహాయంతో తాము మరిన్ని విజయాలు సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌లో ఇన్నాళ్లుగా కొనసాగుతున్న మత రాజ్య పతనం ఈ దాడులతోనైనా మొదలవుతుందని ఆశిస్తున్నట్టు ఆయన తెలిపారు.

మమ్మల్ని రక్షించండి..

దాడుల అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భారత ప్రధానమంత్రి మోదీ సహా పలు దేశాల అధినేతలకు ఫోన్లు చేశారు. నెతన్యాహు నుంచి తనకు ఫోన్‌కాల్ వచ్చిందని ప్రధాని మోదీ 'ఎక్స్' ద్వారా తెలిపారు. నెతన్యాహుకు భారత్ ఆందోళనల గురించి, ఆ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరతలు నెలకొనాల్సిన అవసరం గురించి తాను ఆయనకు వివరించానని చెప్పారు. మరోవైపు.. ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో తాము తీవ్ర భయాందోళనలకు గురవుతున్నామని, తమను వెంటనే భారత్‌కు తరలించాలని ఇరాన్‌లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇరాన్ నడిబొడ్డున ఇజ్రాయెల్ డ్రోన్ల స్థావరం

ఇరాన్‌పై తాము చేపట్టిన ఈ ఆపరేషన్ వెనుక ఎన్నో ఏళ్ల ప్రణాళిక, విస్తృత అధ్యయనం ఉన్నాయని.. తమ సైన్యం, తమ గూఢచార సంస్థ మొస్సాద్, తమ దేశంలోని రక్షణ పరిశ్రమలు.. కలిసి దీన్ని చేపట్టాయని ఇజ్రాయెల్ రక్షణ శాఖకు చెందిన అధికారులు తెలిపారు. ఇరాన్‌పై తమ యుద్ధవిమానాలు దాడి చేసే సమయంలో, ఆ దేశ రక్షణ వ్యవస్థలు పనిచేయకుండా నిర్వీర్యం చేసే ప్రత్యేక ఆయుధాలను, స్ట్రైక్ సిస్టమ్స్‌ను తమ కమాండోలు ఆ దేశంలోకి ఎప్పుడో అక్రమ మార్గాల ద్వారా ప్రవేశపెట్టినట్టు వారు వివరించారు. మొస్సాద్ ఏజెంట్లు భారీగా పేలుడు పదార్థాలు నింపిన కార్లను ఇరాన్‌వ్యాప్తంగా సిద్ధంగా ఉంచారని చెప్పారు. అన్నింటికీ మించి.. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కి సమీపంలోనే విధ్వంసకర డ్రోన్లతో ఏకంగా ఒక బేస్‌నే ఏర్పాటు చేశారని.. దాడి మొదలుకాగానే వాటిని ఉత్తేజితం చేసి టెహ్రాన్‌కు సమీపంలోని మిసైల్ లాంచర్లపైకి ప్రయోగించారని, ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేశారని.. దీంతో తమ దాడులకు అడ్డు లేకుండా అయిందని ఆ అధికారులు వివరించారు.

ఇప్పటికైనా అణు ఒప్పందం కుదుర్చుకోండి: ట్రంప్

ఇకనైనా ఇరాన్ తమతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని.. లేకపోతే తదుపరి దాడులు మరింత క్రూరంగా, నిర్దయగా ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఆయన తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్‌సోషల్ ద్వారా స్పందించారు. తదుపరి దాడులకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని.. అవి మరింత క్రూరంగా ఉంటాయని అందులో పేర్కొన్నారు. "నేను ఎంత చెప్పినా ఇరాన్ నేతలు కొందరు ధైర్యంగా మాట్లాడారు. కానీ, ఏం జరగబోతోందో వారికి తెలియదు. ఇప్పటికే వారంతా చనిపోయారు. ఇది మరింత ఘోరంగా మారబోతోంది" అని హెచ్చరించారు. ఇప్పటికే ఇరాన్‌లో ఎంతో విధ్వంసం జరిగిందని, ఎన్నో మరణాలు సంభవించాయని.. ఇప్పటికీ సమయం మించిపోలేదని, మొత్తం నాశనమైపోయేలోగా ఇరాన్ తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని .. ఒకప్పుడు ఎంతో పేరొందిన ఇరానియన్ సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. "ఇక చావులు ఉండవు. విధ్వంసం ఉండదు. ఆలస్యం కాకముందే చేయండి (ఒప్పందం కుదుర్చుకోండి). దేవుడు మిమ్మల్ని దీవించుగాక" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. ఆ తర్వాత కొన్ని గంటలకు మరో సంచలన పోస్టు పెట్టారాయన. "అణు ఒప్పందం కుదుర్చుకోవాలంటూ రెండు నెలల క్రితం ఇరాన్‌కు నేను 60 రోజుల అల్టిమేటమ్ ఇచ్చాను. వారు కుదుర్చుకుని ఉండాల్సింది. ఇవాళ 61వ రోజు. ఏం చేయాలో నేను వారికి చెప్పాను. కానీ, వారు చేయలేదు. ఇప్పుడు వారికి బహుశా రెండో అవకాశం ఉంది" అని అందులో పేర్కొన్నారు. అంతకుముందు.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులపై 'ఏబీసీ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఇరాన్‌పై ఇజ్రాయెల్ అద్భుతంగా దాడులు చేస్తోందని ప్రశంసించారు. కాగా.. ఇరాన్‌పై దాడుల్లో తమ ప్రమేయం లేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టం చేశారు.

'ట్రూ ప్రామిస్ 3' పేరుతో ఇరాన్ ఎదురుదాడి

తమ దేశంపై దాడికి ప్రతిగా ఇరాన్ 'ట్రూ ప్రామిస్ 3' పేరుతో.. ఇజ్రాయెల్‌పై ఎదురుదాడి మొదలుపెట్టింది. ఆ దేశంపైకి వందలాది బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ అధికారిక వార్తాసంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. అలాగే.. తమ గగనతలంలోకి వచ్చిన రెండు ఇజ్రాయెలీ యుద్ధవిమానాలను ఇరాన్ సైన్యం కూల్చేసినట్టు తెలిపింది. మరోవైపు.. ఇరాన్ నుంచి డజన్ల కొద్దీ క్షిపణులు దూసుకొచ్చినట్టు ఇజ్రాయెల్ సైన్యం నిర్ధారించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, జెరూసలెం గగనతలంలోకి రాకెట్లు దూసుకొచ్చిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ దాడుల్లో ఏడుగురు పౌరులు స్వల్పంగా, ఒకమాదిరిగా గాయపడినట్లు స్థానిక అత్యవసర సేవల విభాగాధిపతి తెలిపారు. తమ యుద్ధవిమానాలు టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 350 కిలోమీటర్ల దూరంలోని ఇస్ఫాహన్‌లో ఉన్న అణుస్థావరంపై దాడి చేసినట్టు ఇజ్రాయెల్ ఒక ప్రకటనలో తెలిపింది. అక్కడ వందలాది అణు శాస్త్రవేత్తలు, మూడు చైనీస్ రిసెర్చ్ రియాక్టర్లు ఉన్నట్టు పేర్కొంది.

మృతుల్లో ప్రముఖులు..

సైనిక జనరళ్లు

మేజర్ జనరల్ మొహమ్మద్ బాఘేరీ: ఇరాన్ ఆర్మీ చీఫ్. సుప్రీం లీడర్ ఖమేనీ తర్వాతి అత్యున్నత స్థాయి కమాండర్.

జనరల్ హొస్సేన్ సలామీ: ఇరాన్ ప్రధాన సైనిక శక్తి 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్' అధిపతి.

జనరల్ గులాం అలీ రషీద్: ఇరాన్ సాయుధ బలగాల డిప్యూటీ కమాండర్ ఇన్ చీఫ్.

జనరల్ అమీర్ అలీ హాజీజాదే: ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ ఎయిరోస్పేస్ విభాగాధిపతి. (ఇజ్రాయెల్‌ను సర్వనాశనం చేస్తానని ఈయన పలు బహిరంగ వేదికలపై ప్రకటించారు).

అణు శాస్త్రవేత్తలు

ఫెరెడౌన్ అబ్బాసీ: ఇరాన్ అణు ఇంధన సంస్థ మాజీ చీఫ్

మొహమ్మద్ మెహదీ టెహ్రాన్‌జీ: థియరిటికల్ ఫిజిసిస్ట్, ఇస్లామిక్ ఆజాద్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు.

సయ్యద్ అమీర్ హొస్సేన్ ఫెఖీ: షహీద్ బెహెస్తి యూనివర్సిటీ ఆఫ్ టెహ్రాన్‌లో.. న్యూక్లియర్ ఇంజనీరింగ్ ఫేకల్టీ సభ్యుడు. ఇరాన్ అణు ఇంధన సంస్థ డిప్యూటీ చీఫ్.

..వీరితోపాటు మరో ముగ్గురు అణు శాస్త్రవేత్తలు అబ్దుల్ హమీద్ మినూచెహ్ర్, అహ్మద్ రెజా జోల్ఫఖారీ, మత్‌లబీజాదేహ్ కూడా మరణించారు. ఈ దాడుల్లో అణుశాస్త్రవేత్త మత్‌లబీజాదేహ్ భార్య కూడా మరణించినట్లు సమాచారం.

రాజకీయ నాయకుడు

అలీ షమ్‌ఖానీ: ఇరాన్‌లోని అత్యంత ప్రభావశీల రాజకీయ నాయకుల్లో ఒకరు, ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి అత్యంత సన్నిహితుడు. అమెరికాతో ఇరాన్ జరుపుతున్న అణు చర్చల్లో కీలక వ్యక్తి.


ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ఐరన్ డోమ్

చిత్రజ్యోతి

SINCE 1965



షేర్ చేస్తే కఠిన చర్యలు

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజాసాబ్' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం విదితమే. రొమాంటిక్ హారర్ కామెడీగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా టీజర్‌ని ఈనెల 16న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇదివరకే ప్రకటించింది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లనూ పూర్తిచేసుకుంది. అయితే ఈ చిత్ర టీజర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలు తాజాగా లీక్ అయ్యాయి. ఈ విజువల్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారడంతో చిత్రబృందం ఘాటుగా స్పందించింది. లీక్ అయిన కంటెంట్‌ను షేర్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎవరైనా 'రాజాసాబ్'కు సంబంధించిన అనధికారిక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే వారి సోషల్ మీడియా అకౌంట్లు తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రేక్షకులకు సినిమాటిక్ అనుభూతిని ఇచ్చేందుకు చిత్రబృందం కష్టపడుతోందని, దానికి అందరూ సహకరించాలని కోరింది. కాగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ సరసన మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

గేదెల రాజు కథ



నటుడిగా గాయకుడిగా, సంగీత దర్శకుడిగా తెర ముందూ, వెనుకా తనదైన ముద్రతో ఇండస్ట్రీలో సుదీర్ఘ కెరీర్‌ను సొంతం చేసుకున్నారు రఘు కుంచే. ఆయన టైటిల్ రోల్ పోషించిన తాజా చిత్రం 'గేదెల రాజు కాకినాడ తాలూకా'. రఘు కుంచే సమర్పించడంతో పాటు సంగీతం అందిస్తున్నారు. చైతన్య మోటూరి దర్శకుడు. వాణి రవికుమార్ మోటూరి నిర్మిస్తున్నారు. శుక్రవారం రఘు కుంచే పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'గేదెల రాజు' ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'నేటి సామాజిక పరిస్థితులకు అద్దంపట్టేలా ఈ చిత్రం ఉంటుంది, ప్రతి ఒక్కరి జీవితానికి అన్వయించుకునే కథ ఇద'ని దర్శకుడు చెప్పారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో ఈ సినిమా రూపొందుతోందని నిర్మాత అన్నారు. రవి ఆనంద్, చిన్ని బిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాస్, మౌనిక కీలకపాత్రలు పోషించారు.

ఉత్తమ చిత్రానికి రూ. 10 లక్షలు

- ప్రత్యేక అవార్డుకు రూ. 10 లక్షల నగదు బహుమతి
- ఉత్తమ ద్వితీయ, తృతీయ చిత్రాలకు రూ. 7, 5 లక్షలు
- ఉత్తమ నటుడికి, ఉత్తమ నటికి చెరో రూ. 5 లక్షలు
- నేడు గద్దర్ ఫిల్మ్ అవార్డుల వేడుక



గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవానికి హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ఈ వేడుకను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డుల విజేతలకు అందజేసే నగదు బహుమతిని భారీగా పెంచింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు సహా పలువురు చిత్ర ప్రముఖులు పాల్గొననున్నారు. కాగా, గద్దర్ ఫిల్మ్ అవార్డుల జాబితాను ఇటీవలె ప్రకటించారు. 2014 నుంచి 2023 వరకు ప్రతి ఉత్తమ చిత్రానికి హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు కలిపి నాలుగు అవార్డులను ప్రదానం చేస్తారు. ఇలా ప్రతి ఏడాదికి మూడు ఉత్తమ చిత్రాలకు అందజేస్తారు. 2024వ సంవత్సరానికి ప్రకటించిన అన్ని అవార్డులను కూడా బహూకరిస్తారు. వీటితోపాటు 2024వ సంవత్సరం నుంచి రఘుపతి వెంకయ్య, బీఎన్ రెడ్డి, ఎన్టీఆర్, పైడి జైరాజ్, కాంతారావు, చక్రపాణి పేర్లతో ప్రత్యేక అవార్డులను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. ఈ ఆరు ప్రత్యేక అవార్డుల్లో ఒక్కో అవార్డుకు రూ.పది లక్షల చొప్పున, మూడు ఉత్తమ చిత్రాలకు వరుసగా రూ. 10, 7, 5 లక్షల చొప్పున అందజేయనుంది. అదేవిధంగా ఉత్తమ నటుడు, ఉత్తమ నటికి రూ.5 లక్షల చొప్పున అందజేయనున్నారు. 14 సంవత్సరాల విరామం తర్వాత సినిమా నటీనటులను, సాంకేతిక నిపుణుల ప్రతిభను ప్రోత్సహించే సంప్రదాయానికి తెలంగాణ ప్రభుత్వం తిరిగి శ్రీకారం చుట్టడం పట్ల అవార్డుల గ్రహీతలు, సినిమా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, విజేతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణ కళారంగంలో వేగుచుక్కలాంటి గద్దర్ పేరిట వివిధ విభాగాల్లో సినిమా కళాకారులకు అవార్డులు అందించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

అన్ని వర్గాలను అలరించేలా



సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫైల్డ్ బ్రీత్'. హరినాథ్ పులి దర్శకుడు. డా. మురళీ చంద్ గింజుపల్లితో కలసి సీనియర్ సినీ పాత్రికేయుడు పర్వతనేని రాంబాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నటుడు శివాజీరాజా చేతుల మీదుగా ఫస్టులుక్‌పోస్టర్‌ను విడుదల చేశారు. నిర్మాతగా పర్వతనేని రాంబాబు మరెన్నో విజయాలు అందుకోవాలని ఈ సందర్భంగా శివాజీరాజా ఆకాంక్షించారు. పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ 'ఫైల్డ్ బ్రీత్ చిత్రీకరణ పూర్తయింది. హరినాథ్ పులి దర్శకుడిగా తానేంటో ఈ చిత్రంతో నిరూపించుకుంటాడు. సక్సెస్‌తో పాటు మా అందరికీ మంచి పేరు తెచ్చే చిత్రమిది' అన్నారు. ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథతో తెరకెక్కుతోందని హరినాథ్ పులి చెప్పారు.

బాసిల్‌కు బన్నీ గ్రీన్‌సిగ్నల్?



'పుష్ప అంటే ఇంటర్నేషనల్' అంటూ 'పుష్ప 2' సినిమాలో అల్లు అర్జున్ చెప్పిన డైలాగ్‌లానే ఇప్పుడు ఆయన ఇమేజ్ కూడా ఇంటర్నేషనల్ లెవల్‌కు వెళ్లింది. దాంతో ఆయనతో సినిమాలు చేయబోయే దర్శకులు అంటూ రోజుకో పేరు తెరపైకి తెస్తున్నాయి సోషల్ మీడియా వర్గాలు. తాజాగా అల్లు అర్జున్‌ను డైరెక్ట్ చేయబోతున్న దర్శకుల జాబితాలో మలయాళ డైరెక్టర్ బాసిల్ జోసెఫ్ పేరు చేరింది. ఆయనతో ఓ సినిమా చేసేందుకు బన్నీ ఎస్ చెప్పారంటూ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. బాసిల్ చెప్పిన కథ అల్లు అర్జున్‌కు బాగా నచ్చిందని, త్వరలోనే వీరి కాంబినేషన్‌పై అధికారిక ప్రకటన వస్తుందనేది ఆ వార్తల సారాంశం. బాసిల్ జోసఫ్ నటుడిగా, దర్శకుడిగా మలయాళ పరిశ్రమలో వరుస విజయాలను సొంతం చేసుకుంటున్నారు. అయితే అవేవీ అల్లు అర్జున్ స్థాయికి తూగేవి మాత్రం కావు. కాబట్టి ఈ ప్రచారంలో నిజానిజాలేమిటో తెలియాలంటే కొంతకాలం ఆగాల్సిందే అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు.

ప్రియాంకను అనుకున్నారు.. రకుల్‌ను తీసుకున్నారు!





భారతీయ చిత్ర పరిశ్రమ ఇప్పుడు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'రామాయణ'. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు నితిశ్ తివారి భక్తిశ్రద్ధలతో రూపొందిస్తున్నారు. వివాదాలకు తావు లేకుండా, విజువల్ వండర్‌గా 'రామాయణ' చిత్రాన్ని రూపొందించడానికి కృషి చేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే మొదలైనా గత ఏడాది నవంబర్ నెలలో అధికారికంగా వివరాలు వెల్లడించారు. సాయిపల్లవి సీతగా, రావణుడిగా కన్నడ హీరో యశ్, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణునిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా, లారా దత్తా కైకేయిగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఇక ఈ సినిమాలో మరో కీలకమైన పాత్ర శూర్పణఖ. రామ, రావణ యుద్ధం జరగడానికి కారణమైన ఈ పాత్రను రకుల్ ప్రీత్‌సింగ్ పోషించనున్నారు. ఆమె కంటే ముందు ఆ పాత్ర కోసం ఎవరిని సంప్రదించారో తెలుసా? పలు భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న ప్రియాంక చోప్రాను. ఆమె శూర్పణఖ పాత్ర పోషిస్తే అంతర్జాతీయ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న 'రామాయణ' చిత్రానికి అదనపు ఆకర్షణ అవుతుందని దర్శకనిర్మాతలు భావించారు. అయితే తనకున్న ఇతర కమిట్‌మెంట్స్ వల్ల ఆ పాత్ర చేయలేనని ప్రియాంక చెప్పడంతో అప్పుడు రకుల్‌ను ఈ అవకాశం వరించింది. ప్రియాంక చోప్రా ఇప్పుడు మహేశ్, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా కూడా రామాయణగాథ స్ఫూర్తితో రూపొందుతుండడం విశేషంగా పేర్కొనాలి.

ఏషియన్ సురేశ్ ద్వారా 'మార్గన్'



విజయ్ ఆంటోనీ కథానాయకుడిగా నటించిన తమిళ చిత్రం 'మార్గన్'. లియో జాన్‌పాల్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ నిర్మించారు. విజయ్ ఆంటోనీ మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా పరిచయం అవుతున్నాడు. మర్డర్ మిస్టరీ- క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నిర్మాత దగ్గుబాటి సురేశ్‌బాబు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీస్థాయిలో 'మార్గన్' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో సురేశ్‌బాబును విజయ్ ఆంటోని కలిశారు. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇదని విజయ్ ఆంటోని తెలిపారు.

తెలుగు, తమిళ, హిందీ భాషల్లో చిత్ర నిర్మాణం

సురేశ్‌బాబు

దుల్కర్ సల్మాన్, రానా హీరోలుగా నటిస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమైందని, తెలుగుతో పాటు తమిళంలోనూ నిర్మిస్తున్నామని నిర్మాత సురేశ్‌బాబు తెలిపారు. వీటిల్లో వెంకటేశ్, రానా నటించే చిత్రాలు కూడా ఉన్నాయన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం తమ బ్యానర్‌లో తెలుగు, హిందీ, తమిళంలో పలు సినిమాల షూటింగులు జరుగుతున్నాయన్నారు. త్వరలో మనోజ్ బాజ్‌పాయ్‌తో హిందీలో ఓ సినిమా నిర్మించనున్నట్లు చెప్పారు. శోభితతో చిత్రీకరించిన ఓ షోను కూడా అమెజాన్ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుందన్నారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

థగ్‌లైఫ్ మూవీ బ్యాన్.. కోర్టులో విచారణ

కర్ణాటకలో థగ్‌లైఫ్ సినిమా విడుదలకు సంబంధించి నమోదైన పిటిషన్‌లు సుప్రీంకోర్టు, కర్ణాటక హైకోర్టులో శుక్రవారం ఒకే రోజు విచారణకు వచ్చాయి. థగ్‌లైఫ్ హీరో కమల్ హాసన్ బెంగళూరులో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలు కర్ణాటకలో వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. కమల్ క్షమాపణ చెప్పకపోతే థగ్‌లైఫ్ సినిమాను రాష్ట్రంలో విడుదల చేయనివ్వబోమని కన్నడ సంఘాలు హెచ్చరించాయి. కర్ణాటక చలనచిత్ర వాణిజ్యమండలి కూడా ఈ మేరకు తీర్మానం చేసింది. దీన్ని ప్రశ్నిస్తూ, సినిమా నిర్మాణ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం విచారించింది. సినిమా విడుదలకు అభ్యంతరాలు తెలియజేయాలని కర్ణాటక ప్రభుత్వానికి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

25లోపు రైతుభరోసా

» సాగుచేసే రైతులందరికీ పెట్టుబడి సాయం: తుమ్మల



ఖమ్మం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున ఈనెల 25లోపు రాష్ట్రంలోని సాగుచేసే రైతులందరికీ రైతుభరోసా అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పెట్టుబడి సాయంగా ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.10 వేల కోట్లను రైతులకు అందించబోతున్నామన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బాలప్పేటలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈసారి రైతుభరోసా నిబంధనల ప్రకారం 54 ఎకరాల మెట్ట ఉన్న రైతులకు కూడా అందిస్తామని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో 18 ఎకరాలు, చెరువుల కింద 27 ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తామని పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు 87శాతం వరకు ఉన్నారని తెలిపారు. అలాగే ఉపాధి హామీ పథకంలో రెండేళ్ల పాటు పనిచేసిన అర్హత ఉన్న వ్యవసాయ కూలీలకు కూడా సహాయం అందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం సబ్‌కమిటీ వేయలేదని, రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న ప్రాణహిత, దుమ్ముగూడెం, రుద్రంకోట లాంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు అవసరమైన సూచనల కోసం ఆ సబ్‌కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. అయితే నాటి సబ్‌కమిటీలో తన పేరు ఉందని, కాళేశ్వరానికి తాము అనుకూలంగా నిర్ణయం తీసుకున్నామని ఈటల రాజేందర్ చెప్పినందునే ఈ అంశంపై తాను స్పందించి కమిషన్‌కు వాస్తవాలతో కూడిన లేఖ రాశానని చెప్పారు. సబ్‌కమిటీ కంటే ముందే కాళేశ్వరంపై నిర్ణయం జరిగిందని ఆయన తెలిపారు.

తెలంగాణలో అభివృద్ధి పరుగు

» పారిశ్రామికవేత్తల 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్'లో దుద్దిళ్ల



హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ దూసుకుపోతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్న తెలంగాణలో కలిసి పనిచేసేందుకు ప్రపంచ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. తాజ్ డెక్కన్ హోటల్‌లో ఇంటర్నేషనల్ బిజినెస్ కొలాబరేషన్(ఐబీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ లీడర్స్ సమ్మిట్-2025' సదస్సును మంత్రి ప్రారంభించారు. 25 దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనతి కాలంలోనే అన్ని రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోందని చెప్పారు. తెలంగాణ పురోగతిలో భాగస్వాములు కావాలన్నారు. "రాష్ట్ర జీడీపీ రూ.16.12 లక్షల కోట్లకు చేరింది. 10.1 శాతం వృద్ధి రేటుతో దేశ సగటు (9.9%)ను దాటేసింది. తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు. ఇది దేశ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ. ఏడాదిన్నర కాలంలోనే రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సేకరించగలిగాం. గత 14 నెలల్లో లైఫ్ సైన్సెస్‌లో రూ. 40 వేల కోట్ల పెట్టుబడులను సాధించాం. 2 లక్షల ఉద్యోగాలు సృష్టించాం. రాష్ట్ర జీడీపీలో సేవల రంగం వాటా 66.3 శాతం. దేశంలో ఇది 55 శాతంగా ఉంది. ఇవి అంకెలు కాదు... తెలంగాణ పురోగతికి నిదర్శనాలు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలు, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మీ దేశంలోని పారిశ్రామికవేత్తలకు వివరించండి. ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా వారిని ప్రోత్సహించండి" అని ఆయన కోరారు.

ఇళ్ల పేరిట ఇసుకను అమ్ముకున్నారు : సీతక్క

కొత్తగూడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి పట్టించుకోలేదని, ఇళ్ల పేరుతో ఇసుకను అమ్ముకున్నారని మంత్రి సీతక్క ఆరోపించారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గానికి సంవత్సరానికి వేయి ఇళ్లు నిర్మించి ఇచ్చినా పదేళ్లలో పేదలకు 10 వేల ఇళ్లు ఉండేవన్నారు. నేడు వేలాదిగా ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. కాగా, రం రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వస్తుందని మంత్రి సీతక్క అన్నట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు వాస్తవం కాదని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సీతక్క అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, వారం పది రోజుల్లో పంచాయతీ ఎన్నికలపై ఒక స్పష్టత వస్తుందని మాత్రమే చెప్పారని అందులో పేర్కొన్నారు.

ప్రతిభావంతుల ఎంపికే లక్ష్యం కావాలి

» పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో గవర్నర్



హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రతిభావంతులను ఎంపిక చేయడమే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల లక్ష్యం కావాలని, నియామక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. నల్సార్ యునివర్సిటీలో జరుగుతున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ స్థాయి సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశంతోపాటు 25 రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

5 రోజుల పాటు భారీ వర్షాలు!

» పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్.. జడ్చర్లలో 10.6 సెం.మీ వర్షం

» మెదక్‌లో పిడుగుపాటుకు మహిళ మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా వరుణుడు ప్రభావం చూపిస్తున్నాడు. శుక్రవారం పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురవగా.. మరో ఐదు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. భూపాలపల్లి, ములుగు, భద్రా ద్రి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఆదివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా 10.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భువనగిరి జిల్లాలోని దత్తప్పగూడలో 7.8సెంటీమీటర్ల వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో ఈదురుగాలుల దెబ్బకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు దెబ్బతిన్నాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కూడా శుక్రవారం మోస్తారు వర్షాలు కురిశాయి. కాగా, పిడుగుపాటుకు గురై మెదక్ జిల్లా గూడురు గ్రామానికి చెందిన సత్తమ్మ(45) మరణించగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. జూరాల ప్రాజెక్టుకు 14వేలు, శ్రీశైలం ప్రాజెక్టుకు 18,444 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

రవాణా శాఖ తనిఖీల్లో 153 వాహనాల సీజ్

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. సరైన పత్రాలు లేని, ఫిట్‌నెస్ లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా 198 కేసులు నమోదు చేసి, 153 వాహనాలను సీజ్ చేశారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 42 కేసులు నమోదు చేసి, 34 వాహనాలను సీజ్ చేశారు. హైదరాబాద్‌లో 42 కేసులు నమోదు చేసి... 33 వాహనాలు సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఫిట్‌నెస్, సరైన పత్రాలు ఉంటేనే విద్యార్థులను తరలించాలని, లేకపోతే కేసుల నమోదుతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరించారు.

ఇష్టారీతిన ఫీజుల పెంపా?

(మొదటిపేజీ తరువాయి)

చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ లాంటి వృత్తివిద్య కోర్సుల్లో ఫీజులను మూడేళ్లకోసారి సమీక్షించాల్సి ఉంటుంది. 2025-28 సంవత్సరాలకు సంబంధించిన ఫీజులపై ఇటీవలే ఫీజు నియంత్రణ కమిటీ (ఎఫ్ఆర్‌సీ) ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఇందులో హైదరాబాద్ పరిసరాల్లోని అనేక కాలేజీల్లో ఫీజును 100 శాతం పెంచారు. ఇది చాలా ఎక్కువ అంటూ విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఎఫ్ఆర్‌సీ ప్రతిపాదనలను తిరస్కరించారు. కళాశాలల్లో మౌలిక వసతులను పరిగణనలోకి తీసుకొని ఫీజు పెంపు గరిష్ఠంగా 30 శాతం ఉండాలని, అంత కంటే ఎక్కువ ఉండరాదని గత నెలాఖరులో జరిగిన సమావేశంలో స్పష్టం చేశారు. దీంతో ఫీజుల పెంపుపై ఎఫ్ఆర్‌సీ మళ్లీ కసరత్తు ప్రారంభించింది. జూలై మొదటి వారంలో ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నందున.. అంతకుముందే ఫీజులను ఖరారు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం సీఎం అధ్యక్షతన జరిగిన విద్యాశాఖ ఉన్నతస్థాయి సమీక్షలో ఫీజుల పెంపు అంశం చర్చకు వచ్చింది. గతంలో పెంచిన ఫీజు ప్రతిపాదనలు, మళ్లీ జరుగుతున్న కసరత్తును అధికారులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని అనేక కాలేజీల్లో ఇంజనీరింగ్ ఫీజులు ఇప్పటికే చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతిభ ఆధారంగా నగరంలోని ప్రముఖ కాలేజీల్లో సీట్లు దక్కినా.. పేద విద్యార్థులు వెనకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొందని సీఎం అన్నట్లు తెలిసింది. అనేక కాలేజీలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. యూజీసీ నిబంధనలకు అనుగుణంగా బోధనా సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో 'ఇంజనీరింగ్ కాలేజీలపై గత ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ నివేదికలు ఏమయ్యాయి? అందులో ఏం తేలింది? ఆ నివేదికలు సమర్పించండి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆలస్యమైనా పర్వాలేదు, మళ్లీ అధ్యయనం చేయాలని.. విద్యార్థులపై భారం పడకూడదని స్పష్టం చేసినట్లు తెలిసింది.

రాష్ట్రంలో 571 కొత్త పాఠశాలలు!

గ్రామాలు, పట్టణాల్లోని బడుల్లో 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న చోట్ల ఏర్పాటు

» విద్యాశాఖ ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు చెబుతున్న మంత్రి అడ్లూరి, చిత్రంలో మాదిగ సామాజికవర్గ ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. విద్యా ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో 20 మంది కన్నా ఎక్కువ విద్యార్థులు ఉన్న చోట్ల కొత్త బడులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడానికి అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత ఖర్చయినా వెనకాడబోమని స్పష్టం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. బోధనా ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచించారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలన్నారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్తులో వారికి ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యాశాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్ఎండీఏ, మునిసిపల్ లేఔట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్లకూ అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని చెప్పారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సెలింగ్ ఇస్తే మానసికంగా దృఢంగా తయారవడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని అన్నారు.

ఉస్మానియా ఆస్పత్రిపై సీఎం సమీక్ష

హైదరాబాద్‌లోని గోషామహల్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఉస్మానియా కొత్త ఆస్పత్రిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఆస్పత్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం కోసం టెండర్లను ఆహ్వానించామని, ఈ నెల 27 వరకు గడువు పెట్టామని అధికారులు చెప్పారు. ఆస్పత్రి అవసరాలకు సౌర విద్యుత్తును వినియోగించేలా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. అవసరమైన మేరకు సౌర విద్యుత్తు ఏర్పాటు చేయాలని, కేవలం భవనం పైభాగంలో మాత్రమే కాకుండా.. ఆస్పత్రి పరిధిలో ఉన్న నాలాపై కూడా సౌర పలకలను ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. కాగా, జలమండలి అధికారులతోనూ సీఎం సమీక్ష నిర్వహించారు. వానాకాలం వచ్చిన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, వాటి కట్టడికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడంపై ప్రజారోగ్య శాఖ అధికారులతో రేవంత్ భేటీ అయ్యారు. ఆ సమావేశంలో పలు కీలక సూచనలు చేసినట్టు సమాచారం.

లోకం తీరు



16న రైతులతో సీఎం ముఖాముఖి

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 16న నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన టెలి కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడతారని, ఆ ప్రసారాన్ని అన్ని రైతు నేస్తం కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు సీఎస్ తెలిపారు. ప్రతి ప్రాంతం నుంచి కనీసం 250 మంది రైతులు వారి రైతు నేస్తం కేంద్రానికి హాజరయ్యేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. కాగా, అంతకు ముందు సీఎస్ శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగే గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఏర్పాట్లను సమీక్షించారు.

సీఎం రేవంత్‌ను కలిసిన మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు

మంత్రివర్గంలోకి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను తీసుకోవడంపై మాదిగ సామాజిక వర్గం ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంను ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య తదితరులు కలిశారు. అంతకు ముందు మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎం సీపీఆర్వో బాధ్యతల స్వీకరణ

సీఎం రేవంత్‌రెడ్డి సీపీఆర్వోగా నియామకమైన గుర్రం మల్సూర్ శుక్రవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సీఎంను మల్సూర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

డీఏ వచ్చేసింది!

» 3.64 శాతం డీఏను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

» జూలైలో అందుకునే వేతనంతోపాటు చెల్లింపు

» ఉద్యోగులు, పెన్షనర్లకు తీపికబురు

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త. పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలలో (డీఏ) ఒక డీఏను ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో రెండు డీఏలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు 2023 జనవరి1కి సంబంధించిన 3.64 శాతం డీఏను శుక్రవారం విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా జారీ చేశారు. తాజా డీఏతో ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యం 26.39 శాతం నుంచి 30.03 శాతానికి పెరగనుంది. ఈ పెరిగిన డీఏ 2023 జనవరి 1 నుంచి అమలు కానుంది. ఈ డీఏకు సంబంధించిన నగదును జూన్ నెల వేతనంలో కలిపి జూలైలో చెల్లిస్తారు. డీఏ బకాయిలను ఉద్యోగులు, పెన్షనర్ల జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌లో జమ చేస్తారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు మాత్రం 2023 జనవరి 1 నుంచి రావాల్సిన బకాయిల్లో 10 శాతం సొమ్మును వారి ప్రాన్(శాశ్వత పదవీ విరమణ) ఖాతాలో జమ చేస్తారు. మిగిలిన 90 శాతం బకాయిలను 28 నెలల పాటు సమాన వాయిదాలలో చెల్లిస్తారు. 2025 అక్టోబరు 31లోపు పదవీ విరమణ తీసుకునే ఉద్యోగుల డీఏ బకాయిలను కూడా 28 నెలవారీ సమాన వాయిదాలలో చెల్లిస్తారు.

ఘటనాస్థలంలో లేనప్పుడు అట్రాసిటీ సెక్షన్లు ఎలా వర్తిస్తాయి?

క్వాష్ పిటిషన్‌పై రేవంత్ తరఫున వాదనలు .. త్వరగా వాదనలు పూర్తిచేయాలని ఫిర్యాదుదారుకు హైకోర్టు ఆదేశాలు



హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ భూవివాదంలో కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం వాడీవేడి వాదనలు కొనసాగాయి. ఘటనాస్థలంలో లేని తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం చెల్లదని రేవంత్‌రెడ్డి పేర్కొనగా.. దిగువ కోర్టులో ట్రయల్ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదుదారు వాదించారు. గోపన్‌పల్లి గ్రామం సర్వే నెంబర్ 127లో ఉన్న రాజోల్ ఎస్సీ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ భూమిని ఆక్రమించడంతోపాటు సొసైటీ నిర్మాణాలను జేసీబీతో కూల్చేశారని పేర్కొంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో 2016లో ఫిర్యాదు నమోదైంది. ఆ సొసైటీ అధ్యక్షుడు ఎన్ పెద్దిరాజు ఈ ఫిర్యాదు చేశారు. ఏ-1గా కొండల్‌రెడ్డి, ఏ-2గా ఈ.లక్ష్మయ్య, ఏ-3గా రేవంత్‌రెడ్డిని చేర్చారు. దర్యాప్తు పూర్తయి ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల స్పెషల్ కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో 2020లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ తాజాగా శుక్రవారం మరోసారి జస్టిస్ మౌషమీ భట్టాచార్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సీ రఘు వాదిస్తూ.. రేవంత్‌రెడ్డి ఘటనాస్థలంలో లేరని.. అక్కడ లేని వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ 3 కింద కేసు నమోదు చేయడం చెల్లదని పేర్కొన్నారు. భూవివాదం ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు వర్తించవని తెలిపారు. ఇది ఫిర్యాదుదారు సొంత భూమి కాదని.. సొసైటీ భూమి అని.. సొసైటీ ఎలా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడుతుందని ప్రశ్నించారు. పోలీసుల తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. ఈ కేసులో 8 మంది సాక్షులను విచారించామని.. అందులో ఒక్కరు కూడా రేవంత్‌రెడ్డి అక్కడ ఉన్నట్లు చెప్పలేదని పేర్కొన్నారు. ఫిర్యాదుదారు అయిన పెద్దిరాజు తరఫు న్యాయవాది నిమ్మ నారాయణ వాదిస్తూ.. గత ఐదేళ్లుగా దిగువ కోర్టులో ట్రయల్ సాగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దిగువ కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి ఇచ్చిన మినహాయింపును ఎత్తేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఐదేళ్ల క్రితం ఇచ్చిన ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపును ఇప్పుడు సవాల్ చేయడం ఏమిటని ప్రశ్నించింది. ప్రధాన కేసులో వాదనలు వినిపించాలని సూచించింది. ఈ కేసుపై ఇప్పటికే చాలాసార్లు విచారించామని.. ఇంకా ఏం లేదని.. పది నిమిషాల సమయం కేటాయిస్తున్నామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

డిప్యూటేషన్లు నిలిపేయండి

» అర్హులకు పదోన్నతులు ఇవ్వాలి

» సురేఖకు అధికారుల వినతి

» గోడు వెళ్లబోసుకున్న వంద మందిపైగా అధికారులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖలోకి ఇతర విభాగాల నుంచి డిప్యూటేషన్ల ప్రక్రియ నిలిపివేయాలని మంత్రి కొండా సురేఖకు దేవాదాయ అధికారులు, సిబ్బంది విజ్ఞప్తి చేశారు. ఏళ్ల తరబడిగా తమ శాఖలో పనిచేస్తోన్న వారిలోనే అర్హులను గుర్తించి పదోన్నతులు కల్పించాలని కోరారు. డిప్యూటేషన్లు సరికాదంటూ ఈవోలు, అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు రాష్ట్రవ్యాప్తంగా వంద మందికి పైగా సిబ్బంది శుక్రవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖను కలిసారు. సొంత శాఖలో తమకు ఎదురవుతోన్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం సమర్పించారు. దేవాదాయ శాఖలో ఖాళీల పేరుతో.. ఆయా పోస్టులకు అర్హులైన వారిని డిప్యూటేషన్‌పై పంపించాలని కోరుతూ ఆరు వేర్వేరు విభాగాలకు ఉన్నతాధికారులు ఈ నెల 9న లేఖలు రాశారు. ఇతరులు ఇక్కడికి వస్తే... తమ శాఖలో ఏళ్లుగా పనిచేస్తోన్న వందలాది మందికి అన్యాయం జరుగుతుందని దేవాదాయ అధికారులు మంత్రి వద్ద వాపోయారు. అనుభవం ఉన్నవారికి పదోన్నతులు కల్పించడంతో పాటు ఇప్పటికే డిప్యూటేషన్‌పై పని చేస్తోన్న వారిని వెనక్కి పంపించాలని కోరారు. డిప్యూటేషన్ విధానం నిబంధనలకు విరుద్ధమని, ఇదే విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్రయోజనం లేకుండా పోయిందని మంత్రికి వివరించారు. మంత్రితో పాటు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్‌ను సైతం కలిసి ఇదే విషయమై వినతిపత్రం అందజేశారు. ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం. రామకృష్ణ రావు, డిప్యూటీ కమిషనర్లు శ్రీకాంత రావు, ఎన్. సంధ్య, అసిస్టెంట్ కమిషనర్లు, ఈవోలు, తెలంగాణ అర్చక, ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ తదితరులు మంత్రి కొండా సురేఖ, ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

డిప్యూటేషన్లకు తాత్కాలిక బ్రేక్...

పెద్ద సంఖ్యలో అధికారులు మంత్రిని కలిసి సమస్య విన్నవించడంతో కొండా సురేఖ వారికి భరోసా కల్పించారు. సమస్య కొలిక్కి వచ్చే వరకు డిప్యూటేషన్ల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులతో సమీక్షించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

క్యాబినెట్ ముందుకు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్!

» దాన్ని ఆమోదించి.. కేంద్రానికి నివేదిక.. కేంద్రం ఆలస్యం చేస్తే హెచ్ఎండీఏ

» 'రోడ్ల అభివృద్ధి కార్యక్రమం'తో నిర్మాణం?

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం ఖరారు చేయనుంది. ఈ నెల చివరి వారంలో నిర్వహించనున్న క్యాబినెట్ భేటీలో దీనిపై చర్చించి, ఖరారు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దక్షిణ భాగం రహదారి అలైన్‌మెంట్, నిర్మాణం, భవిష్యత్ ప్రయోజనాలు సహా పలు అంశాలపై చర్చించి.. అలైన్‌మెంట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనున్నట్లు తెలిసింది. అనంతరం అలైన్‌మెంట్‌ను కేంద్రానికి నివేదించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం అధికారులు దక్షిణ భాగం రహదారికి సంబంధించిన అన్ని అంశాలతో సమగ్ర నివేదికను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. దక్షిణ భాగం నిర్మాణంపై ఒకవేళ కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వమే.. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలోని రోడ్ల అభివృద్ధి కార్యక్రమం (ఆర్‌డీపీ) కింద దక్షిణ భాగం రహదారిని నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపైనా క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోనున్నారు. అదే విధంగా ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం అభివృద్ధికి ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్‌ను కూడా రూపొందిస్తున్నట్లు తెలిసింది. దానిపై కూడా మంత్రివర్గంలో చర్చించి, నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక్రిశాట్‌లోని ఐఎస్‌హెచ్ స్కూల్‌లో పవన్ కల్యాణ్ కుమారుడికి అడ్మిషన్

» స్వయంగా వచ్చి చేర్పించిన ఏపీ డిప్యూటీ సీఎం

పటాన్‌చెరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన కుమారుడు మార్క్ శంకర్‌ను పటాన్‌చెరులో ఉన్న ఇక్రిశాట్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్(ఐఎస్‌హెచ్)లో చేర్పించారు. శుక్రవారం పవన్‌కల్యాణ్ స్వయంగా స్కూల్‌ను సందర్శించి మార్క్‌శంకర్ అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అంతకుముందు మార్క్‌శంకర్ సింగపూర్‌లోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్లో చదువుకున్నాడు. ఇటీవల ఆ స్కూల్లో అగ్నిప్రమాదం జరగడంతో స్వల్పంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి హైదరాబాద్‌లోనే ఉంటున్న శంకర్‌ను పవన్ కల్యాణ్ ఇక్రిశాట్‌లోని పాఠశాలలో చేర్పించారు. పవన్ రాక నేపథ్యంలో ఇక్రిశాట్‌లోకి మీడియాను అనుమతించలేదు.

కన్నీటి కథలు..!!

అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదం ఎన్నో కుటుంబాలకు తీరని విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో మరణించిన ప్రతీ ఒక్కరి ప్రయాణం వెనక ఒక్కో కథ. లండన్‌లో ఉన్న భార్యను కలిసేందుకు బయలుదేరిన వ్యక్తి ఒకరైతే.. భార్య అస్థికలను స్వగ్రామంలోని నదిలో కలిపి ఆమె ఆఖరి కోరిక తీర్చి లండన్ తిరుగు ప్రయాణమైన భర్త మరొకరు.. వివాహ వేడుక కోసం స్వస్థలానికి వచ్చి లండన్ తిరిగి వెళ్తూ ప్రాణాలు కోల్పోయిన ఏడు నెలల గర్భిణి ఇంకొకరు.. ఇలా ఎందరికో ఆఖరి మజిలీగా మారిన ఈ ప్రయాణం ఎన్నో కుటుంబాలను చిదిమేసింది..!!

అంజూ.. ఫ్లైట్ ఎక్కాను.. రేపటికి చేరుకుంటా!


భార్య అంజలీబెన్‌తో విజయ్ రూపాణీ(ఫైల్)

"అంజూ నేను ఫ్లైట్ ఎక్కా. విమానం బయలుదేరబోతోంది. నేను రేపు వస్తాను" ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ తన భార్య అంజలిబెన్‌తో చివరిగా ఫోన్‌లో మాట్లాడిన మాటలివి. ఆ కాసేపటికే ఆయన మరణించారు. లండన్‌లో ఉంటున్న తమ కుమార్తె ఇంటికి అంజలిబెన్ మే 19న వెళ్లారు. విజయ్‌రూపాణీ కూడా జూన్ 5న లండన్ వెళ్లేందుకు టికెట్ కూడా బుక్ చేసుకున్న విజయ్ రూపానీ.. పంజాబ్‌లోని లుథియానా ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. మళ్లీ జూన్ 10న ప్రయాణానికి టికెట్ బుక్ చేసుకున్నా.. ఆఖరి నిమిషంలో ప్రయాణం వాయిదా వేసుకున్నారు. చివరికి గురువారం విమానం ఎక్కి ఈ లోకాన్ని వీడారు.

భార్య అస్థికలను నదిలో కలిపేందుకు వచ్చి..


భార్య భారతిబెన్‌తో అర్జున్ పటోలియా (ఫైల్)

సూరత్‌కు చెందిన అర్జున్ పటోలియా(36) తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి 2009 నుంచి లండన్‌లోనే స్థిరపడ్డాడు. అర్జున్ భార్య భారతిబెన్ మే 23న మరణించింది. భారతి అంత్యక్రియలను అర్జున్ లండన్‌లోనే పూర్తి చేశాడు. అయితే, తన అస్థికలను స్వగ్రామంలోని నర్మదా నదిలో కలపాలన్న ఆమె చివరి కోరికను తీర్చేందుకు అర్జున్ సూరత్ వచ్చాడు. ఆమె అస్థికలను నదిలో కలిపాడు. తిరిగి లండన్ బయలుదేరి విమాన ప్రమాదంలో మరణించాడు. వారి పిల్లలు అనాథలుగా మిగిలారు.

తండ్రి అంత్యక్రియలకు వచ్చి...

గుజరాత్, మెహసాన్ జిల్లాలోని ఉంఝా ప్రాంతానికి చెందిన కేతన్ పటేల్(40) లండన్‌లో స్థిరపడ్డారు. ఇటీవల తన తండ్రి మరణించగా.. అంత్యక్రియల కోసం 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. ఆ కార్యక్రమాలు ముగించుకుని తల్లి సవితాబెన్ పటేల్(70)తో కలిసి అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరారు. కానీ, ఆ విమానం కూలిపోవడంతో తల్లీకొడుకులు ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.


తల్లి సవితాబెన్‌తో కేతన్ పటేల్

పెళ్లి కోసం వచ్చి గర్భస్థ శిశువు సహా దంపతులు..


భర్త వైభవ్ పటేల్‌తో జినాల్


గుజరాత్, ఢోల్కా జిల్లాలోని కేలియావాస్నా అనే గ్రామానికి చెందిన జినాల్ పటేల్, వైభవ్ పటేల్‌ది ప్రేమ వివాహం. జినాల్ ప్రస్తుతం 7నెలల గర్భిణి. తమ కుటుంబసభ్యుల్లో ఒకరి వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ఈ జంట మే 5న లండన్ నుంచి భారత్‌లోని స్వగ్రామానికి వచ్చింది. గురువారం ఎయిరిండియా విమానంలో తిరుగు ప్రయాణమై వారు ప్రాణాలు కోల్పోయారు.

పెళ్లైన నాలుగు నెలలకే

ధనేరాలోని థారావ్ గ్రామానికి చెందిన సావ్దాన్ చౌదరి, థాపుబెన్‌కు నాలుగు నెలల క్రితమే వివాహమైంది. అహ్మదాబాద్ నుంచి ఎయిరిండియా విమానంలో లండన్ బయలుదేరిన ఈ జంట విమాన ప్రమాదంలో మరణించగా.. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.


యువ దంపతులు సావ్దాన్ చౌదరి, థాపుబెన్

భార్యతో కలిసి లండన్ వెళ్తూ..


గౌరవ్ బ్రహ్మభట్, కల్యాణి బ్రహ్మభట్

గాంధీనగర్‌కు చెందిన గౌరవ్ బ్రహ్మభట్ గతంలో లండన్‌లో పని చేసేవారు. ఆ సమయంలో పరిచయమైన మహారాష్ట్రకు చెందిన కల్యాణిని పెళ్లి చేసుకున్నారు. ఢిల్లీలోని ఓ ఫార్మా కంపెనీలో ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్న గౌరవ్ ఇటీవల ముంబైకి బదిలీ అయ్యారు. కల్యాణి గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఓ కంపెనీలో పని చేస్తున్నారు. తాము తొలిసారి కలిసిన లండన్‌కు చాలాకాలం తర్వాత వెళ్లేందుకు ఎయిరిండియా విమానం ఎక్కిన గౌరవ్ దంపతులు ప్రమాదంలో మరణించారు.

నిశ్చితార్థం చేసుకుని తిరిగి వెళ్తూ..

గుజరాత్, బోటాడ్ జిల్లాలోని అద్తల గ్రామానికి చెందిన హార్దిక్ దేవరాజ్(27) రెండేళ్లుగా లండన్‌లో ఉంటూ అమెజాన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. సజోద్ గ్రామానికి చెందిన విభూతి అనే యువతిని లండన్‌లో కలిశాడు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని అనుకోని పెద్దలను ఒప్పించారు.. నెల రోజుల క్రితం వారు భారత్‌కు రాగా.. సజోద్‌లో నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. పెళ్లికి సమయం ఉండడంతో తిరిగి లండన్ బయలుదేరిన ఆ యువ జంట తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయింది.


కాబోయే భార్య విభూతితో హార్దిక్

వీడని మిస్టరీ!



"వీడియోలను బట్టి చూస్తే.. విమానం వేగం కోల్పోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఇంజన్ల విఫలం కావడమే కారణం కావొచ్చు. దీనికి ఇంధనం కల్తీ మరో కారణమైన ఉండొచ్చు." - సీనియర్ మాజీ పైలట్

(మొదటిపేజీ తరువాయి)

బ్యూరో(ఏఏఐబీ) అధికారులు విచారణ ప్రారంభించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం.. వైమానిక రంగ నిపుణులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని కూడా నియమించింది. ఈ కమిటీ అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ రూపొందించిన ప్రోటోకాల్ ప్రకారం విచారణ చేస్తుందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషించేందుకు అన్ని కోణాల్లోనూ విచారణ చేయనున్నట్టు చెప్పారు. అదేవిధంగా వైమానిక రంగం భద్రత, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలనే అంశాలపై కూడా ఉన్నత స్థాయి కమిటీ దృష్టిసారిస్తుందని వివరించారు. ఇదిలావుంటే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిని సందర్శించి.. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఎన్ఐఏ సహా..

జాతీయ దర్యాప్తు బృందం(ఎన్ఐఏ) అధికారులు సహా కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఇతర ఏజెన్సీలకు చెందిన అధికారులు కూడా అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. అయితే, వారు ఏయే అంశాలపై దృష్టి పెట్టారు? ఏకోణంలో విచారణ చేపట్టారనే విషయాలను గోప్యంగా ఉంచారు. మరోవైపు, ఈ ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని ఎయిర్ ఇండియా ప్రకటించింది. మొత్తం విమానంలో ప్రయాణించిన వారిలో ఒకే ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారని తెలిపింది. ఇక, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) అధికారులు ఘటనా స్థలంలోని అణువణువునూ నిశితంగా పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వం సహా ఎయిర్ ఇండియా అధికారులు విమాన ప్రమాద సమయంలో ఇంజన్, ల్యాండింగ్ గేర్ పరిస్థితిపై ప్రత్యేకంగా విచారణ సాగిస్తున్నాయి. కుప్పకూలిన విమానం నిర్వహణ సమస్యలు సహా ఎయిర్ ఇండియా సంస్థ లొసుగులు, ఇతర అనేక అంశాలపైనా దృష్టించారు.

పైలట్లు ఏమన్నారంటే..

ఈ రెండు వీడియోలను వీక్షించిన పైలట్లు ల్యాండింగ్ గేర్‌పై అనుమానాలు వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇంజన్ల విఫలం, ఇంధనం కల్తీపైనా సందేహాలు వెలిబుచ్చారు. విమానం గగనతలం వైపు ఎగిరిన ఐదు సెకన్లలోనే సాధారణంగా పైలట్ ల్యాండింగ్ గేర్‌ను పైకి ఎత్తుతారని కెప్టెన్ అమిత్ సింగ్ చెప్పారు. గగన తలంలో సానుకూల ఎత్తుకు చేరుకున్న వెంటనే ల్యాండింగ్ గేర్‌ను సాధారణ స్థితికి తీసుకువస్తారని మాజీ కెప్టెన్ మనోజ్ హతీ తెలిపారు. ల్యాండింగ్ గేర్‌ను వెనక్కి తీసుకోవడం వల్ల విమానం పైకి ఎగరడానికి సహాయపడే మృదువైన ఏరోడైనమిక్ ప్రవాహం ఏర్పడుతుందని వివరించారు. "పైలట్లు పరధ్యానంలో ఉంటే.. ఒక్కొక్కసారి గేర్ అప్ చేయడం మరిచిపోవచ్చు. ప్రస్తుతం జరిగిన ఘటనలో రెండు ఇంజన్లు విఫలమైనా అయి ఉండాలి. లేదా పక్షులైనా ఢీకొట్టి ఉండాలి. లేదా రెండూ జరిగి ఉండాలి. ఈ విమానం రన్‌వే చివరకు వచ్చే సరికి శక్తిని కూడగట్టుకోలేక పోయినట్టు తెలుస్తోంది(వీడియోల ఆధారంగా). బహుశ ఇంజన్లలో సమస్యలు వచ్చి ఉంటాయి." అని కెప్టెన్ అమిత్ సింగ్ వివరించారు. "వీడియోలను బట్టి చూస్తే.. విమానం వేగం కోల్పోయినట్టు స్పష్టంగా తెలుస్తోంది. దీనికి ఇంజన్లు విఫలం కావడమే కారణం కావొచ్చు. అదేసమయంలో ఇంధనం కల్తీ మరో కారణమైన ఉండొచ్చు." అని మనో హతీ పేర్కొన్నారు. మరికొందరు సీనియర్ పైలెట్లు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంజన్లు విఫలం కావడం లేదా, ఇంధనం కల్తీ కావడం వల్లే ఈ ఘోరం సంభవించి ఉంటుందని పేర్కొన్నారు. అయితే.. గత ఏడు దశాబ్దాల కాలంలో జరిగిన ఏడు విమాన ప్రమాదాలను విశ్లేషిస్తే ఇంజన్లు విఫలం కావడం అనేది అత్యంత అరుదేనని తెలిపారు. మరోవైపు, డీజీసీఏ ఇచ్చిన ప్రకటనలో రెండు ఇంజన్లు విఫలమయ్యాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే 'మేడే కాల్' వచ్చిందని, నిర్ణీత వేగాన్ని అందుకున్నాక ఇంజన్లలో సమస్య వచ్చి ఉంటుందని పేర్కొంది.

నివేదిక ఎప్పుడు?

వైమానిక నిబంధన 13 ప్రకారం ప్రాథమిక దర్యాప్తు నివేదికను ఘటన జరిగిన నాటి నుంచి 30 రోజుల్లో సిద్ధం చేయాలి. కానీ, అంతర్జాతీయ పౌరవిమానయాన సంస్థ(ఐసీఏవో) మాత్రం ఈ విషయాన్ని ఆయా దేశాలకే వదిలి వేసింది. దర్యాప్తు నివేదికను బహిర్గతం చేయాలా? వద్దా? అనేది కూడా ప్రభుత్వ ఇష్టాన్ని బట్టే ఉంటుంది. అంతేకాదు, తుది నివేదిక ఇచ్చేందుకు ఏడాది పాటు సమయం ఉంటుంది.



మృతదేహాలను పోస్టుమార్టం కోసం తీసుకొచ్చిన సిబ్బంది


అహ్మదాబాద్‌లో ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదన

బ్లాక్ బాక్స్ దొరికింది!

» విమాన ప్రమాద కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం



అహ్మదాబాద్, జూన్13: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం ఎలా జరిగింది? దీనికి కారణాలేంటి? సాంకేతిక వైఫల్యమా? పక్షులు ఢీకొన్నాయా? వంటి అనేక ప్రశ్నలకు సమాధానం చూపే కీలకమైన బ్లాక్‌బాక్స్ ఎట్టకేలకు లభించింది. నారింజ రంగులో దీర్ఘచతురస్రాకృతిలో ఉండే బ్లాక్‌బాక్స్ ద్వారా విమాన ప్రమాదాలకు సంబంధించిన కీలక విషయాలు తెలుస్తాయి. ఏ నిమిషానికి ఏం జరిగిందో దీనిలో నిక్షిప్తమవుతుంది. విచారణాధికారులకు ఇది అత్యంత కీలకం. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐ-171 విమాన ప్రమాదం తర్వాత అందరి దృష్టీ బ్లాక్ బాక్స్‌పైపడింది. దీని కోసం అధికారులు తీవ్రంగా గాలించారు. శుక్రవారం వైద్య విద్యార్థుల హాస్టల్ శిథిలాల్లో పైకప్పు కింద బ్లాక్ బాక్సును గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు గుర్తించారు. ఈ విమానంలో రెండు బ్లాక్ బాక్సులున్నాయి. వీటిలో ఒకటి డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) దొరికిందని డీజీసీఏ అధికారవర్గాలు తెలిపాయి. దీనిలో రికార్డయిన సంభాషణలను విశ్లేషించనున్నట్టు పేర్కొన్నాయి. విమానం టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే 'మేడే కాల్' వ్యవహారం వెలుగుచూడడంతో దానిపై దృష్టి సారించనున్నారు. కాగా బ్లాక్ బాక్స్‌లు క్రాష్ రెసిస్టెంట్‌గా పనిచేస్తాయి. తీవ్ర విపత్తులు, అగ్ని ప్రమాదాలు వంటివి సంభవించినప్పుడు వాటిని గుర్తించేందుకు వీలుగా వీటిని రూపొందిస్తారు. ప్రతి కమర్షియల్ విమానంలోనూ రెండు చొప్పున వీటిని ఏర్పాటు చేస్తారు. ఒక దాన్ని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్(సీవీఆర్)గా, రెండో దాన్ని ఫ్లైట్ డేటా రికార్డర్(ఎఫ్‌డీఆర్)గా పేర్కొంటారు. భూమిపై, నదులు, సముద్రాల్లో విమాన ప్రమాదాలు సంభవించినా బ్లాక్ బాక్స్‌లు సమాచారాన్ని పదిలంగా ఉంచుతాయి. గత 25 గంటల్లో జరిగిన సంభాషణల సమాచారం వీటిలో నిక్షిప్తమౌతుంది. ఈ రెండింటిలోని డేటాను విశ్లేషించడం ద్వారా ప్రమాదానికి ముందు విమానంలో ఏం జరిగింది, పైలట్లు ఏం మాట్లాడారో, వ్యవస్థలెలా పనిచేశాయో దర్యాప్తు అధికారులు తెలుసుకుంటారు. అహ్మదాబాద్‌లో విమానం కూలిన ఘటనలో వెయ్యి డిగ్రీల ఉష్ణోగ్రతతో విస్ఫోటనం జరిగింది. అయినా డీవీఆర్‌తో కూడిన బ్లాక్ బాక్స్ చెక్కు చెదరలేదు.

ఎలా బతికానో నాకే అర్థం కావట్లేదు!

» విమానం కూలగానే నేనూ చనిపోయాననుకున్నా
» విమాన ప్రమాదంలో బతికి బయటపడ్డ రమేశ్ వ్యాఖ్యలు
» రమేశ్‌ను పరామర్శించిన ప్రధాని మోదీ

అహ్మదాబాద్, జూన్ 13: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైన ప్రయాణికుడు విశ్వాస్‌కుమార్ రమేశ్ (45)! తాను బతకడం నిజంగా అద్భుతమేనని రమేశ్ చెప్పారు. ప్రస్తుతం అహ్మదాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం డీడీ న్యూస్‌తో ప్రమాద ఘటన గురించి వివరించారు.


రమేశ్‌ను పరామర్శిస్తున్న ప్రధాని మోదీ

విమానం కూలగానే తాను కూర్చున్న సీటు ఊడి పడిందని, అందువల్లే తాను బతికి బయటపడ్డానని చెప్పారు. విమానంలో ఎడమవైపు ఉన్న తన 11ఏ సీటు అత్యవసర ద్వారానికి సమీపంలో ఉందన్నారు. "అంతా నాకళ్ల ముందే జరిగింది. ఎలా బతికానో నాకే అర్థం కావడం లేదు. విమానం కింద పడగానే నేనూ చనిపోయాననుకున్నా. కళ్లు తెరిచి చూసేసరికి శిథిలాల్లో ఉన్నా. విమానం కూలిన తర్వాత నేను కూర్చున్న భాగం భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయింది. విమానం డోర్ విరిగిపోయి ఉంది. నా సీటు విరిగిపోయి, ఎగిరి పడ్డా. వెంటనే లేచి, శిథిలాల నుంచి నడుచుకుంటూ బయటకు వచ్చా. విమానం కుడివైపు భాగంలో ఉన్నవారికి పక్కనే గోడ ఉండడంతో బయటపడే మార్గం లేకపోయింది. ఎడమవైపు మాత్రం కొంత ఖాళీ ప్రదేశం ఉండడంతో నేను బయటపడగలిగా. నేను బతికానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. నా కళ్ల ముందే ప్రయాణికులు ప్రాణాలొదిలారు. శిథిలాల నుంచి బయటకు వచ్చేటప్పుడు మంటల ధాటికి నా ఎడమ చేతికి గాయమైంది" అని రమేశ్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఆయన శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. అహ్మదాబాద్ సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్‌ను శుక్రవారం ప్రధాని మోదీ పరామర్శించారు. ఆయనకు ప్రాణాపాయంలేదని వైద్యులు తెలిపారు. కాగా బ్రిటన్‌లో నివాసముంటున్న రమేశ్ గుజరాత్‌లోని తన కుటుంబానికి కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగింది. ఆయన ప్రాణాలతో బయటపడడాన్ని ఊహకందని అద్భుతంగానే భావిస్తున్నారు. ఎయిరిండియా విమానంలోని 11ఏ సీటులో రమేశ్ కూర్చున్నారు. ఈ సీటు అత్యవసర ద్వారాల్లో ఒకదానికి దగ్గర్లో ఉండడం కూడా రమేశ్ ఈ ప్రమాదం నుంచి బయటపడడానికి కారణమై ఉంటుందని భావిస్తున్నారు. సీట్ మ్యాప్ ప్రకారం.. బోయింగ్ 787-8 విమానాల్లో ఎకానమీ క్లాస్‌లో మొదటి వరుసలో ఉన్న ఆరు సీట్లలో 11ఏ ఒకటి. అత్యవసరంగా బయటకి వెళ్లే మార్గాల్లో ఒకదానికి దగ్గర్లో ఉన్న కిటికీ సీటు ఇది. కాగా, ప్రస్తుతం ఎయిరిండియా వద్ద 27బోయింగ్787-8 డ్రీమ్‌లైనర్ విమానాలున్నాయి. రానున్న రోజుల్లో ఈ విమానాలన్నింటినీ భద్రతా పరీక్షలకు పంపే అవకాశాలు ఉన్నాయి.

ఈ వినాశనం బాధాకరం

» బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం: నరేంద్ర మోదీ
» అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలించిన ప్రధాని

అహ్మదాబాద్, జూన్ 13: విమాన ప్రమాద స్థలంలో జరిగిన వినాశనం బాధాకరమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ విషాద ఘటనలో తమవారిని కోల్పోయిన బాధితులకు అండగా నిలుస్తామని చెప్పారు. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిపోయిన ప్రాంతాన్ని ప్రధాని శుక్రవారం పరిశీలించారు. పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఆ రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంఘవిలతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. సుమారు 20 నిమిషాలు అక్కడే ఉండి.. ప్రమాద స్థలంలో పరిస్థితి, సహాయక చర్యల వివరాలను తెలుసుకున్నారు. బీజే వైద్య కళాశాల హాస్టల్ భవనంలోకి విమానం దూసుకెళ్లిన తీరును అధికారులు వారికి తెలిపారు. అనంతరం మోదీ నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. విమాన ప్రయాణికుల్లో ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి విశ్వాస్ కుమార్ రమేశ్‌ను, విమానం కూలిన భవనంలో గాయపడి చికిత్స పొందుతున్న 25మంది మెడికోలు, ఇతరులను పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స వివరాలపై ఆరా తీశారు. తర్వాత అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలోని గుజరాత్ సెయిల్ కార్యాలయంలో ఆ రాష్ట్ర అధికారులు, పౌర విమానయాన అధికారులతో ప్రమాద ఘటనపై సమీక్షించారు. సహాయక చర్యల తీరు, మృతదేహాల గుర్తింపు వంటి అంశాలపై ఆరా తీశారు. బాధిత కుటుంబాలకు తగు సహాయసహకారాలు అందించాలని ఆదేశించారు. తర్వాత ప్రధాని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "అహ్మదాబాద్‌లో విమానం కూలిన ప్రాంతాన్ని పరిశీలించాను. అక్కడ జరిగిన వినాశనం బాధాకరం. సహాయక చర్యలుచేపట్టిన అధికారులు, బృందాలతో సమావేశమై పరిస్థితిని తెలుసుకున్నాను. ఈ విషాదకర ఘటనలో తమవారిని కోల్పోయిన బాధితులకు తోడుగా నిలుస్తాం"అని పేర్కొన్నారు.


రూపాణీ కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలుపుతున్న మోదీ

విజయ్‌భాయ్ ఇకలేరని నమ్మలేకపోతున్నా..

విమాన ప్రమాదంలో కన్నుమూసిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ కుటుంబసభ్యులను ప్రధాని మోదీ పరామర్శించారు. అహ్మదాబాద్‌లోని విజయ్ రూపాణీ నివాసానికి వెళ్లి.. ఆయన భార్య అంజలి, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. "విజయ్ భాయ్‌తో ఎన్నో ఏళ్లుగా కలిసి పనిచేశాను. గుజరాత్ అభివృద్ధి కోసం ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన ఇక లేరన్న విషయాన్ని నేను నమ్మలేకపోతున్నాను" అని ప్రధాని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. విమానం కుప్పకూలిన ఘటనలో మరణించిన వారి కుటుంబసభ్యులు, బంధువుల కోసం ఎయిరిండియా శుక్రవారం 4 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అహ్మదాబాద్, ముంబై, ఢిల్లీ, లండన్‌లోని గట్విక్ ఎయిర్‌పోర్టులలో ఈ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశామని.. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అహ్మదాబాద్‌కు చేరుకునేందుకు అవసరమైన సహకారం అందిస్తాయని ప్రకటించింది.

పరిమళించిన మానవత్వం

200 మంది వలంటీర్లు..900 యూనిట్ల రక్త దానం

విమాన ప్రమాద బాధితులను ఆదుకునేందుకు క్యూకట్టిన వైనం

అహ్మదాబాద్, జూన్ 13: మానవత్వం పరిమళించే మంచి మనిషులు క్యూ కట్టారు. అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటనలో గాయపడిన వారికి రక్తదానం చేసేందుకు వందల సంఖ్యలో కదలివచ్చారు. గంటల వ్యవధిలోనే రక్త దానం చేస్తామంటూ.. వందల కొద్దీ పౌరులు మానవత్వాన్ని చాటుకున్నారు. స్వచ్ఛంద సంస్థ 'సహాయ్' నేతృత్వంలో రెడ్ క్రాస్ అహ్మదాబాద్ చాప్టర్ ప్రారంభించిన రక్త దాన శిబిరానికి 200మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 900యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ శిబిరం శుక్రవారం కూడా కొనసాగింది. "ప్రమాదం జరిగిన గంట వ్యవధిలోనే బాధితులకు రక్త దానం చేసి వారి ప్రాణాలను నిలపాలని తలపోశాం. ఆ వెంటనే రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని సంప్రదించాం. బీజే మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఓ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మేం ఊహించనంతగా స్పందన వచ్చింది. రక్త దానం చేస్తామంటూ 200మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. విమాన ప్రమాద ఘటనలో బాధితులకు ప్రాణం నిలపాలన్న ఆతృతే వారిలో కనిపించింది. గురువారం రాత్రి 11గంటల వరకు 900 యూనిట్ల రక్తాన్ని సేకరించాం"అని 'సహాయ్' సభ్యుడు సాగర్ తెలిపారు.

కూతురు ఇంటికి పిలిచిందని...

గుజరాత్, ఆనంద్ జిల్లాలోని ఖంబాట్‌కు చెందిన హేమంత్ పాండ్యా(52), నేహాబెన్ పాండ్యా(48) దంపతులకు ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. వారి కుమార్తె పెళ్లి చేసుకుని భర్తతో కలిసి లండన్‌లో నివాసముంటోంది. కూతురి ఆహ్వానంతో లండన్ బయలుదేరిన పాండ్యా దంపతులు విమానం ఎక్కిన వెంటనే సెల్ఫీ తీసుకున్నారు. కానీ వారికిదే చివరి ఫొటో, ఆఖరి ప్రయాణమైంది.


హేమంత్ , నేహాబెన్

లండన్ చేరగానే ఫోన్ చేస్తా నాన్నా..!!

ఫ్లైట్ బయలుదేరే టైమైంది. లండన్ చేరగానే ఫోన్ చేస్తా నాన్నా.. అహ్మదాబాద్‌లో కూలిన ఎయిరిండియా విమానంలోని ఎయిర్ హోస్టెస్‌లో ఒకరైన మిథాలీ పాటిల్ (23) తన తండ్రి మోరేశ్వర్ పాటిల్‌తో చివరిగా ఫోన్‌లో మాట్లాడిన మాటలివి. రెండేళ్లుగా ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తున్న మిథాలీ జీవిత ప్రయాణం హఠాత్తుగా ముగియగా.. ఆమె కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

ట్రావెలింగ్ సరదా ప్రాణాలు తీసింది

వడోదరకు చెందిన నీరజ్ లవానియా(50) అపర్ణ(49) దంపతులకు ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. ప్రతీ ఏటా ఏదో ఒక కొత్త ప్రాంతానికి వెళ్లేవారు. ఎప్పటికైనా లండన్ చూడాలన్న వారి కోరిక తీర్చుకునేందుకు అహ్మదాబాద్‌లో గురువారం ఎంతో ఉత్సాహంగా విమానం ఎక్కారు. విమానం ఎక్కే ముందు నీరజ్ చివరిగా తన సోదరుడు సతీష్‌కు ఫోన్ చేసి తన లండన్ ప్రయాణం కోసం చెప్పాడు. ఆ తర్వాత కాసేపటికే ఆ దంపతులు చనిపోయారు. నీరజ్ దంపతుల ఏకైక కుమార్తె(16) కూడా తల్లిదండ్రులతో కలిసి వెళ్లాల్సిందే. కానీ అమ్మమ్మ(70)కు తోడుగా ఇంట్లో ఉండిపోయింది.

మరిది పెళ్లికి వచ్చి ..

వడోదరకు చెందిన సాధిక బాను(23) తన భర్త, కుమార్తె ఫాతిమా(2)తో కలిసి కొంత కాలంగా లండన్‌లో నివాసముంటోంది. మే 16న జరిగిన తన మరిది వివాహం కోసం కూతురు ఫాతిమాను తీసుకుని సాధిక ఇటీవల వడోదర వచ్చింది. వేడుకల తర్వాత లండన్‌కు తిరుగు ప్రయాణమైన సాధిక, ఫాతిమాకు కుటుంబసభ్యులు విమానాశ్రయానికి వచ్చి సాగనంపారు. కానీ వారికి అదే చివరి చూపు అయింది. ప్రమాదంలో సాధిక, చిన్నారి ఫాతిమా మరణించారు.


ఫాతిమా, సాధిక భాను

టాటా గ్రూప్ చరిత్రలో అత్యంత చీకటి రోజు

» ఉద్యోగులకు చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ లేఖ



అహ్మదాబాద్, జూన్ 13: టాటా గ్రూప్ చరిత్రలో అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిన జూన్ 12 అత్యంత చీకటి రోజని ఆ సంస్థ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ చెప్పారు. ఈ మేరకు ఆయన టాటా గ్రూప్ సంస్థ ఉద్యోగులకు లేఖ రాశారు. ఘటనతో షాక్‌కు గురయ్యామని, విషాదంలో మునిగిపోయామన్నారు. ఒకరిని కోల్పోతేనే ఎంతో బాధ ఉంటుందని ఒకేసారి ఇంతమంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యూకే, అమెరికా నుంచి అహ్మదాబాద్‌కు దర్యాప్తు బృందాలు చేరుకున్నాయని ఆయన తెలిపారు. దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందని, సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. వాస్తవాలు బయటకు వస్తేనే ఘటన ఎలా జరిగిందో తెలుస్తుందన్నారు. ప్రయాణికుల భద్రతే తొలి లక్ష్యంగా ఎయిర్ ఇండియా సంస్థను చేపట్టామని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

మంటల్లోనూ చెక్కు చెదరని 'భగవద్గీత'

అహ్మదాబాద్, జూన్ 13: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో ప్రయాణికులు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయారు. విమానంలోని 1.25 లక్షల లీటర్ల ఇంధనం కారణంగా మంటలు వ్యాపించి అందులోని భాగాలే కరిగిపోయాయి. ఆశ్చర్యకరంగా ఆ విమాన శకలాల్లో చెక్కు చెదరని రీతిలో ఉన్న పవిత్ర గ్రంథం భగవద్గీత సహాయ సిబ్బందికి లభించింది. అట్ట మీద కొన్ని గీతలు పడడం తప్పిస్తే పుస్తకం అంతా భద్రంగానే ఉంది. ఇస్కాన్ వ్యవస్థాపకుడు స్వామి ప్రభుపాద చిత్రం సహా ఏ ఫొటో కూడా దెబ్బతినలేదు. ఒక్కచోట ఓ పేజీ మాసినట్టు కనిపించినా గ్రంథం మొత్తం బాగానే ఉంది. బహుశా ఆ సమయంలో ఏ ప్రయాణికుడైనా ఆ గ్రంథాన్ని చదువుతూ ఉండవచ్చని భావిస్తున్నారు. మంటలు వ్యాపించినా ఆ పవిత్ర గ్రంథం ఏ మాత్రం దెబ్బతినకుండా కనిపించిందని సహాయ చర్యల్లో పాల్గొన్న సిబ్బంది తెలిపారు.

మెట్ల గుండా దిగి.. ప్రాణాలు కాపాడుకొని..

» అహ్మదాబాద్ దుర్ఘటనలో చెన్నై విద్యార్థికి తప్పిన ప్రమాదం

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో గురువారం ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటన యావత్ భారతాన్ని షాక్‌కు గురిచేసింది. విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే దగ్గరలోని మెడికల్ కాలేజీ హాస్టల్‌పై కూలిపోయింది. అయితే ఈ మెడికల్ కాలేజీ హాస్టల్‌లో బసచేస్తున్న చెన్నైకి చెందిన అరుణ్ ప్రసాద్ అనే విద్యార్థి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. అరుణ్ ప్రసాద్ అహ్మదాబాద్‌లోని బీజే మెడికల్ కాలేజీలో పోస్టుగ్రాడ్యుయేట్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. విమానం కూలిన సమయంలో హాస్టల్ భవనం ఐదో అంతస్తులో ఉన్న మెస్‌లో అరుణ్‌ప్రసాద్ భోజనం చేస్తున్నాడు. చెవులు పిక్కటిల్లేలా శబ్దం రావడంతో భయంతో ఆ భవనం నుంచి మెట్ల గుండా కిందకు పరుగెత్తి ప్రాణాలు దక్కించుకున్నానని అరుణ్‌ప్రసాద్ పేర్కొన్నాడు.

మెట్రోరైలు మార్గంలో కూలి పడిన కాంక్రీట్ గడ్డర్

అటుగా వెళుతున్న మోటార్ సైక్లిస్ట్ మృతి

» నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశంలో ఘటన

చెన్నై, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైలు మార్గం నిర్మాణ పనుల్లో భాగంగా రెండు స్తంభాల నడుమ బిగిస్తున్న 40 అడుగుల పొడవైన సిమెంట్ కాంక్రీట్ గడ్డర్ కూలిపడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. చెన్నై నగరంలో మూడు మార్గాల్లో మెట్రోరైల్ 2వ విడత పనులు జరుగుతున్నాయి. వీటిలో మాధవరం-చోళింగనల్లూరు మధ్య 44.6 కి.మీ మేర రైలు మార్గం నిర్మిస్తున్నారు. పోరూరు నుంచి నందంబాక్కం ట్రేడ్ సెంటర్ దాకా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి పొద్దుపోయాక రామాపురం వద్ద డీఎల్ఎఫ్-ఎల్ అండ్ టి నడుమ స్తంభాలపై నిర్మించిన రైలుమార్గం నుంచి హఠాత్తుగా సిమెంట్ కాంక్రీట్ గడ్డర్ కూలిపడింది. ఆ సమయంలో అటుగా మోటారు సైకిల్‌పై వెళుతున్న రమేష్ (42) అనే వ్యక్తిపై ఆ గడ్డర్ పడడంతో అతను దుర్మరణం పాలయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో స్తంభించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుడి కుటుంబానికి ఎల్ అండ్ టీ సంస్థ రూ.20 లక్షలు, చెన్నై మెట్రోరైల్ సంస్థ రూ. 5లక్షలు ఆర్థిక సాయం ప్రకటించాయి

30 రోజుల్లోనే ప్రీపెయిడ్-పోస్టు పెయిడ్ మార్పిడి

న్యూఢిల్లీ, జూన్ 13: మొబైల్ ఫోన్ వినియోగదారులకు మరింత వెసులుబాటు కల్పించేలా టెలికమ్యూనికేషన్ల విభాగం కీలక నిర్ణయం తీసుకొంది. ప్రీపెయిడ్ ప్లాన్..పోస్టు పెయిడ్ ప్లాన్‌ల మధ్య మార్పిడిని సులభతరం చేసింది. ప్లాన్ మార్పిడికి ఉద్దేశించిన నిరీక్షణ సమయాన్ని భారీగా తగ్గించింది. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు మారడం ఇక సులువు కానుంది. ఇంతవరకు ప్లాన్ మార్పిడికి 90 రోజుల పాటు వేచి ఉండాల్సి వచ్చేది. దానిని 30 రోజులకు తగ్గించింది. ఓటీపీ ద్వారా కేవైసీ వెరిఫికేషన్ చేయించుకొని ప్లాన్‌ను మార్చుకోవచ్చు. బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ వినియోగదారులకు ఇది వర్తిస్తుంది. ప్లాన్ మార్చుకోవాలనుకునే వారు తొలుత సంబంధిత టెలికాం కంపెనీ ఔట్‌లెట్‌కు వెళ్లి ఓటీపీ ద్వారా కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ మళ్లీ పాత ప్లాన్‌కు రావాలనుకుంటే మాత్రం 90 రోజుల పాటు వేచిచూడడం తప్పనిసరి. తొలిసారిగా ప్లాన్ మార్చాలనుకునే వారికే 30 రోజుల సమయం వర్తిస్తుంది. అప్పుడు కూడా మళ్లీ కేవైసీని చేయించాల్సి ఉంటుంది. బిల్లింగ్‌లో ఇబ్బందులు లేకుండా ఉండేందుకే రెండోసారి మార్పిడికి మళ్లీ 90 రోజుల గడువును పెట్టింది.

ఢిల్లీ యూనివర్సిటీలో 'ధర్మశాస్త్ర స్టడీస్' కోర్సు

న్యూఢిల్లీ, జూన్ 13: ఢిల్లీ యూనివర్సిటీ 'ధర్మశాస్త్ర స్టడీస్' పేరిట కొత్త కోర్సును ప్రారంభించింది. ఈ కోర్సులో భాగంగా వర్ణ, కుల వ్యవస్థ సమాజంపై ఎలాంటి ప్రభావం చూపిస్తోందో విద్యార్థులకు బోధిస్తారు. నాగరిక సమాజాన్ని నిర్మించడంలో వివాహం పాత్ర, వ్యక్తిగత ప్రవర్తనను నైతికత ఎలా నియంత్రిస్తుందనే అంశాలతో పాటు రామాయణం, మహాభారతం, పురాణాలు వంటి హిందూ మత గ్రంథాలను సిలబస్‌లో చేర్చారు. ప్రాచీన భారతదేశంలో న్యాయ వ్యవస్థలు, ప్రాయశ్చిత్తం, తపస్సు మొదలైన వాటిని వివరించే ధర్మ భావన, ధర్మ శాస్త్రం, వ్యవహారం, రాజకీయాలు అనే నాలుగు సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తారు. ఆపస్తంభ ధర్మసూత్రాలు, బౌద్ధాయన ధర్మసూత్రాలు, వశిష్ట ధర్మసూత్రాలు, యాజ్ఞవల్క్య స్మృతి, నారద స్మృతితో పాటు కౌటిల్యుడి అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ప్రవేశపెట్టిన ఈ కోర్సులో సంస్కృతంలో పరిజ్ఞానం ఉన్న యూజీ విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఇందులో మనుస్మృతిని పాఠ్యాంశంగా చేర్చినప్పటికీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది నుంచి విమర్శలు రావడంతో దాన్ని సిలబస్ నుంచి తొలగించినట్లు వర్సిటీ ప్రకటించింది. భవిష్యత్తులో సైతం డీయూ అందించే ఏ కోర్సులోనూ మనుస్మృతిని బోధించబోమని స్పష్టం చేసింది.

భారత్-చైనా మధ్య మళ్లీ నేరుగా విమానాలు

» రెండు దేశాల మధ్య కొనసాగుతోన్న చర్చలు

న్యూఢిల్లీ, జూన్ 13: ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్-చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులను మళ్లీ నడిపే విషయంపై అంగీకారం కుదిరింది. వీసాలు, విమాన సర్వీసుల ప్రారంభ తేదీ తదితర అంశాలపై త్వరలో స్పష్టత రానుంది. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలైన సందర్భంగా చైనా విదేశాంగ శాఖ ఉప మంత్రి సన్ వైడోంగ్ భారత్‌లో పర్యటిస్తున్న సందర్భంగా పలు అంశాలు చర్చకు వచ్చాయి. వైడోంగ్‌తో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సమావేశమై చర్చలు జరిపారు. జనవరి 27న బీజింగ్ సమావేశంలో చర్చించిన అంశాలపై సమీక్షించారు. ఈ ఏడాది కైలాస్ మానస్ సరోవర్ యాత్రలో చైనా అందిస్తున్న సహకారానికి మిస్రీ ధన్యవాదాలు తెలిపారు. సరిహద్దుల్లో ప్రవహించే నదులకు సంబంధించి రెండు దేశాల మధ్య సమాచార మార్పిడి జరగాలని కూడా నిర్ణయించారు. 2020లో గల్వాన్ లోయలో జరిగిన సైనిక ఘర్షణలతో భారత్-చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పుడే రెండు దేశాల మధ్య నేరుగా నడిపే విమాన సర్వీసులను రద్దు చేశారు. చైనాకు సంబంధించిన పలు యాప్‌లను భారత్ నిషేధించింది.

బోయింగ్‌ల కుదింపు?

ఎయిరిండియాలో వాటి సేవలపై కేంద్రం యోచన

» తొలుత సాంకేతిక తనిఖీలకు ఆదేశం

» రేపటి నుంచే సోదాలు చేయాలని నిర్దేశం

» దేశంలోని అన్ని విమానయాన సంస్థల్లో కలిపి మొత్తం 209 బోయింగ్‌లు

» ఒక్క ఎయిరిండియా వద్దే 135



న్యూఢిల్లీ, జూన్ 13: ఎయిరిండియా వద్ద ఉన్న బోయింగ్ విమానాల సంఖ్యను కుదించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలిసింది. అహ్మదాబాద్‌లో గురువారం బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానం కూలిన ఘోర దుర్ఘటన తర్వాత సదరు ఫ్లైట్లలో సాంకేతిక లోపాలపై విస్తృతంగా చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో అమెరికాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానాల సేవల తగ్గింపుపై కేంద్రం దృష్టి సారించింది. ఈ సంస్థ విమానాలన్నిటినీ భద్రతాపరంగా సమీక్షించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఇప్పటికే భారత, అమెరికా సంస్థల మధ్య చర్చలు నడుస్తున్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదం దర్యాప్తు ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటామని డీజీసీఏ వర్గాలు తెలిపాయి. అటు విమానాల నిర్వహణలో ప్రామాణిక ఆపరేటింగ్ ప్రక్రియను ఎయిరిండియా అనుసరిస్తున్నదీ లేనిదీ కూడా పరిశీలించనున్నట్లు పేర్కొన్నాయి. దానికి ముందుగా బోయింగ్ విమానాలన్నిటినీ ఒకసారి సాంకేతికంగా తనిఖీ చేయాలని డీజీసీఏ శుక్రవారం ఆదేశించింది. ప్రమాదాలను నివారించేందుకు జెన్ఎక్స్ ఇంజన్లు కలిగిన బోయింగ్ బీ787-8/9 విమానాల నిర్వహణకు సంబంధించి తక్షణమే అదనపు తనిఖీలు చేపట్టాలని అధికారిక ప్రకటనలో పేర్కొంది. 'ఆదివారం నుంచి ప్రతి బోయింగ్ ఫ్లైట్ బయల్దేరబోయే ముందు అన్నీ ఒకసారి కూలంకషంగా తనిఖీ చేయాలి. ఇంధన పారామీటర్ మానిటరింగ్, దాని అనుబంధ వ్యవస్థలను.. క్యాబిన్ ఎయిర్ కంప్రెషర్, అనుబంధ వ్యవస్థలను పరిశీలించాలి. ఎలక్ట్రానిక్ ఇంజన్ కంట్రోల్-సిస్టమ్ టెస్ట్, ఇంజన్ ఫ్యుయెల్ డ్రివెన్ యాక్చురేటర్-ఆపరేషన్ టెస్ట్ చేపట్టాలి. హైడ్రాలిక్ సిస్టమ్ సామర్థ్యాన్ని తనిఖీ చేయాలి.

టేకాఫ్ పారామీటర్లను సమీక్షించాలి. తదుపరి ఆదేశాలు వెలువడేదాకా ఫ్లైట్ కంట్రోల్ తనిఖీలు చేపట్టాలి. గత 15 రోజుల్లో బీ787-8/9 విమానాల్లో తరచూ తలెత్తిన లోపాలను సమీక్షించాలి. సోదాల నివేదికను డీజీసీఏకి సమర్పించాలి' అని ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా, భారత విమానయాన సంస్థలు బోయింగ్ విమానాలనే ఎక్కువగా నడుపుతున్నాయి. అన్ని విమానయాన సంస్థల వద్ద మొత్తం వివిధ రకాల బోయింగ్‌లు 209 వరకు ఉన్నాయి. వీటిలో 139 ఒక్క ఎయిరిండియా వద్దే ఉన్నాయి.

కొనుగోలు ఆర్డర్ల కుదింపు?

వాస్తవానికి విమానాల సరఫరాకు బోయింగ్ పలు సంస్థలు, దేశాలతో ఒప్పందం చేసుకుంటున్నా.. వాషింగ్టన్, ఒరెగాన్ ప్లాంట్లలో సమ్మెలు, ఇతర సమస్యల కారణంగా సకాలంలో ఇవ్వలేకపోతోంది. ఈ కారణంగా కొనుగోలు సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చాలా విమానయాన సంస్థలు తమ తమ ఆర్డర్లను కుదించుకుని ఇతర విమాన తయారీ కంపెనీల వైపు చూస్తున్నాయని అంటున్నారు. మొత్తం కొత్త విమానాలనే నడపాలన్న ఉద్దేశంతో ఎయిరిండియా 2023లో 220 జెట్ల కోసం బోయింగ్‌కు ఆర్డర్లు ఇచ్చింది. ఇవి గాక అదనంగా 50 మ్యాక్స్ (737), 20 డ్రీమ్‌లైనర్లు (787) విమానాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తూ సంతకాలు కూడా చేసింది. అలాగే 200 సింగిల్ ఐసిల్ జెట్ల కోసం ఎయిర్‌బస్, బోయింగ్‌లతో చర్చలు జరుపుతోంది. ఇండిగో 900 విమానాల కోసం ఎయిర్‌బస్‌కు ఆర్డర్లు ఇచ్చింది. మూడేళ్ల కిందట కార్యకలాపాలు మొదలుపెట్టిన ఆకాశ్ ఎయిర్ కూడా 226 బోయింగ్ 737 మ్యాక్స్ జెట్ల కోసం ఆర్డర్ ఇచ్చింది. అయితే బోయింగ్ ఒక్క విమానం కూడా సరఫరా చేయలేదు. ఇప్పుడు అహ్మదాబాద్ ప్రమాదం కారణంగా బోయింగ్ విమానాలను భద్రతాపరంగా స్క్రుటినీ చేస్తున్న నేపథ్యంలో సరఫరాలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1,148 డ్రీమ్‌లైనర్లు ఉన్నాయి.

బాంబు బెదిరింపుతో ఎయిర్ ఇండియా విమానం అత్యవసర ల్యాండింగ్

ముంబయి, జూన్ 13 : థాయిలాండ్‌లోని పుకెట్ నుంచి శుక్రవారం ఉదయం ఢిల్లీ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో తిరిగి పుకెట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. 156 మంది ప్రయాణికులతో పుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శుక్రవారం ఉదయం 9.30(స్థానిక కాలమానం ప్రకారం)కు ఢిల్లీ బయలుదేరిన ఏఐ 379 విమానం అండమాన్ సముద్రం పైకి చేరుకున్నాక బాంబు బెదిరింపు రావడంతో వెనుదిరిగి పుకెట్ విమానాశ్రయంలో దిగింది. విమానంలోని 156 మంది ప్రయాణికులను సురక్షితంగా దించి పూర్తిస్థాయిలో తనిఖీలు చేసినట్లు థాయిలాండ్ విమానాశ్రయాల అధికారి ఒకరు తెలిపారు. లైవ్ ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్24లో ఈ విమానం మధ్యలోనే వెనుదిరగడం కనిపించింది.

రూ.1,000 కోట్లకు పైగా బీమా క్లెయిమ్‌లకు చాన్స్

» దేశీయ విమానయాన రంగంలో ఇదే అతిపెద్ద బీమా చెల్లింపు

న్యూఢిల్లీ, జూన్ 13: అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయిన ఘటనలో 240మందికి పైగా మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటన రూ.1,000 కోట్లకు పైగా బీమా క్లెయిమ్‌లకు దారితీయవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఇది ఇప్పటి వరకు దేశంలోనే అతిపెద్ద ఏవియేషన్ బీమా చెల్లింపుగా మారనుందంటున్నారు. దేశంలోని వైమానిక బీమా రంగం నుంచి వసూలైన మొత్తం వార్షిక ప్రీమియం కన్నా ఈ బీమా క్లెయిమ్‌లు ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఇక 1999లో కుదిరిన మాంట్రియల్ కన్వెన్షన్ ప్రకారం విమాన ప్రమాదాల్లో చనిపోయిన ప్రయాణికులకు స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్) ఆధారంగా విమానయాన సంస్థలు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌డీఆర్ ప్రకారం.. ఒక్కో ప్రయాణికుడికి 1,71,000 డాలర్ల (సుమారు రూ.1.47 కోట్లు) పరిహారం అందనుంది. విమాన ప్రమాదంలో మరణించిన వారికి సంబంధించిన క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియలో సడలింపులు ఇచ్చినట్టు ఎల్ఐసీ వెల్లడించింది. మరణ ధ్రువీకరణ పత్రాలకు బదులుగా విమాన ప్రమాదంలో పాలసీదారుడు మరణించినట్టు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ఏదైనా ఆధారం లేదా కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/విమానయాన సంస్థలు చెల్లించిన పరిహారాన్ని మరణ ధ్రువీకరణగా అంగీకరించనున్నట్టు తెలిపింది.



విమాన ప్రమాద మృతులకు... 'బ్లాక్ రిబ్బన్'తో గూగుల్ సంతాపం

న్యూఢిల్లీ, జూన్ 13: అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధితులకు గూగుల్ సంస్థ సంతాపం తెలిపింది. సెర్చ్ బార్ కింద సంతాప సూచకంగా 'బ్లాక్ రిబ్బన్'ను పెట్టింది. మౌస్‌తో క్లిక్ చేయగానే 'విషాదకర విమాన ప్రమాద బాధితుల జ్ఞాపకార్థంగా..' అన్న మెసేజ్‌ను పెట్టింది.

శవజాగారం!



» అహ్మదాబాద్ ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల పడిగాపులు

» ఇప్పటిదాకా 7 మృతదేహాలు మాత్రమే గుర్తింపు.. అందజేత

న్యూఢిల్లీ, జూన్ 13: అది అహ్మదాబాద్‌లోని బీజే మెడికల్ కాలేజీ! విమాన ప్రమాదంలో మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ టెస్టు నిర్వహిస్తున్నారక్కడ! అహ్మదాబాద్‌కే చెందిన కామిని అనే మహిళ విమాన ప్రమాదంలో మృతిచెందింది. మృతురాలి భర్తను వెంటబెట్టుకొని, ఆమె మరదలు సోనాల్ జోషి, బిగ్గరగా రోదిస్తూ మెడికల్ కాలేజీకి వచ్చింది. ఆకుపచ్చ రంగు పట్టుచీరలో ఉన్న కామిని ఫొటోను పట్టుకొని తిరుగుతోంది. మృతురాలు తన వదిన అని.. ఫొటోలోని రుద్రాక్ష లాకెట్‌ను చూపిస్తూ ఆ ఆనవాలు మృతదేహం గుర్తింపులో సాయపడగలదేమో చూడండంటూ సిబ్బందిని వేడుకుంటోంది. మనసును కదిలించే ఇలాంటి దృశ్యాలెన్నో కనిపిస్తున్నాయి. తమ ప్రాణప్రాదమైన వారు విమాన ప్రమాదంలో మృతిచెందారనే బాధపడుతున్నవారికి మృతదేహాల అప్పగింతలో తీవ్ర జాప్యం జరుగుతుండటం మరింత బాధ కలిగిస్తోంది. విమాన ప్రమాదంలో 241 మంది చనిపోగా.. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను మాత్రమే గుర్తించి.. కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ టెస్టు అనివార్యంగా మారింది. ఇందుకు కుటుంబసభ్యులు తమ రక్తనమూనాలను ఇస్తున్నారు. రక్తనమూనాలు ఇచ్చేందుకు క్యూలో 8నెలల బాలుడు కూడా ఉన్నాడు. ఆ శిశువు తండ్రి మహ్మద్ అద్నాన్ విమాన ప్రమాదంలో చనిపోయాడు. జూన్ 6న ఈద్ అల్-అధా కోసం అద్నాన్, ఆయన భార్య మంతషా, కుమారుడు ఇబ్రహీం లండన్ నుంచి భారత్ కొచ్చారు. తర్వాత.. భార్య, కుమారుడిని ఇక్కడే ఉంచేసి, అద్నాన్ ఒక్కడే లండన్‌కు బయలుదేరి మృత్యువాతపడ్డాడు. అద్నాన్ కుటుంబం నుంచి ఎవ్వరూ అహ్మదాబాద్‌లో అందుబాటులో లేకపోవడంతో ఎనిమిది నెలల కుమారుడైన ఇబ్రహీం రక్త నమూనాలను ఇవ్వాల్సి వస్తోంది అని ఆయన బావ నబీల్ చెప్పాడు. కాగా రక్తనమూనాలు ఇచ్చాక రిపోర్టు కోసం కనీసం 72గంటలు పడుతుండటంతో బాధిత కుటుంబసభ్యులకు నిరీక్షణ తప్పడం లేదు. భారీ సంఖ్యలో బాధితులు కారిడార్లలో వేచి ఉన్నారు. మరోవైపు.. మృతదేహాల్లో 135 మృతదేహాల దంత నమూనాలను సేకరించామని అక్కడి ఫోరెన్సిక్ దంతవైద్యుడు జైశంకర్ చెప్పారు.

యాడ్‌లాగే ఆ ప్రమాదం!

గుజరాత్ విమాన దుర్ఘటనలో ఆసక్తికర కోణం

» అదే రోజు ఉదయం ఓ పత్రికలో.. భవనం నుంచి విమానం బయటకొస్తున్నట్లు యాడ్

» విమానం మీద ఎయిరిండియా లోగో

» మధ్యాహ్నం అదే తరహాలో ప్రమాదం





మిడ్ డేలో కిడ్‌జానియా ప్రకటన; అహ్మదాబాద్ విమాన దుర్ఘటన దృశ్యం

న్యూఢిల్లీ, జూన్ 13: ఊహాప్రపంచం.. కళ్ల ఎదుట వాస్తవమై నిలిస్తే ఎలా ఉంటుంది? సాధారణంగా, కళా ప్రపంచంలో ఈ మాటలు వింటూ ఉంటాం. కానీ, ఓ కఠిన వాస్తవానికి, ఓ ఘోర విపత్తుకు ఆ ఊహాప్రపంచం అద్దం పడితే?.. గుజరాత్‌వాసులది ఇదే పరిస్థితి. గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన దారుణ విమాన ప్రమాదం గురించి తెలియగానే.. వారికి అదే రోజు ఉదయం చూసిన ఓ న్యూస్‌పేపర్ యాడ్ గుర్తుకొచ్చింది. గుజరాత్‌లో బహుళ ప్రజాదరణ ఉన్న మిడ్ డేలో గురువారం ఉదయం ఓ ప్రకటన ప్రచురించారు. 'ఫాదర్స్ డే'ను పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకూ కిడ్‌జానియా అనే చిల్డ్రన్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించే గేమ్స్ గురించి ఈ ప్రకటన. దీంట్లో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఓ భవనంలోంచి ఎయిర్ ఇండియా విమానం బయటకు వస్తున్నట్లుగా ఉంటుంది. కిడ్‌జానియాలో పిల్లలు.. ఏవియేషన్ థీమ్‌తో కూడిన గేమ్స్‌లో పైలట్లుగా ఆడుకోవచ్చు అని చెప్పటానికి సంకేతంగా ఈ యాడ్‌ను ఇలా రూపొందించారు. పొద్దున పేపర్ మొదటి పేజీలో కిడ్‌జానియా ప్రకటన చూసిన గుజరాతీలు.. మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో సరిగ్గా అదే విధంగా ఎయిరిండియా విమానం కూలిపోయి, ఓ భవనంలోంచి దాని శకలం దూసుకెళ్లటం చూసి షాకయ్యారు. సోషల్ మీడియాలో కూడా పలువురు స్పందిస్తూ.. మిడ్‌డే యాడ్‌ను, విమాన దుర్ఘటన ఫొటోలను కలిపి షేర్ చేశారు. కాగా, విమాన ప్రమాదం యాదృచ్ఛికమేనని కిడ్‌జానియా తాలూకు యాడ్ సంస్థ పేర్కొంది. జరిగిన ఘటనపై కిడ్‌జానియా ఒక ప్రకటన విడుదల చేసింది. 'పిల్లలకు విమానయానం, ఎయిర్‌పోర్టుల పనితీరు గురించి ప్రాథమిక అవగాహన కలిగించే మా ఏవియేషన్ అకాడమీ కోసం ఈ యాడ్‌ను రూపొందించాం. భారత్‌లో ఎయిరిండియాతో ఒప్పందం ఉంది. అందువల్లే ఆ యాడ్‌లో ఆ కంపెనీ లోగో వాడాం. చాలా రోజుల కిందటే ఈ యాడ్ తయారైంది. విమాన ప్రమాదం నేపథ్యంలో, ఈ యాడ్‌ను ప్రస్తుతానికి నిలిపివేస్తున్నాం' అని పేర్కొంది.

గగన విషాదాలు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన దారుణ విషాద విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశంలో ఇప్పటి వరకూ విమాన ప్రమాదాల్లో చనిపోయిన ప్రముఖులు ఎవరన్నది ఒకసారి పరిశీలిద్దాం.

హోమీ బాబా 1966

దేశం గర్వించదగ్గ ప్రముఖ అణు శాస్త్రవేత్త హోమీ జహంగీర్ బాబా. ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా 101 విమానం జెనీవా ఏటీసీతో ఏర్పడిన సమాచార లోపంతో స్విస్ ఆల్ప్స్ పర్వతశ్రేణిలోని బ్లాంక్ కొండను ఢీకొట్టింది. 1966 జనవరి 24న జరిగిన ఆ ప్రమాదంలో హోమీ బాబా దుర్మరణం పాలయ్యారు.

సంజయ్ గాంధీ 1980

దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పెద్ద కుమారుడు, కాంగ్రెస్ పార్టీ నేత సంజయ్ గాంధీ 1980 జూన్ 23న జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందారు. ఢిల్లీ ఫ్లైయింగ్ క్లబ్‌కు చెందిన విమానంలో వైమానిక విన్యాసాలు చేస్తున్న క్రమంలో పట్టుకోల్పోయి సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం సమీపంలో ఆయన నడుపుతున్న విమానం కుప్పకూలింది.

మాధవరావ్ సింధియా 2001

పౌర విమానయాన శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాధవరావు సింధియా కూడా విమాన ప్రమాదంలోనే మృతి చెందారు. కాన్పూర్‌లో జరుగుతున్న రాజకీయ సభలో పాల్గొనడానికి 10 సీట్ల ప్రైవేటు విమానంలో బయలుదేరారు. అననుకూల వాతావరణ పరిస్థితుల్లో ఆ విమానం ఉత్తరప్రదేశ్‌లోని మణిపురి వద్ద 2001, సెప్టెంబరు 30న కూలిపోయింది.

జీఎంసీ బాలయోగి 2002

తెలుగుదేశం పార్టీ నేత, లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. 2002, మార్చి 3న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సభలో పాల్గొని ఓ ప్రైవేటు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రమాదవశాత్తు కృష్ణా జిల్లా కైకలూరులోని ఓ చెరువులో కుప్పకూలింది.

ఓపీ జిందాల్, సురేందర్ సింగ్ 2005

పారిశ్రామికవేత్త, హరియాణా మంత్రి ఓమ్ ప్రకాశ్ జిందాల్, వ్యవసాయ మంత్రి సురేందర్ సింగ్ హెలికాప్టర్‌లో ఢిల్లీ నుంచి చండీగఢ్ బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ యూపీలోని సహరన్‌పూర్ సమీపంలో ప్రమాదానికి గురయింది. 2005లో జరిగిన ఈ ప్రమాదంలో మంత్రులిద్దరూ దుర్మరణం పాలయ్యారు.

సినీనటి సౌందర్య 2004



ప్రముఖ సినీనటి సౌందర్య (కేఎస్ సౌమ్య) ఒక రాజకీయ సభలో పాల్గొనడానికి బెంగళూరు నుంచి కరీంనగర్ బయలుదేరారు. తన సోదరుడితో కలసి 2004, ఏప్రిల్ 17న హెలికాప్టర్‌లో బయలుదేరారు. నాడు జరిగిన ప్రమాదంలో వారిరువురూ మరణించారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009

ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రయాణమయ్యారు. తీవ్ర అననుకూల వాతావరణ పరిస్థితుల్లో ఆయన ప్రయాణిస్తున్న బెల్ 430 హెలికాప్టర్ నల్లమల అటవీప్రాంతంలో కూలిపోయింది.

సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ 2021



జనరల్ బిపిన్ రావత్.... దేశపు మొట్టమొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్. ఒక అధికారిక కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయన 2021, డిసెంబరు 8న సూలూరు ఎయిర్ బేస్ నుంచి వెల్లింగ్టన్ మిలటరీ కాలేజ్‌కు హెలికాప్టర్‌లో ప్రయాణమయ్యారు. ఆయన ప్రయాణిస్తున్న ఆర్మీ హెలికాప్టర్ తమిళనాడులోని కూనూరు సమీపంలో ప్రమాదానికి గురయింది. ఆ దుర్ఘటనలో జనరల్ బిపిన్, ఆయన భార్య సహా మరో 11 మంది దుర్మరణం పాలయ్యారు.

నేడు నీట్ ఫలితాలు

» రాష్ట్రంలో పరీక్షకు హాజరైన 72,507 మంది విద్యార్థులు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు మే 4న నిర్వహించిన నీట్ (యూజీ) పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. షెడ్యూల్ ప్రకారం జూన్ 14న నీట్ (యూజీ) ఫలితాలు విడుదల కావలసి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 190 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 72,507 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. గతేడాది ఆ సంఖ్య 77,849గా ఉంది. రాష్ట్రంలో 33 ప్రభుత్వ, రెండు డీమ్డ్ యూనివర్సిటీలతో కలిపి 29 ప్రైవేటు వైద్య కళాశాలలున్నాయి. వాటిలో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లుండగా.. అందులో 400 వరకు డీమ్డ్ యూనివర్సిటీల్లో ఉన్నాయి. వాటితో పాటు ఈఎస్ఐ సనత్‌నగర్ వైద్య కళాశాల, బీబీనగర్ ఏయిమ్స్‌లో కూడా సీట్లున్నాయి. దేశవ్యాప్తంగా ఈ ఏడాది నీట్ పరీక్షకు 20.8 లక్షల మంది హాజరయ్యారు. గతేడాది ఆ సంఖ్య 23.33 లక్షలుగా ఉంది. ఈ ఏడాది దరఖాస్తు చేసిన వారిలో 91.4 శాతం మంది పరీక్ష రాసినట్లు కేంద్రం వెల్లడించింది. .

మతకలహాల నియంత్రణకు స్పెషల్ యాక్షన్ ఫోర్స్

» దేశంలోనే తొలిసారి కర్ణాటకలో ఏర్పాటు

బెంగళూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మతకలహాల నియంత్రణ కోసం కర్ణాటకలో స్పెషల్ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్) ఏర్పాటైంది. దక్షిణ కన్నడ జిల్లా కేంద్రం మంగళూరులో స్పెషల్ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్) కార్యాలయాన్ని కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత కలహాల నియంత్రణకోసం దేశంలో తొలిసారి ప్రత్యేక ఫోర్స్‌ను కర్ణాటకలో ఏర్పాటు చేశామని తెలిపారు. దక్షిణ కన్నడ జిల్లాలో ఇటీవల వరుస హత్యలతో శాంతికి భంగం కలుగుతోందని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. నక్సల్స్ నియంత్రణ దళంలో పనిచేసిన సిబ్బంది ఎస్ఏఎఫ్‌లో ఉంటారని తెలిపారు. అవసరమైతే వారి సంఖ్య పెంచుతామని అన్నారు. ప్రస్తుతానికి ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో ఈ ఫోర్స్ పనిచేస్తుందని, అవసరమైతే అనుబంధమైన శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల్లోనూ విధులు నిర్వహిస్తుందని తెలిపారు. దక్షిణ కన్నడ జిల్లా.. విద్య, వాణిజ్య కేంద్రమని, ఇలాంటి చోట ఇటీవల మతకలహాలతో హత్యలు జరగడం బాధ కలిగిస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దినేశ్‌గుండూరావు అన్నారు. .

'ఫార్ములా-ఈ' కేసులో కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కారు కేసు విచారణలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని, కొన్ని డాక్యుమెంట్లను అందజేయాలని ఏసీబీ కోరినట్లు తెలిసింది. వాస్తవానికి ఈ కేసులో కేటీఆర్‌ను మరో సారి విచారణకు పిలవాలని నిర్ణయించిన ఏసీబీ అధికారులు.. గత నెలలోనే నోటీసు జారీ చేశారు. అయితే, ముందస్తు షెడ్యూల్ ప్రకారం తాను అమెరికా వెళ్తున్నానని వచ్చిన తర్వాత విచారణకు హాజరవుతానని కేటీఆర్ రాతపూర్వకంగా జవాబు ఇవ్వడంతో ఏసీబీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. హెచ్ఎండీఏ నుంచి యూకేలోని ఫార్ములా-ఈ ఆపరేషన్స్ సంస్థకు రూ.55కోట్ల చెల్లింపు వ్యవహారంలో మాజీ పురపాలక శాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిపై ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు పలుమార్లు విచారించారు. ఇందులో దాదాపు రూ.46కోట్లను బ్రిటిష్ పౌండ్ల రూపంలో చెల్లించడం రిజర్వ్‌బ్యాంక్ ఇండియా మార్గదర్శకాలకు విరుద్ధమని, దీని వల్ల హెచ్ఎండీఏ రూ.8కోట్ల జరిమానా చెల్లించాల్సి వచ్చిందని విచారణ అధికారులు గుర్తించారు. సచివాలయ బిజినెస్ నిబంధనల ఉల్లంఘనతోపాటు క్యాబినెట్ ఆమోదం లేకుండా నిధుల బదలాయింపు జరిగినట్లు తేల్చారు. తాజాగా కేటీఆర్ విచారణ తర్వాత ఈ కేసుకు సంబంధించిన చార్జిషీటును దాఖలు చేసేందుకు ఏసీబీ అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ఫార్ములా ఈ నోటీసుల పేరిట జోకర్‌లా సీఎం రేవంత్ నాటకాలు

దమ్ముంటే లైడిటెక్టర్ పరీక్షకు రావాలి: కేటీఆర్


పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేటీఆర్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పరిపాలన చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి ఫార్ములా ఈ నోటీసుల పేరిట జోకర్‌లా నాటకాలాడుతున్నారని, హామీలు అమలు చేయలేక ప్రజలదృష్టిని మళ్లించేందుకే పూటకోవిధంగా కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఫార్ములా ఈ రేసు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ అధికారిక బ్యాంకు ఖాతా నుంచి పారదర్శకంగా పంపిన రూ.44 కోట్లు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ ఖాతాలోనే ఉన్నాయని పేర్కొన్నారు. తనకు ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా, విచారణ పేరుతో సాగదీసినా ప్రయోజనం లేదన్నారు.. పదేళ్లకిందట నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్‌రెడ్డి కేసుకూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉందన్న విషయం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఇద్దరిపైకూడా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో.. తామిద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు సిట్టింగ్ జడ్జి సమక్షంలో టీవీ లైవ్‌లో లై డిటెక్టర్ పరీక్షకు తనతోపాటు దమ్ముంటే రేవంత్‌రెడ్డి కూడా సిద్ధం వాలని సవాల్ విసిరారు. తాజాగా ఏసీబీ నోటీసు వచ్చిందన్న కేటీఆర్.. సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరై అన్నివిధాలుగా సహకరిస్తానన్నారు. చిల్లర చేష్టలతో కక్షపూరిత రాజకీయాలు చేస్తున్న దద్దమ్మ రేంత్‌రెడ్డిని, అసమర్థ కాంగ్రెస్‌ను వదిలిపెట్టేదిలేదని, వెంటాడుతూనే ఉంటామని ఆయన హెచ్చరించారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం కేటీఆర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం మెరుగ్గానే ఉందని, సర్జరీ తర్వాత కోలుకుంటున్నట్లు పల్లా ఆయనకు వివరించారు.

మా వర్కింగ్ ప్రెసిడెంట్‌కే నోటీసులిస్తారా?

- కాంగ్రెస్ సర్కార్ కక్ష సాధింపు చర్యను ఖండిస్తున్నా
- మీ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం: కవిత



హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): "రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ సర్కార్ మళ్లీ నోటీసులిచ్చింది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఉద్దేశపూర్వకంగా కేసులు పెడుతూ.. మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటాం" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. ప్రతి సందర్భంలోనూ ప్రజా గాయకుడు గద్దర్ పేరును జపంచేసే కాంగ్రెస్ సర్కార్ ఆయన్ను అవమానించడం తగదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న సినీ అవార్డుల ఆహ్వాన పత్రికలో గద్దర్ ఫొటో లేకపోవడం బాధాకరమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కనీసం అవార్డుల పంపిణీ కార్యక్రమంలోనైనా గద్దర్ చిత్రపటాన్ని పెట్టి ఆయన్ను గౌరవించాలని కోరుతున్నానని పేర్కొన్నారు.

జాగ్రత్తగా ఉండండి!

అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు

డిబేట్‌లో ఇతరులతో చేయనివ్వొద్దు

సాక్షి యాంకర్ కొమ్మినేనికి సుప్రీం హెచ్చరిక

జైలు నుంచి విడుదలకు ఆదేశం



న్యూఢిల్లీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేయవద్దని, టీవీ డిబేట్‌లో ఇతరులను అసభ్యకర వ్యాఖ్యలు చేయనివ్వొద్దని సాక్షి చానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును సుప్రీంకోర్టు హెచ్చరించింది. అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలని స్పష్టంచేసింది. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సి అవసరం ఉందని, ఆయన వాక్ స్వాతంత్ర్యాన్ని, జర్నలిస్టు హక్కులను రక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఆయన్ను జైలు నుంచి విడుదల చేయాలని ఆదేశించింది. ట్రయల్ కోర్టు విధించే షరతులకు లోబడి బెయిల్ ఇస్తున్నట్లు పేర్కొంది. కొమ్మినేని దాఖలు చేసిన రిట్ పిటిషన్ శుక్రవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా, కొమ్మినేని తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ దవే, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఎవరైనా అసభ్యమైన వ్యాఖ్య చేస్తే.. మనం దానిని నవ్వుతూ తేలికగా తీసుకుంటాం. వారిని సహకుట్రదారులుగా పరిగణించలేం' అని జస్టిస్ మన్మోహన్ పేర్కొన్నారు. జస్టిస్ మిశ్రా కూడా ఆయనతో ఏకీభవించారు. దీంతో ధర్మాసనం కొమ్మినేనిని విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 8 వారాల్లో సమాధానమివ్వాలని ఆదేశించింది.

ఎన్నికల 'భరోసా'!

10-15 రోజుల్లోనే రైతులకు పెట్టుబడి సాయం

- చిన్నరైతులకే పరిమితం చేస్తే

6-7 వేల కోట్ల నిధులు సరిపోయే చాన్స్



హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా' పెట్టుబడి సాయం మరో 10-15 రోజుల్లోనే అందే అవకాశం కనిపిస్తోంది. జూలై నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం... ఆలోపే రైతు భరోసా పంపిణీని పూర్తి చేయాలని భావిస్తోంది. రైతుల ఖాతాల్లో వానాకాలం రైతు భరోసా జమచేసిన తర్వాతే స్థానిక ఎన్నికల నగారా మోగించనుంది. ఈ క్రమంలోనే నిధుల సమీకరణపై దృష్టి సారించింది. ఇటీవల రిజర్వుబ్యాంకు నుంచి రూ. 3 వేల కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. మరో రూ.4వేల కోట్లకు శుక్రవారం ఇండెంటు పెట్టింది. ఈ నిధులన్నీ సమకూరాక రైతులకు వానాకాలం పెట్టుబడి సాయాన్ని అందించనుంది.

1.30 కోట్ల ఎకరాల్లోనే సాగు..

రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల సాగు భూమి ఉన్నట్లుగా రికార్డుల్లో ఉంది. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున పంపిణీ చేయగా... ప్రతి సీజన్‌కు సుమారుగా రూ.7,500 కోట్లు అవసరమయ్యేవి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత యాసంగి(2024- 25) సీజన్‌లో పథకం పేరును రైతు భరోసాగా మార్చి, 2023- 24 యాసంగి సీజన్‌లో 1.52 కోట్ల ఎకరాలకు రూ.7,625 కోట్లు పంపిణీ చేసింది. రైతు బంధును ప్రక్షాళన చేసి కొత్త మార్గదర్శకాలు జారీ చేసేందుకు సమయం పడుతుందంటూ (2024- 25) వానాకాలం సీజన్‌లో రైతు భరోసా ఇవ్వలేదు. ఆ తర్వాత మొన్నటి యాసంగి సీజన్‌లో 57లక్షల మంది రైతులకు చెందిన 84 లక్షల ఎకరాలకు రూ. 5,058 కోట్లు మాత్రమే పంపిణీ చేసింది. 4 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అందించింది. ఇక, ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మొత్తం విస్తీర్ణానికి రైతు భరోసా ఇస్తారా? అప్పటి లాగే పెద్ద రైతులను మినహాయించి చిన్న, సన్నకారు రైతులకే పరిమితం చేస్తారా? అన్నది చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఏటా వానాకాలం సీజన్‌లో 1.30కోట్ల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తుంటారు. మరో 20 లక్షల ఎకరాలు వ్యవసాయ భూముల జాబితాలో ఉన్నప్పటికీ... సాగుకు యోగ్యంగా లేవు. దీంతో ఈ 20 లక్షల ఎకరాలను రైతు భరోసా నుంచి మినహాయించే అవకాశాలున్నాయి. 1.30లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇస్తే.. రూ.7,800 కోట్లు అవసరమవుతాయి. గత యాసంగి సీజన్ మాదిరిగా చిన్న, సన్నకారు రైతులకే భరోసాను పరిమితం చేస్తే.. రూ.6-7వేల కోట్లు సరిపోయే అవకాశం ఉంది. ఈ మేరకు, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిధుల సమీకరణలో నిమగ్నమైంది. ఈ నెల 10వ తేదీన ఆర్‌బీఐ నుంచి రూ.3వేల కోట్ల అప్పు తీసుకున్న సర్కారు.. తాజాగా శుక్రవారం మరో రూ.4 వేల కోట్ల రుణం కోసం ఇండెంటు పెట్టింది. ఈ సొమ్ము 17వ తేదీ నాటికి ఖజానాకు చేరనుంది. ఈ నిధులతోనే రైతుభరోసా అమలుచేయాలనే ఆలోచనలోప్రభుత్వం ఉంది.

రైతు భరోసా తర్వాతే స్థానిక సమరం

రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు కూడా వాయిదా పడుతూ వస్తున్నాయి. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత... 2024 జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించినా.. లోక్‌సభ ఎన్నికల కారణంగా సాధ్యం కాలేదు. ఆ తర్వాత కులగణన చేపట్టాలని, జనాభాలో ఎవరి వాటా ఎంతో తేలిన తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఆలస్యమైంది. ఎట్టకేలకు వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఆ లోపే ఒక కీలక పథకాన్ని అమలు చేయాలనే ఆలోచనతో ఉంది. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేశాక, ఎన్నికలకు వెళ్తే బాగుంటుందని రేవంత్ సర్కారు భావిస్తున్నట్లు తెలిసింది.

క్యాబినెట్ భేటీలో తుది నిర్ణయం

ఈ నెల నాలుగో వారంలో నిర్వహించనున్న మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, రైతు భరోసాపై చర్చించనున్నారు. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ నెలాఖరులో జారీ చేయాలా? జూలైలో ఎన్నికలు నిర్వహిస్తే.. ఏ తేదీల్లో నిర్వహించాలి? గ్రామపంచాయతీ ఎన్నికలు, ప్రాదేశిక (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ఎన్నికలు ఒకే నెలలో నిర్వహిస్తే ఎలా ఉంటుంది? లేకపోతే కొంత వ్యవధి ఇస్తే ఎలా ఉంటుంది? అనే అంశాలు చర్చకు రానున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపే రైతుభరోసా సాయాన్ని పంపిణీ చేయాలని భావిస్తున్న నేపథ్యంలో స్పష్టమైన తేదీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

జస్టిస్ సురేందర్‌కు ఘన వీడ్కోలు


వీడ్కోలు సమావేశంలో జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ సురేందర్

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ కే సురేందర్‌కు శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. మొదటి కోర్టు హాల్‌లో జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, ఏజీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ సురేందర్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన తన పదవీకాలంలో దాదాపు 23 వేల కేసులను పరిష్కరించారని తెలిపారు. కేసుల పరిష్కారంలో దేశవ్యాప్తంగా 13వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. హైకోర్టు బార్ అసోసియేషన్‌లో జరిగిన సమావేశంలో సీనియర్ న్యాయవాది వీ రఘునాథ్ మాట్లాడుతూ.. జస్టిస్ సురేందర్ బదిలీ ఏకపక్షంగా జరిగిందని పేర్కొన్నారు. నల్లకోటు వేసిన న్యాయవాదులుగా సమాజంలో ఎవరికి అన్యాయం జరిగినా మాట్లాడుతామని, అదే విధంగా జడ్జీలకు అన్యాయం జరిగినా ప్రతిఘటించి తీరుతామని స్పష్టంచేశారు. జస్టిస్ సురేందర్ మాట్లాడుతూ తొలుత జియాలజిస్టుగా, పైలట్‌గా కావాలని ప్రయత్నాలు చేశానని.. కానీ విధి తనను న్యాయవాదిగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ జగన్, కార్యదర్శి విజారత్ అలీ తదితరులు పాల్గొన్నారు.


ఎస్.సాయి శ్రీవల్లి


శుభశ్రీ సాహు


ఎ.శివారెడ్డి

జపాన్ పర్యటనకు ముగ్గురు తెలంగాణ విద్యార్థులు ఎంపిక

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైన్స్ పరిశోధనల్లో సత్తా చాటిన ముగ్గురు తెలంగాణ విద్యార్థులు జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో మొత్తం 54 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో నారాయణపేట గురుకుల పాఠశాల విద్యార్థి ఏ.శివారెడ్డి, మంచిర్యాల జిల్లా శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సాయి శ్రీవల్లి, కరీంనగర్ జిల్లా పరమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థిని శుభశ్రీ సాహు ఉన్నారు. వీరు ఈనెల 15 నుంచి 21 వరకు జపాన్‌లో పర్యటించనున్నారు. భారత్‌లోని యువ ఆవిష్కర్తలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జెఎస్‌టీ) ఈ కార్యక్రమాన్ని 2016 నుంచి నిర్వహిస్తోంది. ఇప్పటివరకు తెలంగాణ నుంచి 21 మంది విద్యార్థులు జపాన్‌లో పర్యటించారని రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) సంచాలకులు జి.రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.611 కోట్ల అగ్రిగోల్డ్ ఆస్తులు.. బాధితులకు అప్పగించేందుకు కోర్టు అనుమతి

హైదరాబాద్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ కంపెనీకి సంబంధించి గతంలో ఈడీ అటాచ్ చేసిన రూ.611 కోట్ల ఆస్తులను బాధితులకు అందించే ప్రక్రియకు నాంపల్లి కోర్టు అనుమతిచ్చింది. ఈ ఆస్తుల మార్కెట్ విలువ దాదాపు రూ.వెయ్యి కోట్లకు చేరిందని ఈడీ అధికారులు తెలిపారు. అగ్రి గోల్డ్ స్కామ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఈడీ జప్తు చేసిన రూ.3,950 కోట్ల ఆస్తులను బాధితులకు అప్పగించారు. బాధితులకు తిరిగి చెల్లించే ప్రక్రియలో మార్కెట్ విలువ ప్రకారం రూ.7,000 కోట్ల ఆస్తులను అప్పగించామని ఈడీ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుటుంబంతో ఉన్నా.. 'ఒంటరి' వేదన!

- తమను సరిగా పట్టించుకోవడంలేదనే బాధలో వృద్ధులు
- ప్రతికూల భావాలతో సతమతం అవుతున్న 54 శాతం మంది
- 'హెల్ప్‌ఏజ్ ఇండియా' అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో వృద్ధులను ఒంటరితనం భావన వేధిస్తోంది. వారి భావోద్వేగాలకు, యువతరం అవగాహనకు మధ్య అంతరంతో.. మానసిక అనుబంధం కరువు అవుతోంది. కుటుంబంతోనే కలిసి ఉంటున్నా.. ఇంట్లో ఎవరూ సరిగా పట్టించుకోవడం లేదంటూ మలి వయసువారు కుంగుబాటుకు లోనవుతున్నారు. భారత్‌లో దాదాపు 54 శాతం మంది ఇలా వృద్ధాప్యంలో ప్రతికూల భావాలతో సతమతం అవుతున్నారని, ముఖ్యంగా 47శాతం మంది 'ఒంటరి' భావన వేధిస్తోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. 'అండర్ స్టాండింగ్ ఇంటర్‌జనరేషనల్ డైనమిక్స్ అండ్ పర్సెప్షన్స్ ఆన్ ఏజింగ్' పేరిట ఈ అధ్యయన నివేదికను హెల్ప్‌ఏజ్ ఇండియా సంస్థ శుక్రవారం విడుదల చేసింది. జూన్ 15న ప్రపంచ వృద్ధుల వేధింపులపై అవగాహన దినోత్సవం నేపథ్యంలో.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, అహ్మదాబాద్, కాన్పూర్, మదురై, నాగ్‌పూర్ పట్టణాల్లో 5,798 మంది (70 శాతం 18-30 ఏళ్ల మధ్య వయస్కులు, 30 శాతం 60 ఏళ్ల పైబడిన వృద్ధులు)ని ప్రశ్నించి ఈ నివేదిక రూపొందించినట్లు తెలిపింది. కలిసి భోజనం చేస్తున్నా, తరచూ మాట్లాడుకుంటున్నా కూడా.. వృద్ధుల భావోద్వేగాలకు, యువత అవగాహనకు మధ్య తీవ్ర అంతరం నెలకొందని పేర్కొంది. పట్టణాల్లో వృద్ధుల్లో ఒంటరితనం భావన ఎక్కువగా ఉందని, సరైన గౌరవం దక్కడం లేదనే ఆలోచనలతో ఉన్నారని వెల్లడించింది. నేటి డిజిటల్ యుగంలో కమ్యూనికేషన్ టెక్నాలజీలు కూడా ఈ సమస్యకు దారితీస్తున్నాయని తెలిపింది.71% వృద్ధులు ఇప్పటికీ సాధారణ మొబైల్స్‌నే వాడుతున్నారని, కొత్త టెక్నాలజీలతో గందరగోళం పడుతున్నారని పేర్కొంది. స్మార్ట్ ఫోన్ల వంటివాటి వినియోగాన్ని నేర్పించడంలో యువత తీవ్ర అసహనం వ్యక్తం చేస్తుండటంతో పెద్ద వయసువారు బాధకు లోనవుతున్నారని వివరించింది. అయితే పెద్దల పట్ల నేటి యువతకు గౌరవం ఉందని, వారి పట్ల బాధ్యతతో మెలగాలని 76 శాతం మంది యువత కోరుకుంటున్నారని వెల్లడించింది. మరోవైపు యువత తమతో గడిపే సమయం ఆనందదాయకంగా ఉన్నా.. తాము చెప్పేది వినిపించుకోరని, తమ సలహాలను ఏమాత్రం పాటించడం లేదని వృద్ధులు నిట్టూరుస్తున్నారని తెలిపింది. వృద్ధులకు, యువతరానికి మధ్య పెరిగిపోతున్నఅంతరాన్ని పూడ్చేందుకు వెంటనే ప్రయత్నాలు ప్రారంభం కావాల్సి ఉందని నివేదిక పేర్కొంది.

తరాల మధ్య బంధాలను బలోపేతం చేయాలి

వయోవృద్ధుల సూచనలు యువతకు మేలుచేస్తాయని, కుటుంబాల్లో తరాల మధ్య బంధాలను బలోపేతం చేస్తే సమాజానికి మంచిదని పలువురు సామాజిక కార్యకర్తలు, వక్తలు అభిప్రాయపడ్డారు. హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో 'అంతర్జాతీయ వయో వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం' సదస్సు నిర్వహించి, అధ్యయన నివేదికను విడుదల చేశారు. చర్చాగోష్ఠిలో ప్రొఫెసర్ ఆర్కే మూర్తి, సామాజిక కార్యకర్త దామోదర్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రామ్ లీడర్ సాయిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్‌ను కలిసిన బాలకృష్ణ

- బసవతారకం ఆసుపత్రి రజతోత్సవాలకు ఆహ్వానం



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా సంస్థ 25వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి వేడుకల్లో పాల్గొనవలసిందిగా కోరారు. వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొనడానికి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

సివిల్స్ కోచింగ్ దరఖాస్తు గడువు జూలై 8

హైదరాబాద్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) పరీక్ష 2026కు హాజరయ్యే అభ్యర్థులు కోచింగ్ కోసం జులై 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జులై 25 నుంచి 2026 ఏప్రిల్ 30వరకు 150 మంది అభ్యర్థులకు సైదాబాద్ టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఇస్తామన్నారు. అభ్యర్థులు సంబంధిత పత్రాలతో ఈ నెల 16నుంచి జులై 8వరకు సైదాబాద్, లక్ష్మీనగర్ కాలనీ, రోడ్ నంబర్ 8లోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు నేరుగా సమర్పించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు (www.tgbcstudycircle.cgg.gov.in) ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఏఐజీ ఆస్పత్రిలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆస్పత్రి అధినేత, చీఫ్ గ్యాస్ట్రో ఎంటారాలజిస్టు డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి కేసీఆర్‌కు వైద్య పరీక్షలు చేశారు. కేసీఆర్‌కు సాధారణ గ్యాస్ట్రిక్ పరీక్షలు చేసినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.